www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 105
బుధవారం | 30-7-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి రా.2.42 తదుపరి సప్తమి, నక్షత్రం: హస్త రా.9.53 తదుపరి చిత్త, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.11.55-12.47, అమృతఘడియలు: మ.3.16-5.02, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.57, సూర్యాస్తమయం: 6.45
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యుద్ధం ఆపాలని నాకు ఎవరూ చెప్పలేదు

మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు మాట్లాడారు.. పాక్ భారీ దాడికి సిద్ధమవుతోందని బెదిరించారు

- అంతకు అంతా బదులిస్తామని.. బుల్లెట్‌కు శతఘ్నితో సమాధానం ఇస్తామని స్పష్టంగా చెప్పాను
- 'ఆపరేషన్ సిందూర్'తో మన సామర్థ్యం ఏమిటో ప్రపంచమంతటికీ తెలిసింది
- 22 నిమిషాల్లోనే ఉగ్రస్థావరాలు ధ్వంసం చేశాం
- సైనిక దళాలపై నమ్మకంతో స్వేచ్ఛ ఇచ్చాం
- 'చాలా దెబ్బతీశారు.. ఇక చాలు' అంటూ పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చింది
- పాక్ ఎయిర్‌బేస్‌లు ఇంకా ఐసీయూలో ఉన్నాయి
- ప్రపంచమంతా భారత్‌కు మద్దతుగా నిలిచింది
- కాంగ్రెస్ మాత్రం పాకిస్థాన్‌కు రిమోట్‌గా మారింది
- వాళ్ల రాజకీయ లబ్ధి కోసం చేసిన ఆరోపణలు సైనిక దళాల ఆత్మస్థైర్యంపై ప్రభావం చూపాయి
- 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం
- 'పహల్గాం' ముష్కరులను మట్టుపెట్టాం: షా
- కాంగ్రెస్ తప్పిదం వల్లే పాక్ ఏర్పడిందని విమర్శ


లోక్‌సభలో 'ఆపరేషన్ సిందూర్'పై నిర్వహించిన చర్చలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూలై 29: పహల్గాం ఉగ్రదాడి అంశంలో పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పేందుకు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఆపాలని ఏ ప్రపంచ నేత కూడా భారత్‌ను అడగలేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటు వేదికగా ప్రకటించారు. తానే భారత్, పాక్ యుద్ధాన్ని ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను తోసిపుచ్చేలా స్పష్టత ఇచ్చారు. మూడు దేశాలు తప్ప మొత్తం ప్రపంచ దేశాలన్నీ భారత్‌కే మద్దతు పలికాయని చెప్పారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం.. ఎంతో పరాక్రమం చూపిన మన సైనికులకు మద్దతుగా నిలవకుండా.. పాకిస్థాన్‌ను వెనకేసుకొచ్చేలా సందేహాలు వ్యక్తం చేశాయని మండిపడ్డారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో జరిగిన చర్చకు ప్రధాని మోదీ సమాధానం చెప్పారు. సుమారు

మిగతా 2వ పేజీలో...

పాక్‌తో పోరాడే సంకల్పమే మీకు లేదు

- బలగాల చేతులు కట్టేసి ఆపరేషన్ సిందూర్‌లోకి దించారు
- 1971 యుద్ధంతో పోలికా?
- అమెరికా ఒత్తిడి తెచ్చినా ఇందిర డోంట్ కేర్ అన్నారు: రాహుల్

పహల్గాం ఉగ్రవాదులను పట్టించిన శాటిలైట్ ఫోన్

అవకాశాల గని ఏపీ.. మీకిదే ఆహ్వానం

సింగపూర్ సీఈవోలతో సీఎం చంద్రబాబు


సింగపూర్‌లోని జురాంగ్ పెట్రోకెమికల్ ఐలాండ్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్

- సుదీర్ఘ తీరం అభివృద్ధికి ముఖద్వారం
- పోర్టులు, వాటి ఆధారిత పరిశ్రమలు, షిప్ బిల్డింగ్, టూరిజంలో అవకాశాలు
- అమరావతిలో తొలి క్వాంటమ్ వ్యాలీ
- ఇందులో పెట్టుబడులు పెట్టండి
- డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ బెస్ట్
- గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ సహా పలు ఐటీ కంపెనీలు వస్తున్నాయ్
- లాజిస్టిక్ కారిడార్‌గా కాకినాడ-మచిలీపట్నం-కృష్ణపట్నం
- ప్రపంచ శ్రేణి రిఫైనరీ రానుంది: సీఎం
- పారిశ్రామికవేత్తలతో రౌండ్‌టేబుల్ భేటీ

అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. సుదీర్ఘ తీరప్రాంతం పెట్టుబడులకు గమ్యస్థానమని, అభివృద్ధికి ముఖద్వారమని తెలిపారు. తీర ప్రాంతాన్ని ఆదాయార్జన వనరుగా మార్చుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. సింగపూర్ పర్యటనలో భాగంగా మూడోరోజు మంగళవారం ఆయన పలు కంపెనీల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో)లతో సమావేశమయ్యారు. సింగపూర్ కంపెనీలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. జురాంగ్ పెట్రోకెమికల్ ఐలాండ్‌ను కూడా సందర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన వెంట మంత్రులు లోకేశ్, పి.నారాయణ, టీజీ భరత్ తదితరులు పాల్గొన్నారు. సీఈవోలతో మారిటైం ఆపరేషన్స్, మౌలిక వసతుల కల్పనపై ఆయన చర్చించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో గ్లోబల్ భాగస్వాములుగా కలసి రావాలని కోరారు. ఏపీలో అన్ని అవకాశాలను

మిగతా 13వ పేజీలో...



ఏపీ, అమరావతి అభివృద్ధిలో భాగస్వామిగా ఉంటాం

- 2019లో ప్రభుత్వం మారాక సహకారానికి బ్రేక్
- చంద్రబాబుతో చర్చించాక కొనసాగించాలని నిర్ణయించాం: సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్

సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో ముఖ్యమంత్రి చంద్రబాబు

13

ఆసియా మార్కెట్‌కు.. ఏపీ వ్యూహాత్మక గమ్యస్థానం

- పారిశ్రామిక ప్రోత్సాహకాలతో పాలసీలు
- అందుబాటులో నైపుణ్య యువత: లోకేశ్
- వివిధ సంస్థల అధిపతులతో సమావేశాలు





పంటల బీమాకు జగన్ ఎగనామం

ఉచితమంటూ.. ఉత్తుత్తి మాటలు!

- ఐదేళ్లలో మూడేళ్లు ఫసల్ బీమాను పట్టించుకోలేదు
- లోక్‌సభలో ప్రకటించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్

అమరావతి, న్యూఢిల్లీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేశామని గొప్పలు చెప్పిన నాటి సీఎం జగన్ తన ఐదేళ్ల పాలనలో మూడేళ్లపాటు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతు వాటాగా నయాపైసా చెల్లించలేదని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. దీంతో ఫసల్ బీమా యోజన కింద రైతులకు బీమా సొమ్ము ఎగనామం పెట్టిన విషయం తేటతెల్లమైంది. మంగళవారం లోక్‌సభలో ఎంపీ హనుమాన్ బేణీవాలా అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

మిగతా 12వ పేజీలో...

సంతకాల సాక్షిగా..

దొరికిపోయిన జగన్!?

- ఏరికోరి వాసుదేవరెడ్డికి కీలక పోస్టులు
- నీటిపారుదలలో నియమించాలన్నా నాటి సీఎస్
- కాదు.. బేవరేజెస్ ఎండీ పోస్టు ఇవ్వాలని జగన్ ఆదేశం
- ఆపై డిస్టిలరీస్ కమిషనర్ పోస్టు కూడా అప్పగింత
- మద్యం స్కామ్‌లో ఆ రెండు విభాగాలే కీలకం
- వైసీపీ ఉన్నన్నాళ్లూ వాటిలో వాసుదేవ రెడ్డే
- 'సీఎంవో' పేరుతోనే చాణక్య 'ముడుపుల' కాల్స్
- ఆయన ప్రభుత్వ పెద్దల మనిషే అని ధ్రువీకరించిన వాసుదేవ రెడ్డి



లిక్కర్ కేసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాత్రను మరింత స్పష్టంగా నిర్ధారించే ఆధారాలు బయటపడుతున్నాయి. సాంకేతిక ఆధారాలే కాదు... సంతకాల సాక్షిగా జగన్ దొరికిపోయినట్లు తెలుస్తోంది. కేంద్ర సర్వీసుల నుంచి ఏరికోరి తెచ్చుకున్న వాసుదేవ రెడ్డికి స్వయంగా జగనే బేవరేజెస్, డిస్టిలరీస్ పగ్గాలు అప్పగించినట్లు వెల్లడైంది. రూ.3500 కోట్ల మద్యం స్కామ్‌లో 'సిట్' ఇప్పటికే ప్రాథమిక చార్జిషీటు దాఖలు చేసింది. అందులో... జగన్ పాత్ర గురించి పలు సందర్భాల్లో స్పష్టంగా వివరించింది. ముడుపులు ఇచ్చేందుకు అంగీకరించే కంపెనీలకు మాత్రమే ఆర్డర్లు... డిస్టిలరీల నుంచి కమీషన్ల వసూలు! మద్యం స్కామ్‌కు ఇదే మూలం! ఈ రెండు విభాగాలను వైఎస్ జగన్ ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌కు చెందిన వాసుదేవరెడ్డికి అప్పగించారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

2019లో వైసీపీ అధికారంలోకి రాగానే వాసుదేవ రెడ్డి రాష్ట్రానికి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఆయనను నీటి పారుదల శాఖలో నియమించాలని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ... జగన్ దీనిని మార్చేశారు. ఆయనను ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) ఎండీగా నియమించాలని ఫైలుపై రాసి సంతకం చేశారు. పోస్టింగులలో అంతిమ నిర్ణయం ముఖ్యమంత్రిదే కావడంతో

మిగతా 14వ పేజీలో...


జస్టిస్ బట్టు దేవానంద్‌ను సత్కరిస్తున్న హైకోర్టు లాయర్ల సంఘం

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేవారిపై చర్యలు తప్పనిసరి

- లేదంటే 5 కోట్ల మంది జీవించే హక్కుకు భంగకరం
- అభివృద్ధికి కోర్టులూ తమ పరిధిలో సాయమందించాలి
- తప్పుచేసినవారు భయపడాలి
- నేరస్థుడికి ఊరట దొరికే పరిస్థితి ఉండకూడదు
- అది కోర్టులకు, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు
- వాక్ స్వాతంత్ర్యం పేరుతో ఇతరుల గౌరవానికి భంగం కలిగించే హక్కు ఏ ఒక్కరికీ లేదు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

14

సత్కరించిన ఏపీ హైకోర్టు లాయర్ల సంఘం



సరస్వతి పవర్ షేర్ల బదిలీ నిలిపివేత

- తల్లి, చెల్లిపై జగన్ వ్యాజ్యం.. ట్రిబ్యునల్‌లో అనుకూల తీర్పు
- విజయలక్ష్మి ఢిల్లీ ట్రిబ్యునల్‌కు వెళ్లే చాన్స్

14

తల్లికి ఆస్తిలో వాటా ఇవ్వకపోవడం గెలుపా జగన్?



- తల్లిని, చెల్లిని కోర్టుకు లాగడం అనైతికం కాదా?
- డబ్బే ముఖ్యమనుకునే నీవు ప్రజాజీవితానికి అర్హుడివా
- 'సరస్వతి' షేర్లలో జగన్ తీరుపై మంత్రి అనిత ఫైర్

కాలేజీలపై కుళ్లు రాతలు!



ఇంటర్‌లో అడ్మిషన్లపై రోత పత్రిక అవాకులు

- ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినా.. తగ్గిపోయినట్టు ప్రచారం
- గతేడాదితో పోలిస్తే పెరిగిన అడ్మిషన్లు
- 2023-24 కంటే 18 శాతం పెరుగుదల
- 2024-25 కంటే 3,206 అదనం
- జగన్ జిల్లా కడపలోనూ పెరిగిన సంఖ్య
- ప్రైవేటు కళాశాలల్లోనే తగ్గిన విద్యార్థులు
- ఇంటర్‌పై పదోతరగతి ఫలితాల ప్రభావం
- అయినా ప్రభుత్వ కాలేజీల అడ్మిషన్లు పైపైకే
- రోత పత్రిక రాతలను ఖండించిన బోర్డు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

నిజంగా తప్పు జరిగితే దానిని ఎత్తి చూపించడం కాదు! లేని తప్పులను 'సృష్టించి' ప్రభుత్వంపై బురదజల్లడమే జగన్ రోత పత్రిక నైజం! ఈ క్రమంలోనే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు దారుణంగా పడిపోయాయంటూ ఒక కథనాన్ని వండి వార్చింది. ప్రభుత్వ కాలేజీలన్నీ ఖాళీ అయిపోయాయని, ఎక్కడా విద్యార్థులు లేరన్నట్టుగా వాపోయింది. ఇంటర్ విద్యాశాఖ ఈ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టింది. ఈ శాఖ గణాంకాల ప్రకారం ఇంటర్ ఫస్టియర్‌లో 2023-24లో 67,148 మంది అడ్మిషన్లు పొందితే, 2024-25లో 71,632 మంది చేరారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆ సంఖ్య 74,838కి పెరిగింది. అంటే 3206 మంది అదనంగా ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకున్నారు. కాగా గతేడాది

మిగతా 12వ పేజీలో...

సాగర్ గేట్లెత్తారు 18 ఏళ్ల తర్వాత తొలిసారి జూలైలోనే నీటి విడుదల

14


నాగార్జున సాగర్ డ్యాం 26 గేట్ల ద్వారా దిగువకు ప్రవహిస్తున్న నీరు

నేడే నింగిలోకి నిసార్ నిఘా నేత్రం

- ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధం
- జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా కక్ష్యలోకి
- ప్రారంభమైన 27:30 గంటల కౌంట్‌డౌన్
- నేటి సాయంత్రం 5:40గంటలకు నింగిలోకి

11


షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్

భారత్-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్.. నా అంతరాత్మ ఒప్పుకోదు: ఒవైసీ

రక్తం-నీరు కలిసి ప్రవహించని చోట మ్యాచ్ ఎందుకని వ్యాఖ్య



న్యూఢిల్లీ, జూలై 29: ఆసియా కప్-2025లో భారత్-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ సెప్టెంబరు 14న జరగాల్సి ఉండగా.. ప్రతిపక్షాలు కూడా దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. 'ఆపరేషన్ సిందూర్'పై ప్రత్యేక చర్చ సందర్భంగా లోక్‌సభలో మాట్లాడిన ఒవైసీ.. భారత్-పాక్ మ్యాచ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "రక్తం-నీళ్లు కలిసి ప్రవహించలేవు అని మనం ప్రకటించాం. అలాంటప్పుడు పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడుతారా? పాక్ విమానాలు మన గగనతలంలోకి రావు. వారి పడవలు మన ప్రాదేశిక జలాల్లోకి రావు. పాక్‌తో వాణిజ్య సంబంధాలను పూర్తిగా నిలిపివేశాం. అలాంటి దేశంతో క్రికెట్ మ్యాచ్ ఎలా ఆడతాం?" అని ఆయన నిలదీశారు. ఒకవేళ ఈ మ్యాచ్ జరిగినా.. దాన్ని వీక్షించడానికి తన అంతరాత్మ అంగీకరించదన్నారు.

'భారత్ వైపే' మాట్లాడతా!

కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ నర్మగర్భ వ్యాఖ్య



న్యూఢిల్లీ, జూలై 29: 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీలో వివాదాలు రాజుకున్నాయి. ఈ చర్చలో కీలక నేతలు శశిథరూర్, మనీశ్ తివారీలు పాల్గొనకుండా పార్టీ పక్కన పెట్టింది. ఈ వ్యవహారంపై శశిథరూర్ మౌనంగా ఉండగా.. మనీశ్ మాత్రం సోషల్ మీడియాలో నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. "నేను భారత్‌వైపే మాట్లాడతా." అని పేర్కొన్నారు. పాత హిందీ సినిమా 'పూరబ్ ఔర్ పశ్చిమ్'లోని ఓ పాటలో చరణాన్ని ఆయన పోస్టు చేశారు. ఒక భారతీయుడిగా తాను భారత వైభవాన్నే కోరుకుంటానని దానర్థం. 'ఆపరేషన్ సిందూర్'పై ప్రపంచ దేశాలకు వివరించేందుకు కేంద్రం పంపిన ప్రతినిధుల బృందంలో శశిథరూర్, మనీశ్ తివారీలు ఉన్నారు. ఈ పోస్టుపై మీడియా ప్రశ్నించగా.. "నా మౌనాన్ని మీరు అర్థం చేసుకోకపోతే.. నా మాటలను మీరు ఎప్పటికీ అర్థం చేసుకోలేరు." అని వ్యాఖ్యానించారు.

మోదీది పెద్ద మనసు:సుప్రియా సూలే



న్యూఢిల్లీ, జూలై 29 : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) శరదపవార్ వర్గం నేత, బారామతి ఎంపీ సుప్రియా సూలే లోక్‌సభ వేదికగా ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టేందుకు దారితీసిన పరిస్థితులను ప్రపంచానికి చెప్పే విషయంలో ప్రతిపక్షాలపై నమ్మకం ఉంచిన ప్రధాని మోదీది పెద్ద మనసు అని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారం జరిగిన చర్చలో భాగంగా సుప్రియా సూలే ఈ వ్యాఖ్యలు చేశారు.

యుద్ధం ఆపాలని నాకు ఎవరూ చెప్పలేదు



ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా మంగళవారం లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

రెండు గంటల పాటు ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించామని చెప్పడంతోపాటు కాంగ్రెస్‌పై విమర్శల తూటాలు ఎక్కుపెట్టారు. చివరగా పాకిస్థాన్‌కూ హెచ్చరికలు జారీ చేశారు.

బుల్లెట్‌కు శతఘ్నితో సమాధానం

ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తనతో మాట్లాడారని ప్రధాని మోదీ వెల్లడించారు. "మే 9న రాత్రి నాతో మాట్లాడేందుకు జేడీ వాన్స్ మూడు, నాలుగు సార్లు కాల్ చేశారు. సైనికాధికారులతో సమావేశాలతో బిజీగా ఉన్నాను. చివరికి కాల్ మాట్లాడాను. పాకిస్థాన్ భారీ దాడి చేయబోతోందని జేడీ వాన్స్ నన్ను హెచ్చరించారు. పాకిస్థాన్ దాడి చేస్తే భారత్ అంతకు మించి బదులిస్తుందని.. వారు బుల్లెట్లు వాడితే మేం శతఘ్నులతో బదులిస్తామని ఆయనకు స్పష్టం చేశాను. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ఆపాలని ప్రపంచంలో ఏ దేశానికి చెందిన ఏ నేత కూడా భారత్‌ను అడగలేదు. ఐక్యరాజ్యసమితిలో కేవలం మూడు దేశాలు మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడాయి. మిగతా అన్ని ప్రపంచ దేశాల నుంచి భారత్‌కే మద్దతు లభించింది. కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ మన దేశ సైనికులకు మద్దతుగా నిలవలేదు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ నేతలు నన్ను లక్ష్యంగా చేసుకుని గుప్పించిన అవివేకమైన ఆరోపణలు.. సైన్యం నైతిక విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి" అని మోదీ మండిపడ్డారు.

మన సామర్థ్యమేమిటో ప్రపంచానికి తెలిసింది

ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఆయుధాలు, రక్షణ వ్యవస్థల్లో డొల్లతనం ఏమిటో, భారత్ దేశీయంగా అభివృద్ధి చేసిన డ్రోన్లు, క్షిపణుల ప్రతాపం ఏమిటో ప్రపంచానికి తెలిసిందని ప్రధాని మోదీ చెప్పారు. "పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా కేవలం 22 నిమిషాల్లో పాకిస్థాన్ భూభాగంలో లోపలి ప్రాంతాల్లో ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. మరునాడు భారత్‌పై దాడికి పాల్పడితే.. పాకిస్థాన్‌పై క్షిపణుల వర్షం కురిపించాం. భారత్ దాడులతో పాకిస్థాన్‌లోని ఎయిర్‌బేస్‌లు ఎంతగా దెబ్బతిన్నాయంటే.. ఇంకా ఐసీయూలోనే ఉన్నాయి. పాకిస్థాన్‌కు పరిస్థితి ఏమిటో అర్థమైపోయి.. అణ్వస్త్ర దాడులంటూ బెదిరింపులకు దిగింది. కానీ ఏ తొందరపాటు నిర్ణయం తీసుకున్నా.. ఆపరేషన్ సిందూర్ మొదలు సింధు నది (సింధు జలాల ఒప్పందం) వరకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పాకిస్థాన్‌కు తెలుసు. ఎలాంటి దాడి చేసినా మరింత భారీ స్థాయిలో ప్రతిదాడి ఉంటుందని అర్థమైంది. అందుకే ఏమీ చేయలేకుండా ఉండిపోయింది" అని మోదీ చెప్పారు. 'చాలా దెబ్బ తీశారు. ఇక చాలు (బహుత్ మారా. బస్ కరో)' అంటూ పాకిస్థాన్ డీజీఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్) కాళ్లబేరానికి వచ్చారని పేర్కొన్నారు. 'ఒకవేళ మీరు ఏమైనా చేయదలిస్తే.. ఫలితం చాలా దారుణంగా ఉంటుంది' అని హెచ్చరించామని తెలిపారు. దేశంలో ఇంతకుముందూ ఉగ్రదాడులు జరిగాయని, ఏం చేసినా తమకేమీ కాదని వాటి సూత్రధారులు ధైర్యంగా ఉండేవారని.. కానీ ఇప్పుడు భారత్ వెంటాడుతుందని వారికి అర్థమైందని చెప్పారు.

పాకిస్థాన్ ప్రతినిధుల్లా కాంగ్రెస్, మిత్రపక్షాలు

కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దురదృష్టవశాత్తూ పాకిస్థానీ తప్పుడు ప్రచారానికి ప్రతినిధులుగా మారిపోయాయని ప్రధాని మోదీ మండిపడ్డారు. భారత్ అన్ని అంశాల్లో స్వయం సమృద్ధి సాధిస్తే.. కాంగ్రెస్ మాత్రం పాకిస్థాన్ మీదే ఆధారపడిందని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడిపై పాకిస్థాన్ పాడిన పాటే కాంగ్రెస్ పాడుతుండటాన్ని, పాకిస్థాన్‌కు రిమోట్ కంట్రోల్‌లా మారిపోవడాన్ని చూసి దేశమంతా విస్తుపోయిందని వ్యాఖ్యానించారు. దేశంలో ఉగ్రవాదం పెచ్చరిల్లుతున్న సమయంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చూసీచూడనట్టు వదిలేసిందని.. ఉగ్రవాద నిరోధక చట్టాలను నిర్వీర్యం చేసిందని మోదీ ఆరోపించారు. గాంధీ కుటుంబం ఒత్తిడితో పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడవద్దని కాంగ్రెస్ నేతలకు విజ్ఞప్తి చేశారు. ఇక కాంగ్రెస్ ఎంపీలు శశిథరూర్, మనీశ్ తివారీలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఆపరేషన్ సిందూర్‌పై ప్రపంచ దేశాలకు ప్రజెంటేషన్ ఇవ్వడానికి వెళ్లిన బృందాల్లోని కొందరు నేతలు పార్లమెంటులో మాట్లాడకుండా కాంగ్రెస్ నిలువరించిందని విమర్శించారు.

మీకు అద్దాన్ని చూపేందుకే ఇలా నిలబడ్డా..

పహల్గాం ఘటన మన దేశంలో అల్లర్లు రేపేందుకు జరిగిన కుట్ర అని, దాన్ని మన దేశ ఐక్యత విఫలం చేసిందని మోదీ చెప్పారు. ఉగ్రవాదుల ప్రధాన స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేశామని, అందుకే ఈ పార్లమెంటు సమావేశాలను విజయోత్సవాలని చెబుతున్నానని తెలిపారు. "నేను భారత్ తరఫున నిలబడి ఉన్నాను. దీన్ని అర్థం చేసుకోలేని వారికి వారి ముఖం చూసుకునేలా అద్దాన్ని చూపడానికి నిలబడ్డాను. ఉగ్రవాదులకు, వారిని ప్రోత్సహిస్తున్నవారికి ఊహించలేని రీతిలో బుద్ధిచెబుతామని నేను ముందే చెప్పాను. మన సైనికదళాల సామర్థ్యంపై పూర్తి నమ్మకం పెట్టుకున్నాం. దీటుగా స్పందించేలా స్వేచ్ఛను ఇచ్చాం. మనవాళ్లు ఇచ్చిన సమాధానం చూసి.. ఉగ్రవాదులు, వారి వెనుకున్నవారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.." అని ప్రధాని పేర్కొన్నారు.

ఉగ్రవాదుల అంతం కోసం తేదీలు చూడాలా?

పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పార్లమెంటు సమావేశాల సమయంలోనే హతం చేయడం ఏమిటంటూ కాంగ్రెస్, ఇతర పక్షాలు చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ మండిపడ్డారు. "అసలు వాళ్లకు ఏమైంది? బాగా నిరాశ చెందినట్లున్నారు. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఏమయ్యారని వారే అడిగారు. మోదీ ఓడిపోయాడంటూ సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడు మేం ఉగ్రవాదులను హతం చేస్తే ఏడుస్తున్నారు. ఉగ్రవాదులను అంతం చేయడానికి తేదీలు చూడాలా? ఈ తీరును చూసి దేశమంతా నవ్వుతోంది" అని పేర్కొన్నారు. ఆక్రమిత కశ్మీర్‌ను వెనక్కి తీసుకురావడం లేదేమని కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని.. అసలు దేశ విభజనకు అంగీకరించినదెవరని, కశ్మీర్‌ను ఆక్రమించుకునే అవకాశం ఎవరిచ్చారని మోదీ ప్రశ్నించారు. పాక్‌తో సింధూ నది ఒప్పందం ఎవరు చేసుకున్నారని నిలదీశారు. నది మనది, నీళ్లు పాకిస్థాన్‌కు అనేలా చేశారని, నాటి తప్పులకు ఇప్పటికీ శిక్ష అనుభవిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇప్పుడు సింధు ఒప్పందం నిలిపివేత వంటి చర్యలతో వాటిని సరిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

లోకం తీరు



పాక్ దాడిలో అనాథలైన 22మంది చిన్నారులను దత్తత తీసుకోనున్న రాహుల్

న్యూఢిల్లీ, జూలై 29: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తన ఉదారతను చాటుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ కాల్పులతో అనాథలైన చిన్నారుల బాధ్యతను తీసుకునేందుకు ముందుకొచ్చారు. తల్లిదండ్రులు, కుటుంబాలను కోల్పోయిన పూంఛ్ జిల్లాకు చెందిన 22 మంది చిన్నారులను రాహుల్ దత్తత తీసుకోనున్నట్లు జమ్మూకశ్మీర్ కాంగ్రెస్ చీఫ్ తరీఖ్ అహ్మద్ వెల్లడించారు. ఆ చిన్నారుల గ్రాడ్యుయేషన్ పూర్తయ్యేవరకు వారి విద్య, వైద్యం, ఇతర ఖర్చులన్నీ రాహుల్ చూసుకోనున్నట్లు చెప్పారు. త్వరలోనే వీరికి తొలి విడత సాయం అందజేస్తామని తెలిపారు.

ఇజ్రాయెల్‌పై మోదీ మౌనం వంచనే: సోనియా

న్యూఢిల్లీ, జూలై 29: గాజాపై ఇజ్రాయెల్ దాడులు మానవత్వాన్ని మంటగలుపుతున్నా మోదీ ప్రభుత్వం మౌన ప్రేక్షకురాలిగా ఉండటం గర్హనీయమని సోనియాగాంధీ అన్నారు. ఇది రాజ్యాంగ విలువల పట్ల వంచనాత్మక విద్రోహమని ఆమె దుయ్యబట్టారు. మోదీ లజ్జాపూరిత మౌనం, తారస్థాయికి చేరిన నైతిక వంచన తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయని దైనిక్ జాగరణ్ అనే హిందీ పత్రికకు రాసిన వ్యాసంలో సోనియా పేర్కొన్నారు. అమాయక ఇజ్రాయెలీలపై హమాస్ జరిపిన అనాగరిక దాడులను సమర్థించాల్సి అవసరం లేదన్నారు. కానీ, ఆ దాడులకు ప్రతిస్పందనగా గాజాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను కేవలం విపరీత చేష్టలుగా చూడలేమని, అది కచ్చితంగా హంతక నేరమేనని సోనియా స్పష్టం చేశారు. బలహీనుల పక్షం వహించి వారి హక్కుల కోసం గట్టిగా మాట్లాడిన ఉజ్వల చరిత్ర భారత్‌కు ఉన్నదని, ఆ వారసత్వాన్ని కొనసాగించాలని మోదీకి సోనియా సూచించారు.

పాక్‌తో పోరాడే సంకల్పమే లేదు



బలగాల చేతులు కట్టేసి ఆపరేషన్ సిందూర్‌లోకి దించారు


» అందుకే కొన్ని విమానాలను మనం కోల్పోవాల్సి వచ్చింది: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 29: పెహల్గాం ఉగ్రదాడి ఘటనకు ప్రతీకారంగా పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పేందుకు మనదేశం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన తీరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఆక్షేపించారు. పాకిస్థాన్‌తో పోరాటం చేసేందుకు ప్రభుత్వానికి రాజకీయ సంకల్ప బలమే లేకుండాపోయిందని విమర్శించారు. సాయుధ బలగాల చేతులను కట్టేసి, పాక్‌పై దాడికి దిగాలని ఆదేశించారని దుయ్యబట్టారు. భారత్-పాక్ మధ్య సంఘర్షణను నివారించానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే ప్రకటిస్తున్నప్పటికీ ఆయన చెబుతోంది అబద్ధం అని ప్రధాని మోదీ ఎందుకు చెప్పలేకపోతున్నారు? అని రాహుల్ ప్రశ్నించారు. మంగళవారం లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. పెహల్గాం ఘటనలో మృతులకు ఆయన సంతాపం ప్రకటించారు. దాడికి ప్రతీకారంగా బలగాలు, ప్రభుత్వం తీసుకోబోయే చర్యలపై ఇండీ కూటమి ఒక్కతాటిపై నిలిచి మద్దతు పలికిందని గుర్తు చేశారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్‌ను, 1971 నాటి యుద్ధంతో పోల్చడాన్ని రాహుల్ గాంధీ తప్పుబట్టారు. 1971లో జరిగిన యుద్ధంలో రాజకీయ సంకల్పం ఉందన్నారు. మనదేశంపై అమెరికా ఒత్తిడి చేసినా, తన నౌకాదళాన్ని హిందూ మహాసముద్రంలో మోహరించినా నాటి ప్రధాని ఇందిరా గాంధీ వెనక్కు తగ్గలేదన్నారు. అమెరికా.. విమాన వాహక నౌకతో వస్తున్నా ఇందిర డోంట్ కేర్ అన్నారని.. 'బంగ్లాదేశ్‌లో మేం ఏం చేయాలనుకున్నామో అది చేసితీరుతాం' అని అమెరికాకు ఆమె స్పష్టం చేశారని చెప్పారు. ఆమె ఆలోచనలో గందరగోళం లేదని.. దీన్నే 'రాజకీయ సంకల్ప బలం' అంటారని రాహుల్ నొక్కి చెప్పారు. పాక్‌తో యుద్ధం చేసేందుకు రాజకీయ సంకల్ప బలం లేదన్న విషయాన్ని ఒకరకంగా రక్షణమంత్రి రాజ్‌నాథే పాక్‌కు చెప్పారని రాహుల్ ఆరోపించారు. అర్ధరాత్రి 1:35 గంటలకు పాక్‌కు ఫోన్ చేసి.. సైనికేతర లక్ష్యాలపైనే దాడి చేశామని.. ఉద్రిక్తతలను పెంచడం తమ లక్ష్యం కాదని చెప్పినట్లుగా స్వయంగా రాజ్‌నాథే వెల్లడించడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. మిలటరీ లక్ష్యాలను టార్గెట్ చేసుకోరంటే.. దానర్థం, పోరాటానికి రాజకీయ సంకల్పం లేనట్లేనన్నారు. ఇది.. 'మేం మీకు లెంపకాయ వేశాం. మరిన్ని లెంపకాయలు వేయబోం' అన్నట్లుగానే ఉందన్నారు. పాక్ మిలటరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాయుసేన స్థావరాలపై దాడి చేయకూడదనే నిర్దేశించడంతోనే భారత్ కొన్ని ఎయిర్‌క్రాఫ్ట్‌లను కోల్పోవాల్సి వచ్చిందని ఇండోనేషియాలోని భారత రక్షణ అధికారి కెప్టెన్ శివ కుమార్ చెప్పారని రాహుల్ పేర్కొంటూ.. ఇది బలగాల చేతులు కట్టేయడం కాకపోతే మరేమిటి? అని ప్రశ్నించారు. కాగా పెహల్గాం ఘటనలో భద్రతా వైఫల్యానికి హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు.

అమిత్ షా.. సమాధానం చెప్పండి: ప్రియాంక

శత్రుదేశమైన పాకిస్థాన్‌కు దారులన్నీ మూసుకుపోయి.. దిక్కుతోచని పరిస్థితిలో పడ్డప్పుడు మనదేశం అకస్మాత్తుగా యుద్ధాన్ని ఎందుకు ఆపాల్సి వచ్చింది? అని మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. అర్ధంతరంగా యుద్ధాన్ని ఆపడం దేశచరిత్రలోనే మొదటిసారి అని.. పైగా పాక్‌తో మనదేశం యుద్ధాన్ని ఆపుతున్నట్లుగా అమెరికా అధ్యక్షుడు ప్రకటన చేశారని ఆమె గుర్తుచేస్తూ.. ఇది ప్రధాని మోదీ బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. నాయకత్వం అంటే క్రెడిట్ తీసుకోవడం మాత్రమే కాదని, బాధ్యత తీసుకోవడం కూడా అని మోదీని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. పహల్గాం ఉగ్రదాడి ఘటన కేంద్ర ప్రభుత్వం, ఇంటెలిజెన్స్ అదిపెద్ద వైఫల్యం అని దునుమాడారు. ఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారు? హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేశారా? బాధ్యత తీసుకుంటున్నట్లుగానైనా ప్రకటించారా? అని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌తో కాళ్లబేరానికి రావడం మినహా పాక్‌కు మరో అవకాశం లేకపోయిందని షా చెబుతున్నారని.. అయితే శత్రుదేశానికి ఆ అవకాశం ఎందుకిచ్చారు? అని ఆమె నిలదీశారు.

'పహల్గాం' ముష్కరులను మట్టుపెట్టాం



ఆపరేషన్ మహాదేవ్‌లో సులేమాన్, అఫ్గానీ, జిబ్రాన్ హతమయ్యారు

» ఈ ముగ్గురూ ఉగ్రదాడిలో పాల్గొన్నారు
» అందుకు పక్కా ఆధారాలు ఉన్నాయి
» లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి షా

న్యూఢిల్లీ, జూలై 29: పహల్గాం మారణకాండలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదులను మన భద్రతా బలగాలు హతమార్చాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీరు పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ మహాదేవ్‌లో ఉగ్రవాదులను కాల్చి చంపినట్లు వెల్లడించారు. పహల్గాం దాడిలో పాల్గొన్నది వీరేనని పక్కా ఆధారాలతో గుర్తించినట్లు అమిత్ షా తెలిపారు. మంగళవారం లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ మహాదేవ్‌లో మరణించిన ఉగ్రవాదులను సులేమాన్ అలియాస్ ఫైజల్, అఫ్గానీ, జిబ్రాన్‌గా గుర్తించినట్లు చెప్పారు. సులేమాన్, అఫ్గానీలు లష్కరే తాయిబాలో ఏ క్యాటగిరీ కమాండర్లని, జిబ్రాన్ కూడా కరడుగట్టిన ఉగ్రవాది అని తెలిపారు. పహల్గాం దాడికి ముందు వీరికి ఆశ్రయం కల్పించి, భోజనం పెట్టిన వారిని భద్రతాదళాలు అదుపులోకి తీసుకున్నాయని.. ప్రస్తుతం వారే ఈ ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించారని వివరించారు. ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న రెండు ఏకే-47 రైఫిళ్లు, ఒక ఎం-9ను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపగా.. పహల్గాం దాడిలో వాడిన బుల్లెట్లు ఈ తుపాకుల నుంచి వచ్చినవేనని ఆరుగురు నిపుణులు తనకు వీడియో కాల్ చేసి చెప్పారని షా వెల్లడించారు. మరణించిన ఇద్దరు ఉగ్రవాదుల నుంచి రెండు పాకిస్థాన్ ఓటరు ఐడీ కార్డులతో పాటు పాక్‌లో తయారైన చాక్లెట్లు, ఆయుధాలను కూడా మన బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను జమ్మూకశ్మీరులోకి పంపుతోందని, కశ్మీరులో స్థానిక ఉగ్రవాదులు ఎవరూ లేరని షా స్పష్టం చేశారు. ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చిన వార్త విని అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ ఎంతో సంతోషిస్తారని భావించానని.. విపక్ష సభ్యుల ముఖాలు మాత్రం దిగాలుగా ఉన్నాయని చురకలంటించారు. అన్ని రకాల ఉగ్రవాదానికి పాకిస్థానే మూలం అని.. కాంగ్రెస్ చేసిన తప్పిదం వల్లే పాకిస్థాన్ ఉద్భవించిందని ఆరోపించారు. వారు విభజనను వ్యతిరేకించి ఉంటే.. పాకిస్థాన్ అనేదే ఉండేది కాదని అన్నారు. 1948లో మన సాయుధ బలగాలు పాక్ ఆక్రమిత కశ్మీరును స్వాధీనం చేసుకొనే స్థితిలో ఉండగా.. నాటి ప్రధాని నెహ్రూ ఏకపక్షంగా కాల్పుల విరమణను ప్రకటించారని అమిత్ షా గుర్తుచేశారు. 1971లో 93 వేల మంది పాక్ సైనికులు మనకు లొంగిపోయారని, 15 వేల చదరపు కిలోమీటర్ల మేర పాకిస్థాన్ భూభాగం మన అధీనంలో ఉందని.. అయినా పీవోకేను తిరిగి తీసుకోలేకపోయారని చెప్పారు. 1962లో చైనాతో యుద్ధం సమయంలో నాటి ప్రధాని నెహ్రూ ఆకాశవాణిలో ప్రసంగిస్తూ అసోంకు వీడ్కోలు పలికారన్నారు.

ఆధారాలు ఇస్తా

చిదంబరం వ్యాఖ్యలపై అమిత్ షా స్పందిస్తూ.. హోం మంత్రిగా చేసిన వ్యక్తి అలాంటి మాటలు మాట్లాడడం చాలా దురదృష్టకరమని చెప్పారు. "వాళ్లు ఏం నిరూపించాలనుకుంటున్నారు? ఎవరిని రక్షించాలని చూస్తున్నారు? ఉగ్రవాదులు పాకిస్థానీలు కాదని చెబుతున్నారు. తద్వారా మాజీ హోం మంత్రి చిదంబరం పాకిస్థాన్‌కు క్లీన్‌చిట్ ఇవ్వాలని చూస్తున్నారు" అని షా ధ్వజమెత్తారు. ఉగ్రదాడిలో పాక్ ప్రమేయాన్ని యావత్ ప్రపంచం అంగీకరించగా.. చిదంబరం మాత్రం సందేహాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఆధారాలు కావాలని చిదంబరం అడిగితే తాను ఇస్తానని అమిత్ షా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన 2008లో జరిగిన సంఘటనను గుర్తుచేశారు. ఢిల్లీలోని బాట్లా హౌస్‌లో దాక్కొన్న ఇద్దరు ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాదులను మన బలగాలు కాల్చి చంపాయని, ఆ వార్త తెలిసిన సోనియా కన్నీళ్లు పెట్టుకోవడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. అలాంటి కాంగ్రెస్‌కు ఉగ్రవాదంపై ఏం చర్యలు తీసుకున్నారని తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదన్నారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్రవాదంపై ఆ దేశం చర్యలు తీసుకోలేకపోతే సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ చెప్పారు. పీవోకే భారత్‌లో కలిసే రోజు ఎంతో దూరంలో లేదన్నారు.

ఖర్గేకు నడ్డా క్షమాపణ

రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో ఖర్గే గంటకుపైగా ప్రసంగించారు. అనంతరం బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ.. ఖర్గే మతిస్థిమితం కోల్పోయినట్లున్నారని, అందుకే ప్రధాని మోదీపై ఇష్టానుసారం విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. నడ్డా వ్యాఖ్యలపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నడ్డా క్షమాపణలు చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. స్పందించిన నడ్డా.. "నా వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటున్నా. ఒకవేళ ఖర్గేను నా వ్యాఖ్యలు బాధించి ఉంటే, క్షమాపణ చెబుతున్నా" అన్నారు.

ఉగ్రవాదులను పట్టించిన శాటిలైట్ ఫోన్



సులేమాన్

న్యూఢిల్లీ, శ్రీనగర్, జూలై 29: పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్‌ను.. అతడి ఇద్దరు సహచరులను మట్టుబెట్టిన మన భద్రతా దళాలు అసలు వారి ఉనికిని ఎలా పసిగట్టాయి? వారి దాకా ఎలా చేరుకున్నాయి? అంటే.. ఆ వివరాలన్నింటినీ అమిత్ షా లోక్‌సభ సాక్షిగా వెల్లడించారు. 26 మంది ప్రాణాలను బలిగొన్న పహల్గాం ఉగ్రదాడి జరిగిన రోజు రాత్రి నుంచే ఆపరేషన్ మహాదేవ్ ప్రారంభమైందని.. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదుల గుర్తింపును ధ్రువీకరించుకోవడానికి, వారిని వేటాడడానికి కొన్ని నెలల సమయం పట్టిందని ఆయన వెల్లడించారు. పహల్గాం దాడి వెనుకే కాక.. 2024 అక్టోబరులో సోనామార్గ్ పట్టణానికి సమీపంలోని గగన్‌గిర్‌లో జరిగిన ఉగ్రదాడి వెనుక కూడా సులేమాన్ హస్తం ఉందని అమిత్ షా చెప్పారు. ఏప్రిల్ 22న పహల్గాం దాడి జరిగినప్పటి నుంచి సులేమాన్, హంజా అఫ్గానీ, జిబ్రాన్‌ను హతం చేసే దాకా జరిగిన పరిణామాలను ఆయన వివరించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం..

- పహల్గాం ఉగ్రదాడి జరిగిన రోజున ప్రభుత్వం భద్రతా సమావేశం నిర్వహించింది. ఆ మర్నాడు కూడా (ఏప్రిల్ 23న) ఇండియన్ ఆర్మీ, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులతో మరో భేటీ నిర్వహించారు. ఉగ్రవాదులు ఎట్టిపరిస్థితుల్లోనూ భారత్‌ను దాటి పాకిస్థాన్‌లో ప్రవేశించకుండా అడ్డుకోవాలని నిర్ణయించారు. మే 22వ తేదీన.. దాచిగాం ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలపై ఇంటెలిజెన్స్ బ్యూరోకి సమాచారం అందింది.
- ఉగ్రవాదుల సిగ్నల్స్‌ను పట్టుకోవడానికి మన ఇంటెలిజెన్స్ ఆర్మీ.. దేశీయంగా తయారుచేసిన పరికరాలనే ఉపయోగించాయి. అప్పట్నుంచీ ఉగ్రవాదుల సిగ్నల్స్‌ను వెతుకుతూ.. మన ఆర్మీ, నిఘా, సీఆర్పీఎఫ్ అధికారులు ఉత్తకాళ్లతో పలు పర్వతాలను అధిరోహించారు.
- ఎన్ఐఏ అధికారులు తమ దర్యాప్తులో భాగంగా బాధితులు, పహల్గాంలో గుర్రాలు నడిపేవారు (పోనీవాలాలు), పర్యాటకులు, ఫొటోగ్రాఫర్లు, స్థానిక దుకాణదారులు.. ఇలా 1055 మందితో.. 3000 గంటలకు పైగా మాట్లాడారు. వారంతా చెప్పిన వివరాల ఆధారంగా ఉగ్రవాదుల ఊహాచిత్రాలు గీయించారు. పర్యాటకులను కాల్చిచంపిన ఉగ్రవాదులకు.. ఆశ్రయం ఇచ్చిన బషీర్, పర్వేజ్‌లను ఎన్ఐఏ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు.
- ఏప్రిల్ 21వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో ఉగ్రవాదులు బైసారన్‌లోయకు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గుడిసె వద్దకు వచ్చారని.. వారు ఏకే-47 తుపాకులను, ఎం9 రైఫిళ్లను ధరించి ఉన్నారని.. తమ వద్ద భోజనం చేశారని బషీర్, పర్వేజ్ తెలిపారు. ఇలా నెలల తరబడి సేకరించిన సమాచారం ఆధారంగా వేట కొనసాగించిన మన దళాలకు జూలై 22న ఆ ఉగ్రవాదుల జాడ తెలిసింది.

రెండుసార్లు సంకేతం..

ఆపరేషన్ మహదేవ్ గురించి విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం.. ఉగ్రవాదులు ఉపయోగించిన చైనీస్ ఉపగ్రహ ఫోన్ నుంచి శనివారం వచ్చిన సంకేతంతో ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. అప్పటికి 17 రోజుల క్రితం అదే తరహా సంకేతం వచ్చి ఉండడంతో.. అది ఉగ్రవాదులకు సంబంధించేనని భావించి వేట కొనసాగించారు. ఆ సంకేతం ఆధారంగా డ్రోన్ల సాయంతో వారిని అన్వేషిస్తూ శ్రీనగర్ శివార్లలో ఉన్న దాచిగాం అడవులు, జబర్వాన్ పర్వత శ్రేణిలో.. మహదేవ్‌పీక్ సమీపంలోని ముల్నార్ పీక్ వద్దకు చేరుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక.. 2 గంటల సమయంలో సులేమాన్ బృందం తమ వద్ద ఉన్న టీ82 అల్ట్రాసెట్ కమ్యూనికేషన్స్ డివైస్‌ను ఆన్ చేసింది. దాన్ని మన దళాలు గుర్తించాయి. సోమవారం ఉదయం డ్రోన్‌తో వారి జాడ కోసం గాలించాయి. డ్రోన్ పంపిన విజువల్స్ ఆధారంగా వారు ఉన్న స్థలాన్ని గుర్తించారు. ఉదయం 10 గంటల సమయంలో.. ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్ ఉగ్రవాద నిర్మూలన దళం, 4 పారా స్పెషల్ ఫోర్సెస్‌తో కలిసి మహదేవ్ శిఖరంపైకి ఎక్కడం ప్రారంభించారు. అరగంటలోపే ఉగ్రవాదులు ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. 11 గంటల సమయంలో వారిపై కాల్పులు జరిపి మట్టుబెట్టారు. 11.45 గంటలకల్లా ఆపరేషన్ మహదేవ్ ముగిసింది.



మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడు

హెచ్‌ఎం సారు.... మందు కొట్టి వచ్చారు!

సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు

కమలాపురం రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలను క్రమశిక్షణలో నిర్వహించాల్సిన ప్రధానోపాధ్యాయుడే గతి తప్పాడు. ఫుల్లుగా తాగేసి పాఠశాలకు వచ్చాడు. విషయం తెలిసి కలెక్టర్ అతడిని సస్పెండ్ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం మండలం పెద్దచెప్పలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి మంగళవారం ఫుల్లుగా మద్యం సేవించి మత్తులో తూగుతూనే పాఠశాలకు వచ్చాడు. కుర్చీలో కూర్చుని టేబుల్‌మీద తలపెట్టుకుని పడుకున్నాడు. మద్యం మత్తులో తూగుతున్న ప్రధానోపాధ్యాయుడిని మీడియా ప్రశ్నించగా మద్యం తాగడం తప్ప తాను వేరే తప్పు చేయలేదని సమర్థించుకున్నాడు. ఆయన రోజూ తాగేసి పాఠశాలకు వస్తారని ఇతర ఉపాధ్యాయులు తెలిపారు. అందరూ కలసి ఆయనను పాఠశాల నుంచి నుంచి పంపించేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈవో అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులను పిలిపించి ఒక్కొక్కరి అభిప్రాయాలను లిఖితపూర్వకంగా తీసుకున్నారు. కాగా.. కమలాపురం మండలం పెద్దచెప్పలి హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి మద్యం తాగి పాఠశాలకు వెళ్లిన విషయం మీడియాలో రావడంతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆయనను సస్పెండ్ చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డీఈవో ఆదేశించారు.

శ్రీవారికి స్వర్ణ శంఖు, చక్రాల కానుక





బంగారు శంఖు,చక్రాలను అందజేస్తున్న సుదర్శన్ ఎంటర్ ప్రైజెస్ ప్రతినిధులు

తిరుమల, జూలై29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి మంగళవారం బంగారు శంఖు,చక్రాలు కానుకగా అందాయి. చెన్నైకి చెందిన సుదర్శన్ ఎంటర్ ప్రైజెస్ ప్రతినిధులు సుమారు రూ.2.40 కోట్ల విలువైన దాదాపు రెండున్నర కేజీల బరువు కలిగిన బంగారు శంఖు, చక్రాలను రంగనాయక మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

హైదరాబాద్ నగరం మల్కాజ్‌గిరిలోని వసంతపురి కాలనీకి చెందిన సునీతాదేవి, కనకదుర్గాప్రసాద్ దంపతులు రూ.18.75 లక్షల విలువైన తమ ఇంటిని మంగళవారం శ్రీవారికి విరాళంగా అందజేశారు. ఈమేరకు వీలునామా పత్రాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.



ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్... మావోయిస్టు మృతి

» ఐఈడీ పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

చింతూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు ఒకరు మృతి చెందాడు. ఈనెల 28 నుంచి ఆగస్టు మూడు వరకు మావోయిస్టులు అమరవీరుల వారోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చిన క్రమంలో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. అదే సమయంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. గాయపడ్డ జవాన్లను సుక్మా ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలంలో పేలుడు సామగ్రి, మావోయిస్టులు వినియోగించిన సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

మంత్రాలయం మఠానికి రూ.5.46 కోట్లు హుండీ ఆదాయం

మంత్రాలయం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. గత 35 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని మంగళవారం గురు రాజాంగణ భవనంలో లెక్కించారు. రూ.5,46,06,555 నగదు సమకూరినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి తెలిపారు.

ఏనుగుల సంచారంపై వాట్సాప్ ద్వారా అప్రమత్తం చేయండి

» అటవీ ప్రాంతంలోకి మళ్లించేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలి

» అటవీ శాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగులు గుంపులుగా సంచరిస్తున్న క్రమంలో అటవీ సిబ్బంది గ్రామాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. మంగళవారం అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏనుగు గుంపుల సంచారం, పంట పొలాల ధ్వంసం, ఇటీవల ఏనుగుల దాడిలో రైతు దుర్మరణం... తదితర అంశాలపై సమీక్షించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఏనుగుల గుంపు సంచరిస్తూ, పొలాలను ధ్వంసం చేసిన ఘటనపై అటవీ అధికారులు ఆయనకు వివరణ ఇచ్చారు. నాలుగు పిల్ల ఏనుగులతో సహా 11 ఏనుగులు గుంపు కల్యాణి డ్యాం సమీపంలోని సత్యసాయి ఎస్టీ కాలనీ దగ్గర పొలాలు, తోటలు ధ్వంసం చేశాయని, డ్రోన్ల ద్వారా ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. దీనిపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ... ఏనుగులు ఎటు వైపు వెళ్తున్నాయో పరిశీలించడానికి డ్రోన్లు వినియోగిస్తున్న క్రమంలో అవి వెళ్లే అవకాశమున్న మార్గాల్లోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు పంపాలని సూచించారు. ఏనుగుల కదలికలు, హెచ్చరిక సందేశాలు పంపడాన్ని డీఎఫ్ఓ, పీసీసీఎఫ్ కార్యాలయాలు పర్యవేక్షించాలన్నారు. ఏనుగుల గుంపు పొలాలపై పడకుండా, అటవీ ప్రాంతంలోకి మళ్లించేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

సీబీఐ వలలో ఐటీ ఇన్‌స్పెక్టర్

» మొబైల్ షాపు యజమాని నుంచి రూ.5లక్షలు డిమాండ్

విజయవాడ/విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ షాపు యజమాని నుంచి భారీగా ముడుపులు డిమాండ్ చేసిన ఆదాయ పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ సీబీఐ అధికారులకు చిక్కాడు. ఓ మధ్యవర్తి నుంచి డబ్బులు తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. ఏలూరు రామచంద్రరావుపేటలో ఉన్న సెల్‌ఫోన్ సర్వీస్ షాపు యజమానిపై విజయవాడలోని ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ కార్యాలయానికి పలు ఫిర్యాదులు అందాయి. వాటిని ఏలూరు జిల్లా పరిధికి చెందిన ఇన్‌స్పెక్టర్ బి.రామచంద్రరావుకు అధికారులు విచారణ నిమిత్తం ఇచ్చారు. సెల్‌ఫోన్ సర్వీస్ షాపు యజమానికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉండేందుకు, విచారణకు ఆయనను పిలవకుండా ఉండేందుకు ఐటీ ఇన్‌స్పెక్టర్ రూ.5 లక్షలు డిమాండ్ చేశాడు. ఏలూరు జిల్లా పాలగూడేనికి చెందిన రాజు అలియాస్ రాజారత్నం మధ్యవర్తిగా రూ.1.20 లక్షలకు బేరం కుదిర్చాడు. రూ.20 వేలు మధ్యవర్తికి, ఐటీ ఇన్‌స్పెక్టర్‌కు రూ.లక్ష ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా ఆ మధ్యవర్తి వ్యాపారి నుంచి రూ.70 వేలు తీసుకుని ఐటీ ఇన్‌స్పెక్టర్‌కు ఇస్తుండగా సీబీఐ అధికారులు పట్టుకున్నారు. ఐటీ ఇన్‌స్పెక్టర్‌తోపాటు మధ్యవర్తిని అరెస్టు చేశారు. వారిని సీబీఐ కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది.



సమావేశంలో ప్రసంగిస్తున్న అలపర్తి విద్యాసాగర్

ఉద్యోగుల గౌరవం కోసం పోరాటం

» ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్

గుంటూరు(తూర్పు), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ప్రయోజనాలు సాధించే విషయంలో ఎట్టి పరిస్థితులలో రాజీ పడబోమని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. మంగళవారం గుంటూరు ఏపీ ఎన్‌జీవో సంఘ సాంస్కృతిక సమావేశ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ...ఉద్యోగులకు రావల్సిన జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలను కొంత మేరకు కూటమి ప్రభుత్వం చెల్లించిందని మిగతా వాటిని సాధించేందుకు రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తోందన్నారు. బకాయిలు కంటే ఉద్యోగుల గౌరవం కోసం సంఘం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. జీపీఎఫ్, సరెండర్ లీవులు, ఈహెచ్ఎస్ ఇతర సేవలు కింద రూ. 1850 కోట్ల కోసం ప్రతి ఏడాది ఆయా కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్నారు. గత బకాయిలను తొలి దశలో దాదాపు రూ. 7వేల కోట్లను విడుదల చేయటం, పెన్షనర్లకు అదనపు క్యాంటమ్ పెన్షన్ ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయాలు హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ మాట్లాడుతూ ఉద్యోగ నాయకుల సమష్టి కృషితో తాము ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు సాధించుకుంటామని చెప్పారు. తొలుత భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహమద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు.

కరేడు రైతులకు ఎకరాకు రూ.20లక్షలు

» ఫలించిన కలెక్టర్ చర్చలు

» భూసేకరణ ప్రక్రియలో కీలక పరిణామం

నెల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు ప్రాంతంలో ఇండోసోల్ పరిశ్రమకు చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుమారు వంద ఎకరాలకు సంబంధించిన రైతులు, ఇండోసోల్ ప్రతినిధులు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం రాత్రి నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌తో చర్చించారు. పరిహారం పెంపు, ఉపాధి కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. భూసేకరణ చట్టం ప్రకారం ఎకరాకు రూ.12.50 లక్షలు పరిహారంగా ఇచ్చేలా ఇది వరకే నిర్ణయించారు. అయితే ఆ మొత్తాన్ని రూ.20 లక్షలకు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. ఇక ఈ భూముల్లో హార్టికల్చర్, ఆక్వాకల్చర్ సాగు ఉంటే అదనంగా ఎకరాకు రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకూ ఇవ్వనున్నారు. అలాగే కరేడు ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతో 30 వేల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని, అందులో కనీసం 6 వేల ఉద్యోగాలు స్థానికులకు దక్కుతాయని కూడా కలెక్టర్ రైతులకు వివరించారు. భూములు కోల్పోయిన ప్రతీ కుటుంబానికి ఒక ఉద్యోగం దక్కుతుందని తెలిపారు. దీంతో రైతులు సానుకూలంగా స్పందించారు. రూ.20 లక్షల చొప్పున ధర ఇస్తే భూములు ఇచ్చేందుకు అభ్యంతరం లేదని రైతులు అధికారులకు చెప్పినట్లు సమాచారం. ఈ చర్చలపై కలెక్టర్ ఆనంద్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చిన రైతులకే ఈ ధర వర్తిస్తుందని స్పష్టం చేశారు. రైతులతో చర్చించేందుకు తామెప్పుడూ సిద్ధంగానే ఉన్నామని వెల్లడించారు.

ఐదు టీటీడీ పెద్ద హోటళ్లకు టెండర్ల ఖరారు

» 18 గంటల పాటు జరిగిన ప్రక్రియ

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఐదు టీటీడీ పెద్ద హోటళ్లకు టెండర్ల ఖరారయ్యాయి. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఇకపై బ్రాండెడ్ హోటళ్ల నిర్వాహకులకే టీటీడీ హోటళ్లను కేటాయించాలని టీటీడీ బోర్డు తీర్మానించిన విషయం తెలిసిందే. ఎక్కువ ధరకు టెండరు వేసే వారికి హోటళ్లను కేటాయించడం ద్వారా వారు భక్తులపై ఆ భారాన్ని మోపుతున్నారని టీటీడీ భావించింది. అందుకని ఈసారి ముందస్తుగానే హోటళ్లకు అద్దెను నిర్ణయించి కొన్ని ప్రత్యేక నిబంధనలతో ఓపెన్ టెండర్లను ఆహ్వానించింది. రూ.5 కోట్ల టర్నోవర్, పదేళ్ల అనుభవం, పలు ప్రాంతాల్లో హోటళ్లను సమర్థంగా నిర్వహిస్తున్నట్టు ఆధారాలు వంటి వివిధ రకాల ఆంక్షలను విధించింది. ఈ క్రమంలో పెద్ద హోటళ్ల కోసం దాదాపు 102 దరఖాస్తులు టీటీడీకి అందాయి. దీంతో సోమవారం ఉదయం తిరుమలలోని రెవెన్యూ కార్యాలయంలో ఎస్టేట్, విజిలెన్స్, హెల్త్ విభాగాల ఆధ్వర్యంలో టెండర్ల కోసం వచ్చి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మొదలైంది. ఒక్కో అప్లికేషన్‌కు పదుల సంఖ్యలో పత్రాలున్న క్రమంలో పరిశీలన ప్రక్రియ మంగళవారం వేకువజాము 5 గంటల వరకు కొనసాగింది. టీటీడీ నిబంధనల ప్రకారం అర్హులైన వారి అప్లికేషన్లను డిప్ తీయగా హైదరాబాద్‌కు చెందిన రెండు సంస్థలు, చెన్నై, ముంబై, గుజరాత్‌కు సంబంధించి సంస్థలకు టెండర్లు ఖరారయ్యాయి. వీటిని మరోసారి పరిశీలించి బోర్డు తీర్మానం తర్వాత హోటళ్లను ఆయా సంస్థలకు అప్పగించేలా టీటీడీ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు.

కాంట్రాక్టు సంస్థలకు వత్తాసా..!

పనులు పూర్తికాకపోయినా ఏజెన్సీలకు కితాబులిస్తారా?

» ఆ ఈఈలు ఇద్దరికీ షోకాజ్ నోటీసులు ఇవ్వండి

» జల వనరుల శాఖ అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం

» హంద్రీనీవా, వెలిగొండ పనులపై ఉన్నతాధికారులతో సమీక్ష

» నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులు సాగకపోవడంపై అసంతృప్తి

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయనప్పటికీ కాంట్రాక్టు సంస్థలకు వత్తాసు పలికేలా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కితాబులివ్వడంపై మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో మంగళవారం హంద్రీనీవా, వెలిగొండ పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులు కాంట్రాక్టు సంస్థలను వెనకేసుకొచ్చేలా మాట్లాడటంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు బ్రాంచి కెనాల్‌లో 0 నుంచి 22 కిలోమీటర్లు, 26 నుంచి 75 కిలోమీటర్ల వరకు పనులు చేయాల్సిన కాంట్రాక్టు ఏజెన్సీ సకాలంలో పనులు పూర్తి చేయలేదు. చేసిన పనికూడా సక్రమంగా చేయలేదు. అయితే వాస్తవాన్ని మరుగుపరిచి కాంట్రాక్టు సంస్థను వెనకేసుకొస్తూ, సంస్థ పనులను వేగంగా చేస్తోందంటూ హంద్రీనీవా డివిజన్-8, పెనుగొండ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.మురళి సమావేశంలో చెప్పారు. దీనిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను తప్పుదోవ పట్టించేలా మాట్లాడిన ఈఈ మురళికి చార్జ్‌మెమోను ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌లో 75వ కిలోమీటరు నుంచి 207వ కిలోమీటరు వరకూ ప్రవాహం ఆగిపోవడంపై మంత్రి అసంతృప్తిని వ్యక్తం చేశారు ఈ పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ 0 కిలోమీటర్ల నుంచి చివరిదాకా పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీవద్దని మంత్రి స్పష్టం చేశారు. ఈ కెనాల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వి.వెంకటేశ్వర్లు పనులు సకాలంలో పూర్తి చేయకపోవడం, సమావేశాలకు గైర్హాజరు కావడం, హెడ్ క్వార్టర్స్‌లో నివసించకపోవడం వంటి కారణాలతో ఆయనకు మూడు చార్జి మెమోలను ఇవ్వాలని నిమ్మల ఆదేశించారు.

వెలిగొండ పనుల జాప్యంపై నిలదీత

వెలిగొండ ప్రాజెక్టులో టన్నెల్స్ బెంచింగ్ పనులు 1,025 మీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులు అన్ని 2025 జూన్‌కి పూర్తి చేస్తామని, ఆ తర్వాత డిసెంబరుకు, మళ్లీ 2026 మార్చికి... పూర్తి చేస్తామంటూ కాంట్రాక్టు సంస్థ వాయిదా వేయడంపై మంత్రి నిమ్మల అసంతృప్తిని వ్యక్తం చేశారు. లక్ష్యం విషయంలో చెప్పిన దానికి కట్టుబడి ఉండాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థకు, పనులు పూర్తి చేయించాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులకూ ఉంటుందని విస్పష్టంగా పేర్కొన్నారు. టన్నెల్స్‌లో బెంచింగ్ పూర్తయితే కాని లైనింగ్ చేయడానికి కుదరదని నిమ్మల అన్నారు. బెంచింగ్ పూర్తికాగానే లైనింగ్‌ను పూర్తి చేస్తామని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. టన్నెల్‌లో ఉన్న టీబీఎం మిషన్ తొలగింపునకు ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్నామని జల వనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఫీడర్ కెనాల్ రోజువారీ పనులు కూడా నిర్దేశించిన దానికి కంటే 50 శాతం వెనుకబడి ఉన్నాయని మంత్రి చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టును 2026 జూన్ నాటికి పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయాలని నిమ్మల ఆదేశించారు.

పారిశ్రామికవేత్తలను భయపెట్టడానికే వైసీపీ దుష్ప్రచారం

నా కుటుంబం అధికార దుర్వినియోగానికి పాల్పడలేదు

» కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత పరిశ్రమనే నెలకొల్పాం

» జగన్ పత్రిక కథనంపై మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలను భయపెట్టడానికే వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశ్రామికాభివృద్ధికి వైసీపీ అడుగడుగునా అడ్డుపడే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం బెంగళూరు నుంచి ఆయన ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. 'రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలను వైసీపీ గందరగోళపరుస్తోంది. మా కుటుంబం ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలో ఆగిరిపల్లి మండలం తోటపల్లి వద్ద నిర్మించనున్నది కంప్రెస్డ్ గ్యాస్ ఉత్పత్తి పరిశ్రమ. ఇది పూర్తి వ్యవసాయ ఆధారిత పరిశ్రమ. వాహనాలు, పరిశ్రమలు గ్యాస్‌ను వినియోగించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పరిశ్రమను మరింత విస్తృతపరచడానికి అనేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఈ పరిశ్రమ ఏర్పాటులో నా పదవిని దుర్వినియోగపరచలేదు. ఈ పరిశ్రమకు కావల్సిన ప్రధాన వనరైన టన్ను నేపియర్ గడ్డి కోసం 40 ఎకరాల భూమి అవసరం. అంటే సుమారు 800 ఎకరాలు అవసరం. ఈ భూమికి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున కౌలు చెల్లింపు చేస్తారు. ప్రతి ఏటా పది శాతం పెంపుదల ఉంటుంది. సదరు భూమి ప్రభుత్వ వేస్ట్ ల్యాండ్ నుంచి గాని లేదా రైతుల దగ్గర నుంచి గాని తీసుకోకపోతే ఈ పరిశ్రమ నడపడం సాధ్యంకాదు. ఇవన్నీ ప్రభుత్వ నిబంధనలే. నా మీద వ్యతిరేకత ఉన్న కొంతమంది రాజకీయవేత్తలు చేస్తున్న ప్రచారాలలో వాస్తవాలను తెలుసుకోకుండా, నిబంధనలు అమలు జరిగాయా లేదా అనేది పరిశీలించకుండా జగన్ పత్రిక ఇలా దుష్ప్రచారం చేయడం సరికాదు' అని మంత్రి పార్థసారథి అన్నారు.

పీ4 కింద 410 మంది నిరుపేద క్రీడాకారుల ఎంపిక

» శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), జూలై 29(ఆంధ్రజ్యోతి): పీ4 పథకం కింద 410మంది నిరుపేద క్రీడాకారులను ఎంపిక చేసినట్టు శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు తెలిపారు. మంగళవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ... 'వివిధ క్రీడల్లో ప్రతిభ చాటుతున్న 410మంది నిరుపేద క్రీడాకారులను గుర్తించాం. ఆర్థికస్తోమత లేనికారణంగా వీరంతా గల్లీలకే పరిమితమవుతున్నారు. పీ4 పథకం ద్వారా వీరిని పైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఎంపిక చేసిన వారిని దాతలకు అప్పగించే చర్యలు చేపట్టాం. ఇప్పటికే పాతికమందికిపైగా దాతలకు అప్పగించాం' అని తెలిపారు. ఈ ప్రతిపాదనలను ప్రవాసాంధ్రులకు పంపినట్టు తెలిపారు. ఇటీవల తన అమెరికా పర్యటనలో పీ4 పథకం కింద క్రీడాకారుల దత్తతకు సుముఖంగా ఉన్నామని పలువురు చెప్పారన్నారు. ఇటీవల సీఎస్ఆర్ ఫండ్(కార్పొరేట్ సామాజిక బాధ్యత)ద్వారా గ్రీన్‌కో(సోలార్ కంపెనీ) రూ.21కోట్లు వితరణ చేయగా, కర్నూలులోని ఓర్వకల్లులో క్రీడాప్రాంగణం, మౌలిక సదుపాయాల పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే అమరావతిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'దివ్య' విజయం

ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్‌లో చాంపియన్‌గా అవతరించి పందొమ్మిదేళ్ల దివ్యా దేశ్‌ముఖ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఫైనల్లో తనకంటే ఎంతో అనుభవజ్ఞురాలైన తెలుగమ్మాయి కోనేరు హంపిపై విజయం సాధించి చిరుప్రాయంలోనే ప్రపంచకప్ గెలిచిన చరిత్ర సృష్టించింది. టైటిల్ కోసం ఇద్దరు భారతీయులు పోటీ పడటం ఇదే మొదటిసారి. ఇక, గతంలో ఆనంద్ రెండు పర్యాయాలు ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచినా, మహిళల్లో భారత్ నుంచి మొట్టమొదటి చాంపియన్ దివ్య.

నాగ్‌పూర్‌లో వైద్యులైన అమ్మానాన్నల ప్రోత్సాహమే అండగా దివ్య చదరంగ ప్రస్థానం సాగింది. అండర్–7 అమ్మాయిల విభాగం జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడం ఆమె సహజ ప్రజ్ఞను చాటింది. అండర్–9 విభాగంలో ఆమె జాతీయ చాంపియన్. మరుసటి ఏడాది ఆసియా స్కూల్ చెస్ అండర్–10 విభాగంలో ప్రపంచ టైటిల్ గెలిచి చిచ్చరపిడుగు అనిపించుకుంది. పన్నెండేళ్లకే ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా అందుకుంది. వరల్డ్ యూత్ చెస్, ఆసియా టైటిల్, ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్.. ఇలా చిరుప్రాయంలోనే అనేక టైటిళ్లు కొల్లగొట్టింది. నిరుడు సహచర క్రీడాకారిణులతో కలిసి ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌ను భారత్ అందుకోవడంలో కీలక భూమిక పోషించింది. సీనియర్ టోర్నమెంట్లలో ఆడిన అనుభవం అంతగా లేకున్నా, తాజా ప్రపంచకప్‌లో దూకుడైన ఆటతో గ్రాండ్‌మాస్టర్లను కంగుతినిపించింది. తనకంటే మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారికను క్వార్టర్స్‌లో, చైనా స్టార్ క్రీడాకారిణి టాన్ జోంగ్యీని సెమీఫైనల్లో ఓడించి దివ్య ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకుంది. ఇక అసలైన ఆఖరి పోరాటంలో తనకంటే రెట్టింపు వయసున్న హంపిపై విజయం సాధించి ప్రపంచకప్ ట్రోఫీని సగర్వంగా అందుకుంది. ఈ క్రమంలోనే చదరంగ క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యమైన గ్రాండ్‌మాస్టర్ హోదాను దక్కించుకుంది. హంపి, హారిక, వైశాలి తర్వాత గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించిన నాలుగో భారత క్రీడాకారిణిగా శిఖరాగ్రానికి చేరుకుంది.

దివ్య ఫ్యాషన్‌కూ ప్రాధాన్యమిస్తుంది. నవతరం అమ్మాయిలకు తగ్గ దుస్తులు ధరించడం, జట్టును వదిలేయడం ఆమెకు ఇష్టం. వీటిపై గతంలో దివ్య ఎన్నో విమర్శలు ఎదుర్కొంది. 'అమ్మాయిల ఆటతీరును, వారి బలాలను చూడండి. అంతేకానీ, ఇతర విషయాలను కాదు. నేను వీటిని పట్టించుకోను. అందరూ నాలా ఉండకపోవచ్చు. కొందరు ఇలాంటి మాటలు భరించలేక ఆటకు దూరమవుతారు. ఇలాంటి పరిస్థితిని ఎవరికీ రానివ్వొద్దు' అంటూ విమర్శకులకు దీటుగా బదులిచ్చింది ఆమె. తన ఆటతో, ఆత్మవిశ్వాసంతో ఈ తరానికి స్ఫూర్తిగా నిలిచింది.

విశ్వనాథన్ ఆనంద్ దశాబ్దాల తరబడి భారత చదరంగానికి చుక్కానిలా నిలిచారు. ఐదు పర్యాయాలు ప్రపంచ చాంపియన్‌గా నిలిచి చెస్‌లో దిగ్గజస్థాయిని అందుకున్నారు. ఆ తర్వాత భారత్ నుంచి కొందరు ఆటగాళ్లు వచ్చినా నిలదొక్కుకోలేకపోయారు. కానీ, గత దశాబ్దకాలం నుంచి పరిస్థితి మారింది. ఆనంద్ మార్గదర్శకత్వంలో ఎందరో క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. 1999 నాటికి దేశంలో ముగ్గురే గ్రాండ్‌మాస్టర్లు ఉంటే.. ఇప్పుడు ఆ సంఖ్య 88కి చేరింది. భారత్‌లో చెస్ ఎదుగుదలకు ఇది సంకేతం. గుకేశ్, ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసిలాంటి ఆటగాళ్లు పిన్న వయసులోనే గ్రాండ్‌మాస్టర్లుగా అవతరించారు. అమెరికా, రష్యా, నెదర్లాండ్స్ లాంటి దేశాలను తలదన్నే స్థాయిలో ఎక్కువగా గ్రాండ్‌మాస్టర్లు భారత్‌లో రూపు దిద్దుకుంటున్నారు. ఆనంద్ ఘన వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ జూనియర్ ఆటగాళ్లు తమ మస్తిష్కానికి పదును పెడుతున్నారు. గతేడాది గుకేశ్ ప్రపంచ చాంపియన్‌గా అవతరిస్తే, చెస్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఒలింపియాడ్ పురుషులు, మహిళల ట్రోఫీలను భారత జట్లు గెలుచుకున్నాయి. నిరుడు మహిళల ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌ను హంపి దక్కించుకుంటే, ఇప్పుడు మహిళల ప్రపంచకప్‌ను దివ్యా దేశ్‌ముఖ్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం ప్రపంచ చదరంగంలో మనోళ్ల ఆధిపత్యం సాగుతోందనడానికి ఈ విజయాలే తార్కాణం.

జైపాల్ బాటలో రాహుల్, రేవంత్!



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మహాత్మా గాంధీ ఆకాశవాణిలో ప్రజల నుద్దేశించి చేసిన ప్రసంగానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 1997 నవంబర్ 12న అప్పటి సమాచార ప్రసార శాఖ మంత్రి జైపాల్‌రెడ్డి ఢిల్లీలోని బ్రాడ్ కాస్టింగ్ హౌజ్‌లో ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు ఫలకాలను జైపాల్‌రెడ్డి తాను ఆవిష్కరించకుండా వాటిని బ్రాడ్ కాస్టింగ్ హౌజ్‌లో పని చేస్తున్న అట్టడుగున ఉన్న ఇద్దరు సఫాయీ కార్మికులతో ఆవిష్కరింపజేశారు. జైపాల్ ఏ దృక్కోణంతో ఆలోచిస్తారో చెప్పేందుకు ఈ సంఘటన ఒక ఉదాహరణ. తనను తాను మండల్ వాదినని చెప్పుకునే జైపాల్‌రెడ్డి సమాజంలో వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం గురించి తరుచూ మాట్లాడేవారు. 1990 అక్టోబర్ 1న రాజ్యసభలో జైపాల్ చేసిన చరిత్రాత్మక ప్రసంగంలో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడాన్ని సమర్థిస్తూ బలంగా వాదించారు. 1956లో కాకా కాలేకర్ కమిషన్ నివేదికను కాంగ్రెస్ తిరస్కరించిన విషయాన్ని ఎత్తి చూపిన జైపాల్ ఓబీసీలకు కేవలం 4 శాతం మాత్రమే ఉద్యోగాలు లభిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ సామాజిక న్యాయ పంథాను వీడినందువల్లే బీజేపీ ఎదుగుదల జరుగుతోందని ఆయన చివరి రోజుల్లో వాపోయేవారు. 'కులం ఒక సామాజిక వాస్తవం' అని చెప్పేవారు. 'నేను రెడ్డి అయినందువల్ల చాలా లాభాలు పొందాను. నేను కులానికి దూరం కావాలనుకున్నా కులం నన్ను వదిలిపెట్టలేదు' అని ఆయన మరణించడానికి ఏడాది ముందు ఏబీఎన్‌లో నిర్వహించిన 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమంలో నిజాయితీగా అంగీకరించారు.

ఏ ఆలోచనా విధానాన్ని జైపాల్‌రెడ్డి ప్రతిపాదించారో అదే ఆలోచనా విధానాన్ని ఇవాళ కాంగ్రెస్ అందుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. జైపాల్‌రెడ్డిని మేధావిగా పరిగణించిన రాహుల్ తరచు ఆయనతో పలు అంశాలపై చర్చలు జరిపేవారు. అయితే జైపాల్ ఆలోచనల్ని ఆయన అమలులో పెట్టలేదు. తాజాగా రాహుల్ అన్నమాటల్ని వింటుంటే తనను తాను ఆత్మావలోకనం చేసుకుంటున్నట్లు అర్థమవుతోంది. 'ఓబీసీలు ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకోవడం లోనూ, వారికోసం చేపట్టాల్సిన చర్యలను గ్రహించడం లోనూ కాంగ్రెస్ విఫలమైనట్లు నాకు అనిపిస్తోంది. ఓబీసీలకు సానుకూలంగా ప్రతిస్పందించకపోవడం వల్లే బీజేపీకి అవకాశం కల్పించామని భావిస్తున్నాను..' అని రాహుల్ కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎంపీల నుద్దేశించి మాట్లాడుతూ అన్నారు. తెలంగాణలో జరిపిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రజంటేషన్ తర్వాత రాహుల్ ఈ ప్రసంగం చేశారు. ఏ జైపాల్‌రెడ్డి చేసిన ఆలోచనలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందో అదే జైపాల్‌రెడ్డి స్ఫూర్తిని ఆయనకు అత్యంత సమీప బంధువైన రేవంత్‌రెడ్డి కార్యరూపంలో పెట్టేందుకు రాహుల్ పూర్తి ప్రోత్సాహం ఇవ్వడమే కాక తెలంగాణ నమూనానే దేశానికి ఆదర్శంగా ప్రకటించడం ఒక కీలక పరిణామంగా భావించవచ్చు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే తన స్వంత కులం వారు మెచ్చరని తెలిసినా రేవంత్‌రెడ్డి తన అంచనాలను అధిగమించి కులగణనను శాస్త్రీయంగా, అర్థవంతంగా జరిపించారని రాహుల్ ప్రశంసించారు.

జైపాల్ సూచనలు తనలో మెదులుతున్నాయేమో రాహుల్ గత ఒకటి రెండేళ్లుగా అంతర్మథనం చేసుకుంటున్నట్లు కనపడుతోంది. ఈ ఏడాది జనవరిలో ఢిల్లీలో జరిగిన దళిత మేధావుల సదస్సులో ఆయన ప్రసంగిస్తూ 'దళితులు, వెనుకబడిన వర్గాలు, అత్యంత వెనుకబడిన వర్గాల విశ్వాసాన్ని కాంగ్రెస్ చూరగొని ఉంటే బీజేపీ ఎప్పుడూ అధికారంలోకి వచ్చి ఉండేది కాదు..' అని చెప్పారు. వెనుకబడిన, అట్టడుగున ఉన్నవారి ఆందోళనలను సమగ్రంగా అర్థం చేసుకుని నిర్మాణాత్మక పరిష్కారాలను సాధించి ఉంటే వారు తమకు దూరమయ్యేవారు కాదని రాహుల్ అభిప్రాయపడ్డారు.

నిజానికి భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ కులాన్ని ఒక ప్రధానాంశంగా భావించలేదు. మండల్ కమిషన్ నివేదికను వీపీ సింగ్ వెలుగులోకి తీసుకువచ్చినప్పుడు దాని ప్రభావాన్ని హరించేలా చేసేందుకు ఆడ్వాణీ నాయకత్వంలో బీజేపీ రథయాత్ర చేపట్టింది. వీపీ సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నది. 'మండల్ వర్సెస్ కమండల్' వివాదం ఆ రోజుల్లో అత్యంత ప్రాచుర్యం పొందింది. మండల్ రాజకీయాలు బిహార్‌లో సృష్టించిన కల్లోలం కుల సేనలను కూడా తయారు చేసి నెత్తురుటేర్లు పారించింది. సంబంధిత ఘటనలు చరిత్రలో నమోదయ్యాయి. మోదీ నాయకత్వంలో కూడా హిందూత్వనే బీజేపీ ప్రధానాంశంగా ముందుకు ప్రవేశపెట్టింది. యువత, పేదలు, మహిళలు, రైతులే అతిపెద్ద కులాలని, ఈ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తే దేశం అభివృద్ధి చెందుతుందని మోదీ పదే పదే తన ప్రసంగాల్లో ప్రకటించారు. కాంగ్రెస్ తప్పిదాల వల్ల ఆ పార్టీ ఓటు బ్యాంకును దాదాపు తన వైపు తిప్పుకోగలిగిన బీజేపీ కుల ప్రాతిపదికన ప్రజలను తమ వైపునకు తిప్పుకోవాల్సిన అవసరం లేదని భావించింది. కులాన్ని కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని, సంక్షేమ పథకాలు ప్రకటిస్తే చాలని భావించిన కాంగ్రెస్ పంథాను బీజేపీ కూడా అనుసరించింది.

రామజన్మభూమి ఉద్యమ సమయంలో బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న గోవిందాచార్య మండల్ పార్టీలను ఎదుర్కోవాలంటే సామాజిక సమీకరణ తప్పదనే సిద్ధాంతీకరణ చేశారు. దాన్ని అమలు చేసి ఉత్తరప్రదేశ్‌లో తొలుత కల్యాణ్‌సింగ్ వంటి బీసీ నేతను ముఖ్యమంత్రిని చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ తర్వాత అగ్రవర్ణాలకే నాయకత్వాన్ని అప్పజెప్పింది. ఫలితంగా బీజేపీ క్రమంగా యూపీలో పట్టు కోల్పోయింది. మోదీ నాయకత్వంలో మళ్లీ బీజేపీ పుంజుకుని కేవలం అగ్రవర్ణాలను మాత్రమే కాక ఓబీసీల్లో అతి వెనుకబడిన వర్గాలను, ముఖ్యంగా యాదవేతరులను తన వైపునకు తిప్పుకుని సంఘటితం చేయగలిగింది. 2009 నుంచి 2019 మధ్య దేశ వ్యాప్తంగా బీజేపీ ఓబీసీ ఓట్లు 20 నుంచి 44 శాతం మేరకు పెరిగాయి. కాంగ్రెస్‌నే కాక అనేక రాష్ట్ర స్థాయి పార్టీలను బీజేపీ దెబ్బతీయగలిగింది.

ఈ పరిణామాల్ని గమనించినందువల్లే గత ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ బీజేపీ కంటే ఎక్కువ మంది బీసీ, దళిత అభ్యర్థులను రంగంలోకి దించింది. యాదవేతర బీసీలకు అధిక సీట్లను కేటాయించింది. వెనుకబడిన, దళిత, అల్పసంఖ్యాక వర్గాల ఫార్ములాను అనుసరించి లోక్‌సభలో అధిక సీట్లను సాధించగలిగింది. 2024 ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా ఎన్డీఏ 4 శాతం ఓబీసీల మద్దతును కోల్పోతే ఇండియా కూటమి 11 శాతం ఎగువ స్థాయి ఓబీసీలు, 7 శాతం మరింత వెనుకబడిన ఓబీసీల మద్దతును సాధించగలిగింది.



> తెలంగాణలో వలే దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించి ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి పరిస్థితులను ఆరాతీస్తే 78 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత భారత ప్రజలు ఏ స్థాయిలో ఉన్నారో తేటతెల్లమవుతుంది. శాస్త్రీయంగా విధానాల రూపకల్పనకు అది విశేషంగా తోడ్పడుతుంది. భారత్‌ను నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా చెప్పుతున్న పాలకులు మన ప్రజల వాస్తవ పరిస్థితిని వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నారా?

భారతీయ జనతా పార్టీని వరుసగా మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఓడించలేకపోగా, వివిధ రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్‌కు ఓబీసీ ఓట్ల పుణ్యమా అని గత సార్వత్రిక ఎన్నికల్లో కొంత పుంజుకున్నది. ఇది ఆ పార్టీలో కొత్త ఆశల్ని చిగురింపచేసింది. అయినప్పటికీ హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పాత తప్పిదాల్నే చేసింది. భూపిందర్‌సింగ్ హుడా నాయకత్వంలో కేవలం జాట్ ఓట్ బ్యాంకు కాంగ్రెస్ మద్దతుగా ముందుకు వస్తే విస్తృత స్థాయిలో వివిధ కులాలను తన వైపునకు తిప్పుకోవడంలో కాంగ్రెస్ విఫలం కావడం ఆ పార్టీ ఓటమికి దారితీసింది. అదే సమయంలో జాట్‌కు సంబంధించని వారిని బీజేపీ తన వైపునకు తిప్పుకోగలగడం వల్ల ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించగలిగింది.

ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక న్యాయాన్ని ఎజెండాగా చేపట్టడం కన్నా కాంగ్రెస్‌కు మరో గత్యంతరం లేదు. 11 సంవత్సరాల బీజేపీ పాలనలో వివిధ వర్గాలకు సరైన న్యాయం జరగలేదని విమర్శిస్తున్న కాంగ్రెస్ అధికారం లోనూ, విద్యలోనూ, సంపదలోనూ వెనుకబడిన వర్గాలకు సరైన న్యాయం జరిగిందా లేదా తేల్చేందుకు శాస్త్రీయంగా కులగణన జరపాలన్న డిమాండ్‌కు ప్రాచుర్యం కల్పిస్తోంది. అంతే కాదు, ఈ కులగణన డేటా ఆధారంగా ప్రభుత్వ విధానాలను రూపొందించి. ఎవరి జనాభా ఎంత ఎక్కువ ఉంటుందో అంత భాగస్వామ్యం కల్పించాలనే నినాదం ఆధారంగా ప్రజల్లోకి ప్రవేశించాలని వ్యూహరచన చేస్తోంది. వెనుకబడిన వర్గాలకు సంబంధించి కేవలం నినాదాలు చేయడం మాత్రమే సరిపోదని, నిర్దిష్టమైన చర్యలను ప్రకటించాలని కాంగ్రెస్ గ్రహించింది.

కాంగ్రెస్ ఈ వ్యూహం ప్రజల్లో ఊపందుకుని మండల్ నాటి సామాజిక వాతావరణాన్ని కల్పించగలుగుతుందా? లోహియా రాజకీయాల ఆధారంగా వెలుగులోకి వచ్చిన వెనుకబడిన కులాలు మరో ప్రభంజనాన్ని రేకెత్తించగలుగుతాయా? బీజేపీ ఈ పరిణామాన్ని చూస్తూ ఊరుకుంటుందా? 2026లో జరిగే జనగణనలో భాగంగా కులగణన జరిపించాలని బీజేపీ కూడా నిర్ణయించింది. ఈ ఏడాది బిహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే బీజేపీ ఈ నిర్ణయం తీసుకుందా? 2020 బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి నితీశ్ నాయకత్వంలో కూడా 10 శాతం ఓబీసీ మద్దతును కోల్పోయింది. బిహార్‌లో నితీశ్‌కుమార్ కూడా కులగణన జరిపించిన తర్వాత వాస్తవాలను గ్రహించి బిహార్‌లో రిజర్వేషన్ పరిమితిని 65 శాతానికి పెంచారు. సుప్రీంకోర్టు ఈ నిర్ణయాన్ని సహజంగానే కొట్టివేసినప్పటికీ వెనుకబడిన కులాల ప్రాధాన్యాన్ని బీజేపీ, జేడీ(యు) గ్రహించినట్లే కనిపిస్తోంది. నవంబర్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కులాలు ఎటువైపు వెళతాయన్నదానిపై దేశ రాజకీయ పరిణామాలను అంచనా వేసేందుకు ఆస్కారం ఉన్నది.

నిజానికి తెలంగాణలో మాదిరి దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో కులగణన నిర్వహించి ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి పరిస్థితులను కూడా ఆరాతీస్తే ఈ దేశంలో ప్రజలు స్వాతంత్ర్యం వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా ఏ స్థాయిలో ఉన్నారో ఖచ్చితంగా తేలేందుకు అవకాశాలు ఉన్నాయి. తద్వారా విధానాల రూపకల్పన కూడా శాస్త్రీయంగా చేసేందుకు తోడ్పడుతుంది. భారత్‌ను నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా చెప్పుకుంటున్న మన నేతలు మన ప్రజల వాస్తవ పరిస్థితిని వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నారా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

హమాస్... క్షణం ఆలోచించాల్సింది!

2023 అక్టోబరు 7వ తేదీ... ఇజ్రాయెల్‌పైకి వేల క్షిపణులు ప్రయోగించే ముందు హమాస్ ఒక్క క్షణం ఆలోచించాల్సింది... 'నాది' అని ఇజ్రాయెల్ చెప్పుకొంటున్న భూభాగంలోకి ప్రవేశించేముందు ఒక్క క్షణం ఆలోచించాల్సింది...

వందల మందిని చంపి, ఎందరినో బందీలుగా పట్టుకున్నామనే ఆనందం పొందేముందైనా ఒక్క క్షణం ఆలోచించాల్సింది... 'ఈ రోజు మాదే! మరి... రేపు ఏమవుతుంది?' అని హమాస్ తమలో తాము ప్రశ్నించుకోవాల్సింది!

అదే జరిగి ఉంటే... నేడు గాజా ఒక శిథిలాల దిబ్బలా మారేది కాదేమో! రెండేళ్లుగా రక్తమోడుతూ విలపించేది కాదేమో! ఏడ్పులు, ఆర్తనాదాలు వినిపించేవి కావేమో! 'పాలస్తీనా ఎవరిది? ఇజ్రాయెల్ దురాక్రమణదారా? కాదా? న్యాయం ఎటువైపు ఉంది?' అనే ప్రశ్నలకు ఎవరి సమాధానాలు వారివి. కానీ... ఇజ్రాయెల్ ఏమిటో ప్రపంచానికి తెలుసు. ఆ దేశ పాలకుడు ఎంత మొండివాడో కూడా తెలుసు. 'మా పౌరుల్లో ఒక్కరిని చంపితే... మిమ్మల్ని వందమందిని చంపుతాం. మాపై ఒక్క రాకెట్ వదిలితే... వెయ్యి బాంబులతో విరుచుకుపడతాం!' అనేదే ఇజ్రాయెల్ సిద్ధాంతం! లక్ష్యంగా ఎంచుకున్న 'శత్రువు' పాతాళంలో ఉన్నా వెంటాడి, వేటాడి వధించే తత్వం వాళ్లది. కాలం మారుతోంది కానీ... ఈ సిద్ధాంతంలో ఇసుమంత మార్పూ లేదు. ఇది ప్రపంచానికి తెలుసు! మరి... హమాస్‌కు తెలియదా? ఒక్కరోజు అవకాశం దక్కిందని కంచెలు తెంచుకుని ఇజ్రాయెల్‌లోకి దూకుడుగా వెళ్లడం ఎంత 'ముప్పో' తెలియదా? తాము వదిలే వందల రాకెట్లకు బదులుగా ఎన్ని వేల బాంబులు మీద పడతాయనేది ఊహించలేకపోయిందా? హమాస్ ఒక్కరోజు పొందిన 'వెర్రి ఆనందానికి' ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నది ఎవరు? 'శత్రువు'కు తనదైన విస్తృత అర్థాన్ని కల్పించుకుని... జాలి, దయ, మానవత్వాన్ని మూటగట్టి మంచెపై పెట్టిన ఇజ్రాయెల్ రక్కసి పంజాకు బలి అవుతున్నదెవరు? ముందు హమాస్ స్థావరాలు, ఆ తర్వాత ప్రభుత్వ భవనాలు, ఆపై పాఠశాలలు, ఆస్పత్రులు, నిరాశ్రయుల శిబిరాలు... ఇజ్రాయెల్ గురికి అన్నీ శిథిలాలే! 'గాజా'కు అన్ని దారులూ మూసుకుపోయాయి.



> ఇజ్రాయెల్ ఏమిటో ప్రపంచానికి తెలుసు. ఆ దేశ పాలకుడు ఎంత మొండివాడో కూడా తెలుసు. 'మాపై ఒక్క రాకెట్ పడితే... వెయ్యి బాంబులతో విరుచుకుపడతాం!' అనేదే ఇజ్రాయెల్ సిద్ధాంతం! 'శత్రువు' పాతాళంలో ఉన్నా వెంటాడి, వేటాడి వధించే తత్వం వాళ్లది. కాలం మారుతోంది కానీ... ఈ సిద్ధాంతంలో ఇసుమంత మార్పూ లేదు.

సహాయ సామగ్రీ అందడం లేదు. గాజా ఇప్పుడు ఆకలి దప్పులతో అల్లాడుతోంది. సంక్షోభం ఇంతలా ముదిరి... డొక్కలు ఎండి, కన్నీళ్లు ఇంకి, ఎముకలు తేలిన చిన్నారుల చిత్రాలు ప్రపంచాన్ని కలిచి వేస్తున్నాయి కానీ... ఇజ్రాయెల్‌ను కాదు!

ఇజ్రాయెల్ 'మొస్సాద్'కు ప్రపంచంలోనే అత్యంత సమర్థమైన నిఘా వ్యవస్థగా పేరుంది. పాలస్తీనా వైపు నుంచి ఒక్క రాకెట్ గాల్లోకి లేచినా... దుర్భేద్యమైన ఇజ్రాయెల్ గగన రక్షణ వ్యవస్థ (ఐరన్ డోమ్) అడ్డుకుంటుంది. మరి... 2023 అక్టోబరు 7వ తేదీన 'అలా ఎందుకు జరిగింది?' అది యూదులకు సెలవుల కాలం! ఇజ్రాయెలీలు విహారాల్లో మునిగి తేలుతున్నారు. గాజాకు బాగా సమీపంలోని రీఇమ్‌లో భారీ సంగీతోత్సవం ఏర్పాటు చేశారు. అలాంటి సమయంలో... హమాస్ నుంచి ఎలాంటి ముప్పు ఊహించకుండా 'మొస్సాద్' మొద్దు నిద్రపోతోందా? హమాస్ దాడిని ఊహించలేదా? లేక... 'గాజా'ను మట్టిపాలు చేసేందుకే వాళ్లకు ఒక అవకాశమిచ్చిందా? ఏం జరిగిందో చెప్పలేం! కానీ... పాలస్తీనాపై విరుచుకుపడేందుకు ఇజ్రాయెల్‌కు ఒక 'కారణం' దొరికింది. 'అందివచ్చిన అవకాశం' అంటూ గాజాలో ఒక్కో అంగుళాన్నీ ధ్వంసం చేస్తోంది. హమాస్ దాడిలో 1500 మంది దాకా ఇజ్రాయెలీలు మరణించినట్లు అంచనా. అయితే... దీనికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమంలో ఈ ఏడాది జనవరికే గాజాలో 70వేల మంది మరణించినట్లు ఒక స్వతంత్ర అధ్యయనం పేర్కొంది. వీళ్లంతా తుపాకులు పట్టిన ఉగ్రవాదులు కాదు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, సామాన్యులే. 'యునిసెఫ్' అంచనా ప్రకారం... గాజా స్ట్రిప్‌లో 2023 అక్టోబరు నుంచి ఇప్పటిదాకా 50వేల మందికి పైగా పిల్లలు మరణించడమో, క్షతగాత్రులు కావడమో జరిగింది! వాళ్లు చేసిన పాపం ఏమిటి? ఇజ్రాయెల్ ఇప్పుడు దేన్నీ వదిలిపెట్టడంలేదు. ఆస్పత్రులు, పాఠశాలలు, సహాయ శిబిరాలు, ఆహార పంపిణీ కేంద్రాలు.... దేన్నీ, దేన్నీ వదిలిపెట్టడం లేదు. సంక్షుభిత గాజాకు బాహ్యప్రపంచం నుంచి సహాయం నిలిచిపోయింది. పాలస్తీనీయులను చంపేందుకు ఇజ్రాయెల్ ప్రత్యేకంగా బాంబులు, బుల్లెట్లు వాడక్కర్లేదు. ఆకలిదప్పులతో వాళ్లంతట వాళ్లే చనిపోతారు! ఇది ఆధునిక మానవ చరిత్రలో అత్యంత విషాదంగా నిలిచిపోతుంది!

2023 అక్టోబరు 7న హమాస్ చర్య ఇజ్రాయెల్‌పై యుద్ధ ప్రకటనే! కానీ... ఇజ్రాయెల్‌ను ఎదుర్కొనేందుకు హమాస్ సిద్ధపడే, సర్వసన్నద్ధమయ్యే ఈ యుద్ధానికి దిగిందా? ఇజ్రాయెల్‌తో పోల్చితే హమాస్ బలమెంత? సాయుధ సంపత్తిలో తన స్థానమేది? అంతర్జాతీయ స్థాయిలో అండగా ఉండేదెవరు? ఇవన్నీ ఆలోచించకుండానే హమాస్ యుద్ధ ప్రకటన చేసేసింది. పాలస్తీనాకు దౌత్యపరమైన మద్దతు ఇచ్చే దేశాలే తప్ప... యుద్ధంలో అండగా నిలిచే వారెవరూ లేరు. 'సేవ్ పాలస్తీనా' నినాదాలు... అంతర్జాతీయంగా పాలస్తీనీయులకు సంఘీభావంగా జరిగే నిరసన ప్రదర్శనలు, సోషల్ మీడియా పోస్టులతో గాజాలోని సామాన్యులకు ఒరిగేదేమీ లేదు. శత్రువు బలాన్ని అంచనా వేయకుండా మీసంమెలేసి తొడగొట్టడం, రాళ్లేసి రెచ్చగొట్టడం... స్వీయహాని చేసుకోవడమే! తప్పొప్పుల సంగతి పక్కనపెడితే.. ఇలాంటి విషయాల్లో లౌక్యమూ, సంసిద్ధతా అవసరమే. హమాస్ దూకుడు వల్ల ఆ సంస్థకు జరిగిన నష్టమెంతో కానీ... 'గాజా' మాత్రం ధ్వంసమైపోయింది. పాలస్తీనా ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే హక్కు హమాస్‌కు లేదు. హమాస్‌ను నిర్మూలించే పేరుతో సామాన్యులను బలి తీసుకునే అధికారం ఇజ్రాయెల్‌కూ లేదు. కనికరమన్నది లేని ఇజ్రాయెల్ పాలకుడు సంపూర్ణ నాశనం చేసేదాకా వదిలిపెట్టేలా లేడు! ప్రపంచ దేశాలు పట్టించుకోవడం లేదు. ఐక్యరాజ్యసమితి మాటకు విలువ లేదు. మరి... ఈ వినాశనం ఆగేదెన్నడు? ఆపేదెవ్వరు? తప్పు ఎవరిది?

• తొమ్మండ్రు సురేష్‌కుమార్

'రైల్వే' రాయితీల పునరుద్ధరణపై కేంద్రం నిర్లక్ష్యం

వృద్ధులకు ప్రయాణ టిక్కెట్లపై రాయితీలు, పాత్రికేయులకు ఉచిత రైలు పాస్‌లు ఇవ్వడం వంటి సదుపాయాలను గతంలో భారతీయ రైల్వే కల్పించింది. కానీ కరోనా మహమ్మారి కారణంగా 2020లో కేంద్రం ఈ సదుపాయాలను తాత్కాలికంగా నిలిపివేసింది. కరోనా తగ్గుముఖం పట్టి ఏళ్లు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఆయా రాయితీలను పునరుద్ధరించడం లేదు. పైగా ఈ సదుపాయాన్ని శాశ్వతంగా రద్దు చేసేలా కేంద్రం వ్యవహరించడం తీవ్ర ఆందోళనకరం. దేశ జనాభాలో సుమారు పది శాతం మంది వృద్ధులే. అంటే దాదాపు 14 కోట్లు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో పత్రికలు, ఆన్‌లైన్ మీడియా, ప్రాంతీయ చానెల్స్‌లో పనిచేసే పాత్రికేయులు వార్తల కవరేజీ కోసం నిరంతరం రైళ్లలో ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం కేంద్రం రాయితీలు నిలిపివేయడంతో వారందరికీ టికెట్ల భారం తప్పడం లేదు. బ్రిటన్ ప్రభుత్వం వృద్ధులకు 'ఫ్రీడమ్ పాస్' ద్వారా ఉచిత బస్సు, ట్రైన్ ప్రయాణాలు కల్పిస్తోంది. జర్మనీ, జపాన్, కెనడా వంటి దేశాల్లోనూ వృద్ధుల ప్రయాణ అవసరాలను గుర్తించి ప్రభుత్వాలు ప్రత్యేక రాయితీలను ఇస్తున్నాయి.

కరోనా వల్ల ఏర్పడిన ఆర్థికభారాన్ని పూడ్చుకునేందుకే టికెట్ రాయితీలను నిలిపివేశామని చెబుతున్న కేంద్రం ప్రభుత్వం.. వందేభారత్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులకు మాత్రం వేల కోట్లు ఖర్చు చేస్తోంది. 2023–24 రైల్వే బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుల కోసం రూ. 2.4 లక్షల కోట్లు కేటాయించింది. టికెట్ రాయితీల వల్ల రైల్వేకు వార్షికంగా రూ. 1600 కోట్ల నష్టం జరుగుతోందని కరోనాకు ముందు(2019లో) కేంద్రం తెలిపింది. కానీ అదే ఏడాది రైల్వే ప్రకటనల కోసం రూ. 1200 కోట్లకు పైగా ఖర్చు పెట్టింది! వృద్ధులకు, పాత్రికేయులకు ఇచ్చే రాయితీలను కొనసాగించలేకపోవడం నిధుల సమస్య అని చెప్పడం సత్యదూరం. రాయితీల పునరుద్ధరణ కోరుతూ దేశవ్యాప్తంగా పలు పౌర, పాత్రికేయ సంఘాలు కేంద్రానికి ఎన్ని వినతులు సమర్పించినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి రైల్వే టికెట్లపై రాయితీలను పునరుద్ధరించాలి.

– అప్పన్న గొనప, విశాఖపట్నం

ప్రాజెక్టుల పల్లకీలో ఆంధ్రప్రదేశ్!


ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మరోసారి పారిశ్రామిక వికాసానికి దిశానిర్దేశం చేస్తూ, పెట్టుబడులను ఆకర్షించే హబ్‌గా తనను తాను నిలబెట్టుకుంటోంది. 2024 జూలై నుంచి 2025 మే వరకు జరిగిన పెట్టుబడి ప్రోత్సాహక మండలి ఏడు సమావేశాల్లో మొత్తం రూ.5.74 లక్షల కోట్ల విలువైన 109 ప్రాజెక్టులకు ఆమోదం తెలపడం ద్వారా ఆ దిశగా కీలకమైన అడుగులు పడ్డాయి. ఈ పెట్టుబడుల ద్వారా 5,05,968 ఉద్యోగాల కల్పనతో యువత భవిష్యత్తు మార్చబోతున్నది. ఇవి కేవలం గణాంకాలుగా మాత్రమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ యువత ఆశల ప్రతిబింబంగా, ప్రాంతీయ సమతుల అభివృద్ధికి, వికేంద్రీకరణకు బలమైన ఆధారంగా మారబోతున్నాయి.

పరిశ్రమల విస్తరణ పట్ల ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం ఈ ఆమోదిత ప్రాజెక్టుల పరిశీలనలో చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. ఆర్సెలర్ మిట్టల్, భారత్ పెట్రోలియం, ప్రీమియర్ ఎనర్జీస్, డిక్సన్ టెక్నాలజీస్, బ్లూ జెట్ హెల్త్‌కేర్, మహామాయా స్టీల్ వంటి ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు వచ్చాయి. ఈ ప్రాజెక్టులు ఖనిజాల నుంచి ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, స్టీల్, రసాయనాలు, ఆటోమొబైల్స్ వరకూ విస్తరించి ఉన్నాయి. ఇది ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా శ్రీ సిటీ, విశాఖపట్నం, తిరుపతి, కడప వంటి ఇండస్ట్రియల్ హబ్స్ మరింత బలపడనున్నాయి.

కూటమి ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదించిన ప్రాజెక్టుల్లో గణనీయమైన వాటా సోలార్, విండ్, హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టులదే. గ్రీన్‌కో, టాటా పవర్, బొండాడ ఇంజినీరింగ్, చింతా గ్రీన్ ఎనర్జీ, రీన్యూవిక్రమ్ శక్తి వంటి కంపెనీలు రాష్ట్రంలోని కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, కడప జిల్లాల్లో భారీ స్థాయిలో పునరుత్పాదక విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. ఈ ప్రాజెక్టులు 1000 మెగా వాట్లకు పైగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నాయి. పర్యావరణ హితం, నిర్బంధ విద్యుత్ సరఫరా, జాతీయ 'నెట్‌జీరో' పొల్యూషన్ లక్ష్యం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్లే ఈ ప్రాజెక్టులు, ఆర్థికంగా కూడా స్థానిక ఉపాధి అవకాశాలకు మార్గం వేస్తున్నాయి.

పెట్టుబడి ప్రోత్సాహక మండలి అనుమతులతో సాంకేతిక రంగంలో సైతం రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నది. విశాఖపట్నం, శ్రీ సిటీ, తిరుపతి వంటి ప్రాంతాల్లో టీసీఎస్, డైకిన్, సెన్సోరెమ్, ఉర్సా క్లస్టర్స్ వంటి కంపెనీలు తమ ఐటీ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రానికి సాంకేతిక పరిజ్ఞానం త్వరితగతిన అందనుంది. ఈ రంగంలోనే సుమారు 20,000కి పైగా ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఇది హైస్కిల్ సెగ్మెంట్లకు మద్దతుగా మారబోతోంది. అదే విధంగా, పర్యాటక రంగంలో మయ్‌ఫెయిర్, ఒబెరాయ్, వరుణ్ హాస్పిటాలిటీ వంటి ప్రముఖ సంస్థలు విలాసవంతమైన హోటల్స్, రిసార్ట్‌లు ఏర్పాటు చేయనుండడం పర్యాటకాభివృద్ధికి నాంది పలికే అంశం. దీంతో రాష్ట్రానికి అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునే అవకాశాలు మరింత పెరగనున్నాయి.

> ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని కలిగించేలా వేగవంతమైన, పారదర్శక నిర్ణయాలను తీసుకుంటోంది. ముఖ్యంగా ఎస్ఐపీబీ ద్వారా పెట్టుబడి ప్రతిపాదనలను పరిశీలించి, వేగంగా ఆమోదించేందుకు ఒక సమర్థవంతమైన వ్యవస్థను అమలు చేస్తోంది. 'సింగిల్ విండో' విధానాన్ని మరింత బలోపేతం చేస్తూ, అనుమతుల ప్రక్రియను సమర్థవంతం చేయడమే కాకుండా, నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షించే విధంగా వ్యవస్థను రూపొందిస్తోంది.



ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి అనుమతించిన ప్రాజెక్టుల్లో ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే ఇవి కేవలం మెట్రో నగరాలకు మాత్రమే పరిమితం కాకుండా జిల్లా స్థాయిలోనూ సమానంగా వ్యాప్తి చెందనున్నాయి. కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కడప, తిరుపతి, శ్రీ సిటీ వంటి అనేక జిల్లాల్లో ప్రాజెక్టులు అమలయ్యేలా నూతన పెట్టుబడులు సమానంగా పంపిణీ అయ్యాయి. ఇది రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి అవకాశాలను సమానంగా పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. పరిశ్రమలు, విద్యుత్, టూరిజం, ఐటీ వంటి విభిన్న రంగాల్లో ఈ సమతుల్యత గమనించదగిన అంశం.

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని కలిగించేలా వేగవంతమైన, పారదర్శక నిర్ణయాలను తీసుకుంటోంది. ముఖ్యంగా ఎస్ఐపీబీ ద్వారా పెట్టుబడి ప్రతిపాదనలను పరిశీలించి, వేగంగా ఆమోదించేందుకు ఒక సమర్థవంతమైన వ్యవస్థను అమలుచేస్తోంది. 'సింగిల్ విండో' విధానాన్ని మరింత బలోపేతం చేస్తూ, అనుమతుల ప్రక్రియను సమర్థవంతం చేయడమే కాకుండా, నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షించే విధంగా వ్యవస్థను రూపొందిస్తోంది. పారిశ్రామిక భూముల కేటాయింపు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల అందుబాటును సులభతరం చేస్తూ పెట్టుబడిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా సేవలు అందించాలన్న దిశగా చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుతున్నదంటే, అది శాశ్వత అభివృద్ధికి అంకురార్పణ అనే చెప్పాలి. ఈ ప్రాజెక్టులు అమలయ్యే కొద్దీ, 'ఆత్మనిర్భర ఆంధ్రప్రదేశ్' కల సాకారమవుతుంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పెట్టుబడుల ఆకర్షణ ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఈర్ష్య కలిగించే విధంగా ఉందన్నది సుస్పష్టం. ఆయన దూరదృష్టి, సాంకేతికతపై నమ్మకం, పారదర్శక పరిపాలన, వేగవంతమైన ఫైల్ క్లియరెన్స్ విధానాలు ఆయన పాలన అనుభవానికి అద్దం పడుతున్నాయి. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే అనువైన విధానాలే గాక, ప్రభుత్వ తీరు కూడా కీలక అంశం. చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకుని పాలసీ స్థాయిలో క్లారిటీ ఇవ్వడమే కాకుండా పార్టీ నాయకులు వివాదాలకు దూరంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫారిన్ డెలిగేషన్లు, సీఈఓ మీటింగ్స్, పెట్టుబడి సదస్సుల నిర్వహణలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తున్నారు. ఆయన దృఢ సంకల్పం, పాలసీ స్పష్టత, పరిపాలనా ప్రతిభ రాష్ట్రాన్ని ప్రాజెక్టుల పల్లకిలా తయారు చేయడమే కాకుండా రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తును కొత్త మలుపు తిప్పుతుందనటంలో ఆశ్చర్యం లేదు.

■ గుమ్మడి ప్రభాకర్
మీడియా కోఆర్డినేటర్, ముఖ్యమంత్రి కార్యాలయం

కలిసే ముంచారు!

అంపాపురం రియల్ మోసంలో వెలుగులోకి మరో కోణం




వ్యవసాయేతర భూమిగా నమోదైన స్థలంలో పామాయిల్ సాగు (ఇన్‌సెట్‌లో) వ్యవసాయేతర భూమిగా పంచాయతీ రసీదు

- వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్, సాంబిరెడ్డి మధ్య రహస్య ఒప్పందం
- సాంబిరెడ్డి ద్వారా ఫైనాన్స్ తీసుకున్న వీవీఆర్ హౌసింగ్
- విక్రయించిన ప్లాట్లను సాంబిరెడ్డికి తనఖా పెట్టిన రియల్ సంస్థ
- వీవీఆర్ పార్టనర్ చనిపోయిన తర్వాత రంగంలోకి దిగిన సాంబిరెడ్డి
- కానుమోలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో 6.84 ఎకరాలకు రిజిస్ట్రేషన్
- 2014లో వ్యవసాయేతర భూమికి పాస్ పుస్తకాలు పొందిన సాంబిరెడ్డి
- వైసీపీ ప్రభుత్వంలో భూమి స్వాధీనం.. పామాయిల్ సాగు

అంపాపురం రియల్ మోసంలో మరో కోణం వెలుగుచూసింది. వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్, సాంబిరెడ్డి కలిసే ప్లాట్ల కొనుగోలుదారులను ముంచేశారని ఆరోపణలు వస్తున్నాయి. సాంబిరెడ్డి ద్వారా ఫైనాన్స్ తీసుకున్న రియల్ ఎస్టేట్ సంస్థ నగదు తిరిగి చెల్లించలేక విక్రయించిన ప్లాట్లను ఆయనకే తనఖా పెట్టినట్టు తెలిసింది. వీవీఆర్ పార్టనర్ ఒకరు చనిపోయిన తర్వాత రంగంలోకి దిగిన సాంబిరెడ్డి 6.84 ఎకరాలను తన కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నారు. వ్యవసాయేతర భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా పొంది దర్జాగా పామాయిల్ సాగు చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్): ప్రభుత్వ వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ప్లాట్ల కొనుగోలుదారులను నిలువునా ముంచిన అంపాపురంలోని రియల్ ఎస్టేట్ సంస్థ వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ప్రస్తుతం వెంచర్ స్థలం తమ స్వాధీనంలో ఉందని చెప్పుకుంటున్న సాంబిరెడ్డి మధ్య రహస్య ఒప్పందం వెలుగులోకి వచ్చింది. వీవీఆర్ హౌసింగ్ ప్రాజెక్టుకు ప్రైవేటు వ్యక్తి సాంబిరెడ్డి ఫైనాన్స్ ఇచ్చినట్టు తెలుస్తోంది. సంస్థ ఆ డబ్బులు తిరిగి చెల్లించకపోవటంతో కొనుగోలుదారులకు విక్రయించిన ప్లాట్లను ఆ వ్యక్తికి తనఖా పెట్టినట్టు సమాచారం. దీనిని అడ్డుపెట్టుకుని సాంబిరెడ్డి వ్యవసాయేతర భూమిని తన పేరుతో వ్యవసాయ భూమిగా మార్చుకున్నారు. రెవెన్యూ శాఖ నుంచి పాస్‌పుస్తకాలను కూడా పొందారు. ఏకంగా మిగతా 6లో..

రెవెన్యూ ‘బరితెగింపు!

గ్రామాల్లో పరిశ్రమలను నెలకొల్పి ఉద్యోగాల సృష్టి జరపాలని ఒకవైపు ప్రభుత్వం కృషి చేస్తుంటే మరోవైపు అవినీతి రుచి మరిగిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఉద్దేశానికి మకిలి పట్టిస్తున్నారు. బరి తెగించి మరీ లంచాలు డిమాండ్ చేస్తున్నారు. పారామౌంట్ కంపెనీ పెనుగంచిప్రోలు మండలంలో భూములు కొనుగోలు చేసి పరిశ్రమ విస్తరణలో భాగంగా ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే పైసలిస్తేనే ఫైల్ ముందుకు కదులుతుందని బీష్మించుకుర్చున్నారు. స్థానిక ఎమ్మెల్యే మందలించినా తీరు మార్చుకోకపోవడంతో విసిగిపోయిన కంపెనీ యాజమాన్యం విస్తరణ పనులను వాయిదా వేసుకుంది. దీంతో రెవెన్యూ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తాత్కాలికంగా యూనిట్ విస్తరణ నిలుపుదల చేసిన యాజమాన్యం

పారామౌంట్ కంపెనీకి చుక్కలు చూపిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

- పెనుగంచిప్రోలులో పరిశ్రమ విస్తరణకు 8 ఎకరాల కొనుగోలు
- ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు.. రూ.లక్షల్లో లంచం డిమాండ్
- జగ్గయ్యపేట ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన యాజమాన్యం
- రెవెన్యూ అధికారులను మందలించిన శ్రీరాం తాతయ్య
- అయినా సరే లంచం ఇవ్వాల్సిందేనంటూ రెవెన్యూ అధికారుల పట్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో పారిశ్రామికంగా పురోగమిస్తున్న జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, బాపులపాడు మండలాల్లో పారామౌంట్ ఇండస్ట్రీ యాజమాన్యం పలు యూనిట్లను ఏర్పాటు చేసింది. పెనుగంచిప్రోలు మండలంలో పరిశ్రమను విస్తరించటానికి గాను ఇటీవల ఎనిమిది ఎకరాల భూములను కొనుగోలు చేసింది. ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే స్థానిక రెవెన్యూ అధికారి ఒకరు పారిశ్రామిక సంస్థ నుంచి లంచం డిమాండ్ చేయటం సంచలనం సృష్టిస్తోంది. ఈ పంచాయితీ జగ్గయ్యపేట ఎమ్మెల్యేకు చేరింది. రెవెన్యూ అధికారికి ఎమ్మెల్యే ఫోన్ చేసి మందలించారు. అయినా కూడా ఆ రెవెన్యూ అధికారి తాను తగ్గేది లేదని లంచం ఇవ్వాల్సిందేనని పట్టుబట్టడంతో ల్యాండ్ కన్వర్షన్ ఫైల్ పెండింగ్‌లో ఉంది.

వందలాది మందికి ఉపాధి కల్పించిన సంస్థకు చుక్కలు

పారామౌంట్‌కు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రెండు యూనిట్లు ఉన్నాయి. పెనుగంచిప్రోలు మండలంలో జాతీయ రహదారి పక్కనే యూనిట్ ఉంది. కృష్ణాజిల్లా మల్లవల్లిలో కూడా ఈ కంపెనీకి సంబంధించిన యూనిట్ ఉంది. అన్ని యూనిట్లు కూడా ఐరన్ ఫ్రేమింగ్స్ సంబంధించినవే ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో కూడా వందల మందికి ఈ సంస్థ ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. అలాంటి సంస్థకు ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే .. లంచాలు డిమాండ్ చేయటం గమనార్హం.

కలెక్టర్ దిశానిర్దేశం చేసినా మారని తీరు!

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహకానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఓ వైపు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలే పరిశ్రమలశాఖతో పాటు అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష చేశారు. పరిశ్రమలకు అనుమతుల విషయంలో అన్ని శాఖలు సమన్వయం చేసుకుని త్వరితగతిన ఇవ్వాలని నిర్దేశించారు. ఇది జరిగి కొద్ది రోజులే అయినా రెవెన్యూ అధికారులలో మార్పు కనిపించటం లేదు. అవినీతి వాసనలను వదులుకోని రెవెన్యూ అధికారులు ల్యాండ్ కన్వర్షన్ల విషయంలో పారిశ్రామికవేత్తలను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగిస్తున్నారు. ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవ్వరికైనా చెప్పుకోండి మా రేటు ఇంతే అనే ధోరణితో వ్యవహరిస్తున్నారు.


ఉమ్మడి జిల్లాలో రూ.1000 కోట్లతో పరిశ్రమలు

పారామౌంట్ సంస్థ ఉమ్మడి జిల్లాలో దాదాపుగా రూ.1000 కోట్ల వ్యయంతో పరిశ్రమలను స్థాపించింది. ఈ సంస్థ ఐరన్ గడ్డర్లు, బ్యారికేడ్లు, ఐరన్ షీట్స్ వంటి ఉత్పత్తులను తయారు చేస్తుంది. ప్రస్తుతం ఐరన్ స్ట్రక్చర్‌తో భవనాలు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఇలాంటి భవనాలకు అవసరమైన సామగ్రిని ఈ సంస్థ అందిస్తుంది. పెనుగంచిప్రోలులో పరిశ్రమ విస్తరణ కోసం ఇటీవల ఎనిమిది ఎకరాలను ఆ సంస్థ కొనుగోలు చేసింది. ఆ భూమిలో పెయింటింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని మిగతా 6లో..

నిఘా నేత్రాలకు దొరికిపోయారు!

11 గంటల వ్యవధిలో రెండు చోరీలు ఛేదించిన పోలీసులు

- పటమటలో బంగారం, చిట్టినగర్‌లో డబ్బు భద్రం
- సీసీ కెమెరాల ద్వారా నిందితుల గుర్తింపు 6



తప్పులు చేసి పారిపోదామనుకున్నా తప్పించుకోలేకపోతున్నారు. సీసీ కెమెరాలకు చిక్కి గంటల వ్యవధిలోనే పోలీసులకు దొరికిపోతున్నారు. విజయవాడ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో జరిగిన చోరీ కేసులను సీసీఎస్, శాంతిభద్రతల పోలీసులు 11 గంటల వ్యవధిలో ఛేదించారు. నిందితులతోపాటు కాజేసిన సొత్తును భద్రంగా స్టేషన్లకు తీసుకొచ్చారు.

పులిచింతల పరవళ్లు

నాగార్జున సాగర్ నుంచి భారీగా వస్తున్న వరద

- మంగళవారం సాయంత్రానికి నిండనున్న ప్రాజెక్టు
- ఏ క్షణమైనా దిగువున ప్రకాశం బ్యారేజీకి నీటి విడుదల
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు


పులిచింతల ప్రాజెక్టులో నీటి పరవళ్లు

కంచికచర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. జిల్లాలోని జగ్గయ్యపేట, చందర్లపాడు, నందిగామ, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని నది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందిగా అధికారులు హెచ్చరిస్తున్నారు. శ్రీశైలం నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో నాగార్జున సాగర్ జలాయశం నిండుకుండలా మారింది. గరిష్ఠ నీటి మట్టానికి చేరువలో ఉండటంతో మంగళవారం గేట్లు ఎత్తారు. ప్రాజెక్టు 26 గేట్లు ఐదు అడుగుల ఎత్తున ఎత్తటంతో వరద నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది. సాగర్ నుంచి 2.04 లక్షల క్యూసెక్కులు పులిచింతలకు వస్తున్నాయి. పులిచింతల ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 53.34 మీటర్లు. నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు నీటి మట్టం 49.77 మీటర్లకు చేరింది. ప్రాజెక్టులో 29.48 టీఎంసీలు ఉన్నాయి. సాగర్, మూసీ నుంచి మొత్తం 2,18,832 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. రెండు లక్షల క్యూసెక్కులకు పైగా వస్తుండటంతో పులిచింతల కేవలం కొన్ని గంటల్లోనే పూర్తిగా నిండనుంది. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తికి 17,600 క్యూసెక్కులు మాత్రం వినియోగిస్తున్నారు. పరిస్థితిని బట్టి ఏక్షణమైనా పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువ ప్రకాశం బ్యారేజీకి నీరు విడుదల చేసే అవకాశం ఉండటంతో తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో ఈవో శీనానాయక్, సీపీ రాజశేఖర్ బాబు



దసరా ఉత్సవాలకు పక్కా ప్రణాళిక

సెప్టెంబర్ 22 నుంచి 11 రోజుల పాటు నిర్వహణ


- ఉత్సవాల నిర్వహణలో అధికారుల సమన్వయం కీలకం
- సామాన్య భక్తుల సంతృప్తికే తొలిప్రాధాన్యం 6
- మూలా నక్షత్రం రోజున రెండు లక్షల వరకు రానున్న భక్తులు
- కలెక్టర్ లక్ష్మీశ, ఈవో శీనానాయక్, సీపీ రాజశేఖర్ బాబు

ఉత్సవాలలో విశిష్ట అర్చనలు రద్దు? 6

వారధి వద్ద మారని సీన్.!


8

శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు



- దసరా ఉత్సవాల నిర్వహణలో అధికారుల సమన్వయం కీలకం
- సామాన్య భక్తుల సంతృప్తికే ప్రాధాన్యం
- సాంకేతిక, ఏఐ టూల్స్ వినియోగానికి సన్నద్ధం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్ బాబు

ఇంద్రకీలాద్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో సామాన్య భక్తులకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ప్రణాళిక ప్రకారం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సాంకేతికత, ఏఐ టూల్స్ అనుసంధానంతో మధురానుభూతి కలిగించేలా ఈ ఏడాది ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు తెలిపారు. దుర్గగుడిలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు 11 రోజుల పాటు జరగనున్న దసరా ఉత్సవాలపై మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీ రాజశేఖర్ బాబు, జేసీ ఎస్.ఇలక్కియా, దుర్గగుడి ఈవో శీనానాయక్ తదితరులు రెవెన్యూ, దేవదాయ, పోలీస్, వీఎంసీ, పౌరసరఫరాలు, వైద్య, ఆరోగ్యం, విద్యుత్, రవాణా, ఆర్అండ్‌బి, సమాచార పౌరసంబంధాలు తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టవలసిన పనులపై చర్చించారు. ప్రత్యేక పూజలు, అమ్మవారి అలంకరణలు, భక్తుల క్యూలు, బారికేడింగ్, ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ కౌంటర్లు, పార్కింగ్, మంచి నీటి సరఫరా, పారిశుధ్యం, ఘాట్‌ల వద్ద షవర్ల ఏర్పాటు, భద్రతా వ్యవస్థ, ప్రసాదాల తయారీ, పంపిణీ, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, వైద్య శిబిరాలు, పాస్‌ల జారీ, సూచికల బోర్డులు ఏర్పాటు, తదితరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఏటా దసరా ఉత్సవాలకు భక్తుల సంఖ్య పెరుగుతోందని, ఈ ఏడాది రోజుకు సుమారు లక్ష మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారని, మూలా నక్షత్రం రోజున రెండు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి వస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. నిరంతర పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఇక్కడ ఉంటారన్నారు. క్యూలు, లడ్డూ ప్రసాదం, అన్నదానం, పారిశుధ్యం, తాగునీరు, ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్టు తెలిపారు. దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ నేపథ్యంలో అవసరం మేరకు ఇతర జిల్లాల సిబ్బంది సేవలను కూడా వినియోగించనున్నట్టు వెల్లడించారు. సెప్టెంబరు 20 నాటికే ఏర్పాట్లను పూర్తిచేసి సర్వసన్నద్ధంగా ఉండాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో దుర్గగుడి స్థానాచార్యుడు వి.శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్, ఆర్డీవో ఎం.లక్ష్మీనరసింహం, డీసీపీ కె.జి.వి.సరిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, వివిధ శాఖల ఉన్నతాధికారులు

డ్రోన్లు, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

- సీపీ రాజశేఖర్‌బాబు

గతేడాది దసరా ఉత్సవాలలో చిన్న చిన్న లోపాలను సరిదిద్ది ఈ ఏడాది భక్తులకు ఎటువంటి అసౌకర్యం రాకుండా గట్టి ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఉత్సవాలలో 42 డ్రోన్లు అందుబాటులో ఉంటాయి. విజయవాడ కమిషనరేట్ పరిధిలో సుమారు ఐదువేల సీసీ కెమెరాలు ఉన్నాయి. ఈ-డిస్ప్లేయ్‌మెంట్ యాప్‌తో పాటు అస్త్రం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ యాప్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.



భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు

-ఈవో శీనానాయక్

దుర్గగుడిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రభుత్వ మార్గదర్శకాలు, కలెక్టర్ నేతృత్వంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నాం. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఉత్సవాల నిర్వహణకు సమన్వయ శాఖల అధికారులతో కలిసి కృషి చేయనున్నాయి.

ఉత్సవాలలో విశిష్ట అర్చనలు రద్దు?

- వీఐపీలకే అంతరాలయ దర్శనం..
- సాధారణ భక్తులు రూ.300లకే పరిమితం
- సమన్వయ కమిటీ సమావేశంలో అధికారుల వివాదాస్పద ప్రతిపాదనలు
- తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసిన ఆలయ వైదిక కమిటీ

ఇంద్రకీలాద్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈ ఏడాది దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కలెక్టర్ జి.లక్ష్మీశ కలెక్టరేట్‌లో నిర్వహించిన దసరా ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశంలో పలువురు అధికారుల వివాదాస్పద ప్రతిపాదనలను ఆలయ అర్చకస్వాములు, ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దసరా ఉత్సవాలలో దుర్గమ్మకు ఎంతో ప్రీతికరమైన ప్రత్యేక విశిష్ట అర్చనలు (ఖడ్గమాల, చండీ హోమం, శ్రీచక్రనవావరణార్చన, ప్రత్యేక కుంకుమార్చన)లలో పాల్గొనటానికి పెద్ద ఎత్తున ఉభయదాతలు ఆసక్తి చూపుతారు. కొందరు ఉభయదాతలు ప్రతీఏడాది జరిగే దసరా ఉత్సవాలలో విశిష్ట అర్చనలలో పాల్గొనటం ఆనవాయితీ. అయితే ఉత్సవ సమన్వయ కమిటీ సమావేశంలో ఓ అధికారి ప్రత్యేక విశిష్ట అర్చనలు రద్దు చేయాలని ప్రతిపాదనలు చేసినట్టు తెలిసింది. విశిష్ట అర్చనల్లో ఉభయదాతలు పాల్గొనకుండా కేవలం దేవస్థానం అర్చకులు మాత్రమే నిర్వహించాలని చేసిన ప్రతిపాదనపై వైదిక కమిటీసభ్యులు, అర్చకస్వాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి దుర్గమ్మ సన్నిధిలో జరిగే ప్రత్యేక విశిష్ట అర్చనలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని, అటువంటి అర్చనలు రద్దు చేయటం ఎంతవరకు భావ్యమని వైదిక కమిటీ సభ్యులు ప్రశ్నించటంతో ఆ అర్చనలు రద్దు చేయాలన్న అధికారి మిన్నకుండిపోయారు. మరోవైపు దసరా ఉత్సవాల్లో అంతరాలయం టిక్కెట్ రూ.500లు కొనుగోలుచేసిన సాధారణ భక్తులకు రూ.300ల క్యూలో అనుమతించే విధంగా ప్రతిపాదన చేశారు. రూ.500ల టిక్కెట్ క్యూలో కేవలం వీవీఐపీలకు, వీఐపీలకు మాత్రమే అనుమతించాలని చేసిన ప్రతిపాదనపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.300ల టిక్కెట్ రూ.500లకు పెంచే ప్రయత్నానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిసింది. దసరా ఉత్సవాల్లో భక్తుల మనోభావాలు దెబ్బతినేలా సంబంధిత ఉన్నతాధికారుల ప్రతిపాదనలు ఉన్నాయని విమర్శలు వినపడుతున్నాయి. సమన్వయ కమిటీ మొదటి సమావేశంలోనే పలువురు అధికారులు వివాదాస్పద ప్రతిపాదనలు చేయటంతో దేవస్థానం అర్చకస్వాములు, ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా కాకుండా దసరా ఉత్సవాలలో భక్తులు అందరికీ అమ్మవారి దర్శనం సక్రమంగా జరిగేలా, ప్రత్యేక విశిష్ట పూజల్లో ఉభయదాతలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని దేవస్థానం ఉద్యోగులు, అర్చకస్వాములతో పాటు భక్తులు కోరుతున్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఈవో వీకే శీనానాయక్

దుర్గగుడిలో అభివృద్ధి పనులు వేగవంతం

» ఈవో వీకే శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఈవో వీకే శీనానాయక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మాణంలో ఉన్న పూజా మండపం, యాగశాల, కొత్త అన్నదాన భవనం, ప్రసాదం తయారీ పోటు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, రానున్న దసరా మహోత్సవాలకు నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అన్నదానం భవనం, ప్రసాదం తయారీ పోటు తదితరాలు దసరా మహోత్సవాలకు ఎంత మేరకు అందుబాటులోకి వస్తాయనే దానిపై సూచనలు చేశారు.

‘నిఘా’ నేత్రాలకు దొరికిపోయారు!

విజయవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పటమటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కాలనీలో గిరిజాశంకర్ వరప్రసాద్ ఇంట్లో కిటికీ ఇనుప ఊసలను విరగ్గొట్టి చోరీ చేసిన నిందితులు ఇద్దరినీ పటమట పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.29 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒక యువకుడు, ఓ బాలిక ఉన్నారు. ఇద్దరూ ప్రేమికులు కావడం గమనార్హం. ఆ వివరాలను సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదరరావు, ఇన్‌స్పెక్టర్ వి.పవన్‌కిషోర్ మంగళవారం వెల్లడించారు. మాచవరం పోలీసుస్టేషన్ సమీపంలోని కొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న మీసాల అజయ్ కుమార్ ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో ఉన్న 17 ఏళ్ల బాలిక పదో తరగతి ఫెయిలైంది. ఇంతకుముందు ఆమె కుటుంబం మాచవరంలో ఉండేది. ఆ క్రమంలో అజయ్‌కుమార్‌తో ప్రేమలో పడింది. మైనారిటీ తీరకుండా ప్రేమలో ఉండటంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అజయ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసు కోర్టులో విచారణలో ఉండగా, కొద్ది నెలల క్రితం ఈ కుటుంబాలు లోక్‌అదాలత్‌లో రాజీపడ్డాయి. అప్పటి నుంచి అజయ్‌కుమార్, బాలిక ప్రేమాయణం కొనసాగిస్తున్నారు. త్వరలో హైదరాబాద్ వెళ్లి స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం అవసరమైన డబ్బులు చేతిలో ఉండాలంటే దొంగతనం చేయడానికి సిద్ధమయ్యారు.

ఆ ఇంటిని ఎందుకు టార్గెట్ చేశారంటే..

అజయ్‌కుమార్‌తో ప్రేమలో ఉన్న బాలికకు వాసవీ కన్యకాపరమేశ్వరి కాలనీలో ఉంటున్న గిరిజా శంకర్ వరప్రసాద్ ఇంటితో అనుబంధం ఉంది. ఆయనకు బాలిక అమ్మమ్మ పరిచయస్తురాలు. బాల్యంలో ఈ ఇంట్లో బాలిక ఆడుకుంది. దీంతో వరప్రసాద్ ఇంట్లో చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం 22న మొగల్రాజపురం సున్నంబట్టీల సెంటర్‌లో ఓ స్కూటర్‌ను దొంగిలించారు. తర్వాత దానిపై ఇద్దరూ కలిసి పలుమార్లు రెక్కీ చేశారు. 26న రెక్కీకి బయలుదేరిన క్రమంలో గురునానక్ కాలనీలో ఓ ఇంటి గేటుకు బయట కట్టిన సిజ్జు జాతికి చెందిన కుక్కను దొంగిలించారు. అదే రోజున స్కూటర్‌పై ఇద్దరూ వరప్రసాద్ ఇంటికి వెళ్లారు. ఆయన ఇంతకుముందు ఫన్‌టైమ్స్ క్లబ్ అధ్యక్షుడిగా పని చేసిన విషయం తెలియడంతో అందులో ఉద్యోగాలు ఇప్పించమని అడిగారు. ఈ పరిణామంతో ఆ ఇద్దరికి ఇంటిపై పూర్తి అవగాహన వచ్చింది. 27వ తేదీ అర్ధరాత్రి అజయ్‌కుమార్, బాలిక ఆ ఇంటి లోపలకు వెళ్లి కిటికీ ఊసలను ఇనుపరాడ్‌తో పగలగొట్టారు. బాలిక ఆ రంధ్రం నుంచి లోపలకు వెళ్లి బీరువాలోని 36 కాసుల బంగారు ఆభరణాలు కాజేసి బయటకు వచ్చింది. అక్కడి నుంచి ఇద్దరూ వెళ్లిపోయారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బంగారం మొత్తం భవానీపురంలోని బాలిక ఇంట్లో పెట్టారు. అక్కడి నుంచి స్కూటర్‌పై నందిగామలో ఉన్న అజయ్ కుమార్ బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. అక్కడ పూటుగా మద్యం తాగి వాకిట్లో మంచంపై నిద్రపోయారు. సీసీ కెమెరాల ఫుటేజీలను అనుసంధానం చేసిన సీసీఎస్, లా అండ్ ఆర్డర్ పోలీసులు నిందితులు ఇద్దరినీ పట్టుకున్నారు. బాలిక ఇంట్లో ఉన్న మొత్తం వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

ఏసీ రిపేరుకు వచ్చి.. చోరీకి స్కెచ్ వేశాడు..

ఏసీ రిపేరు చేయడానికి వచ్చిన వ్యక్తి కొద్దిరోజులు తర్వాత ఆ ఇంటికే కన్నం వేశాడు. చిట్టినగర్‌లో జరిగిన చోరీ కేసులో అసలు నిందితుడ్ని కొత్తపేట పోలీసులు, సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. అయోధ్యనగర్‌కు చెందిన తాడికొండ పవన్‌కుమార్ అలియాస్ బాబి ఏసీ మెకానిక్. చిట్టినగర్ అడ్డరోడ్డు ప్రాంతానికి చెందిన కొండ కృష్ణ ఇంట్లో ఏసీ రిపేరు కావడంతో పవన్‌కుమార్‌ను పిలిపించాడు. రిపేరు చేసే క్రమంలో పవన్‌కుమార్ ఇంటిని మొత్తం రెక్కీ చేశాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేరని గ్రహించిన పవన్ బైక్‌పై కృష్ణ ఇంటి వద్దకు చేరుకున్నాడు. ఇంటి తాళం పగలుగొట్టి బీరువాలో ఉన్న రూ.5లక్షలను ఎత్తుకెళ్లిపోయాడు. చోరీ జరిగిన ప్రదేశం నుంచి ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు పవన్ బైక్‌పై వెళ్లినట్టు గుర్తించారు. అతడిని పోలీసులు అర్ధరాత్రి పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.4.35 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కలిసే ముంచారు!

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ కూడా చేయించేసుకున్నారు.

బాధితుల ఫిర్యాదుతో మరిన్ని విషయాలు వెలుగులోకి..

వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అప్పుగా ఇచ్చిన మొత్తానికి వెంచర్‌ను ప్రైవేటు వ్యక్తులు తనఖా పెట్టుకున్నారు. వెంచర్ అంటే .. వ్యవసాయేతర భూమి. గతంలో వ్యవసాయభూమిగా ఉన్నప్పటికీ వెంచర్ కోసం ల్యాండ్ కన్వర్షన్ జరిగింది. వ్యవసాయేతర భూమిగా ఉన్న దానిని ప్రైవేటు వ్యక్తులు తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వ్యవసాయ భూములుగా రెవెన్యూ రికార్డులలోకి ఎక్కించుకోవటంతో పాటు ఏకంగా పాస్ పుస్తకాలను కూడా పొందారు. రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకుని ఆయిల్‌పామ్ సాగు చేశారు. వెంచర్‌లో ప్లాట్లను కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఏమిటన్నది వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కనీసంగా కూడా ఆలోచించలేదు. వందలాది మందికి ప్లాట్లను విక్రయించి వారి దగ్గర కోట్ల రూపాయలను వసూలు చేసిన వీవీఆర్ సంస్థ ఈ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఎలా బదిలీ చేసిందన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

2010లో ల్యాండ్ కన్వర్షన్

అంపాపురం గ్రామంలోని సర్వే నెం. 201-1, 203-1, 210-2, 213-2లో వీవీఆర్ సంస్థ కొనుగోలు చేసిన సుమారు 44 ఎకరాల భూమిలో 33 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు 2010లో గ్రామపంచాయతీకి దరఖాస్తు చేసుకుంది. గ్రామపంచాయతీకి రూ.1,29,472లను కట్టిన రసీదు నెం.12421 ద్వారా తదనంతరం ఆర్డీవో ద్వారా వ్యవసాయేతర భూమిగా మార్చుకున్నారు. ఇలా వ్యవసాయేతర భూమిగా నమోదైన భూమిలో 6.84 ఎకరాలను 2011, జూలై నెలలో భీమవరపు సాంబిరెడ్డి వ్యవసాయభూమిగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కానుమోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిగింది. వీవీఆర్ హౌసింగ్‌కు చెందిన పార్టనర్ కేవీఎస్ మూర్తి ద్వారా కంపెనీలో పెట్టుబడి పెట్టి ఈ భూమిని సాంబిరెడ్డి రాయించుకున్నట్టు తెలుస్తోంది. తదనంతరం కేవీఎస్ మూర్తి హఠాన్మరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని వ్యవసాయేతర భూమి అయినా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు డబ్బులు చెల్లించి, భూమి పత్రాలు ఇవ్వకుండానే తన కుటుంబ సభ్యుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించాడని బాధితులు ఆరోపిస్తున్నారు. 2014లో అప్పటి తహసీల్దార్ నరసింహారావు, రెవెన్యూశాఖ అధికారులు ఇతనికి పట్టాదారు పాసుపుస్తకాలు కూడా మంజూరు చేశారని బాధితులు చెబుతున్నారు. అప్పట్లోనే తన కుటుంబసభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నించగా, 6.84 ఎకరాల వ్యవసాయ భూమి కాస్తా 16,505 గజాలుగా నమోదైంది. ఇంత సొమ్ము ఎక్కడిదంటూ ఆదాయపన్ను శాఖ నుంచి తాఖీదులందుకున్న సాంబిరెడ్డి తన కున్న పలుకుబడిని ఉపయోగించి తప్పించుకున్నాడని తెలిసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టాదారు పాసుపుస్తకాల ఆధారంగా భూమిని స్వాధీనం చేసుకుని, పామాయిల్ సాగు చేసినట్టు బాధితుడు రఘువీర్‌శర్మ వివరించారు.

పాస్ పుస్తకాలు రద్దుకు సిఫార్సు

గుగూల్ మ్యాప్ ఆధారంగా బాధితుడు రఘువీర్‌శర్మ గత 20 సంవత్సరాలుగా తీసిన ఆధారాలతో వ్యవసాయేతర భూమిగా నమోదైన భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని రెవెన్యూ అధికారుల ముందు నిరూపించారు. దీంతో రెవెన్యూశాఖ అధికారులు కూడా పరిశీలన జరిపి, తప్పు జరిగిందని ధ్రువీకరించారు. పట్టాదారు పాసు పుస్తకాల రద్దుకు సిఫార్సు చేశారు.

పీజీఆర్ఎస్, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం), ఆంధ్రజ్యోతి మద్దతుతోనే పోరాటం చేస్తున్నామని బాధితులు తెలిపారు. తమ పోరాటానికి అండగా నిలిచిన పీజీఆర్ఎస్, ‘ఆంధ్రజ్యోతి’కి కృతజ్ఞతలు చెప్పారు. తమ భూమి తమకు అప్పగిస్తే చాలని కోరారు.



గొల్లపూడిలో ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కరపత్రాలను పంపిణీ చేస్తున్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే వసంత

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు జవాబుదారీతనం పాలన

» హోంమంత్రి వంగలపూడి అనిత

గొల్లపూడి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలనను కూటమి ప్రభుత్వం అందిస్తున్నదని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో ‘సుపరిపాలనలో తొలిఅడుగు’ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి అనిత, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ విజయవంతం చేయడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. ముస్లిం సోదరీమణుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు బొమ్మసాని సుబ్బారావు, జంపాల సీతారామయ్య, మైలవరం జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), గ్రామ అధ్యక్షులు నూతులపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ బరితెగింపు!

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించింది. పెయింటింగ్ యూనిట్ స్థానికంగా లేకపోవటం వల్ల వీటిని బయట ప్రాంతానికి తీసుకువెళ్లి పెయింటింగ్ చేయిస్తున్నారు. స్థానికంగానే పెయింటింగ్ యూనిట్ ఏర్పాటు ద్వారా బయటకు తీసుకు వెళ్లే బాధ తప్పుతుందని పారామౌంట్ యాజమాన్యం భావించింది. ఈ పెయింటింగ్ యూనిట్ ద్వారా స్థానికంగా చాలా మందికి ఉద్యోగావకాశాలు కూడా వస్తాయి. ప్రభుత్వానికి ఆదాయం కూడా లభిస్తుంది. కొనుగోలు చేసిన భూమి సక్రమమే. నిబంధనలకు అనుగుణంగానే ఆ భూములకు రిజిస్ట్రేషన్ జరిగింది. నిబంధనల మేరకు యూనిట్ కడుతున్నారు కాబట్టి ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే .. లంచం ఎందుకు కట్టాలో అర్థం కాక ఈ అంశాన్ని పారామౌంట్ యాజమాన్యం తల పట్టుకుంది. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య దృష్టికి తీసుకువెళ్లింది. జరిగిన వ్యవహారాన్ని పరిశీలించిన తర్వాత రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే తాతయ్య మందలించారు. తర్వాత వెళ్లి రెవెన్యూ అధికారులను కలవమని చెప్పి పంపారు. తీరా రెవెన్యూ అధికారుల దగ్గరకు వెళితే .. డబ్బులు చెల్లించాల్సిందేనని డిమాండ్ చేయటంతో బిత్తరపోయారు. దీంతో పారామౌంట్ యాజమాన్యం తాత్కాలికంగా పెయింటింగ్ యూనిట్ విస్తరణ పనులకు బ్రేక్ వేసింది.

పీ4లో ప్రభుత్వానికి బాసటగా నిలిచిన సంస్థకు ఇబ్బందులు

ఎన్టీఆర్ జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్షేత్ర స్థాయిలో పీ4 తొలి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు పారామౌంట్ యాజమాన్యం ఎంతో పెద్ద మనసు చూపింది. ఇప్పటి వరకు ఏ పారిశ్రామిక సంస్థ కూడా చేయని విధంగా మొత్తం 27 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవటం జరిగింది. ఆర్థికంగా, విద్యా, వైద్య పరంగా ఆ కుటుంబాల బాధ్యతలను తీసుకున్న పారామౌంట్ యాజమాన్యాన్ని చంద్రబాబు అభినందించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులో తలశిల, లేళ్లపై తదుపరి చర్యలు నిలుపుదల

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన కేసులో వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి తదుపరి చర్యలను అన్నింటినీ హైకోర్టు నిలుపుదల చేసింది. కేసు విచారణను నెలరోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. మాజీ సీఎం జగన్ గుంటూరు మిర్చియార్డ్ పర్యటన సందర్భంగా ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని పేర్కొంటూ ఎన్నికల అధికారి ఫిర్యాదు ఆధారంగా నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈవ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన సందర్భంలో ఎన్నికల అధికారి నేరుగా ఫిర్యాదు చేయడానికి వీల్లేదన్నారు. పోలీసులు నమోదు చేసిన కేసు చెల్లుబాటు కాదన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీలోత్పల్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. ముందస్తు ఎలాంటి అనుమతి తీసుకోకుండా పర్యటన చేపట్టారన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు విషయంలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనతో ప్రాథమికంగా ఏకీభవించారు. కేసు ఆధారంగా తదుపరి చర్యలు నిలుపుదల చేశారు.

నీతి సూక్తులు చెప్పే హక్కు జగన్‌కు లేదు

» దేవినేని ఉమామహేశ్వరరావు

విజయవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : దోపిడీ పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌కు నీతిసూక్తులు చెప్పే హక్కు లేదని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జగన్ పాలన ఐదేళ్ల అవినీతి, అగాధాల మయమన్నారు. మద్యం కుంభకోణానికి ‘బిగ్‌బాస్’ జగన్మోహన్‌రెడ్డేనని, నాసిరకం మద్యం వల్ల ఐదేళ్లలో 30 వేలమంది మరణించారని ఆరోపించారు. మార్కెట్‌లో రూ.500 నోటు కనబడడం లేదని, అవన్నీ జగన్ అక్రమ సంపాదనలో భాగంగా కంటైనర్లలో తాడేపల్లి నుంచి ఇడుపులపాయ, అక్కడి నుంచి బెంగుళూరు యలహంక ప్యాలెస్‌కు చేరుకున్నాయని ఆరోపించారు. వివేకానందరెడ్డి హత్యకేసులో ముద్దాయిలు ఎవరని, జగన్‌ను పులివెందులకు తీసుకెళ్లిన డ్రైవర్ ఎలా చనిపోయాడని.. జగన్‌కు ధైర్యం ఉంటే విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం పెట్టి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.

అంతర్‌జిల్లా దొంగల అరెస్టు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఉంచిన బైక్‌లు, ఇంటి తాళాలు పగలగొట్టి చోరీలు చేసే అంతర్‌జిల్లా దొంగలను వీరవల్లి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా జగన్నాథపురానికి చెందిన దేవప్రకాష్, విజయవాడ విద్యాధరపురానికి చెందిన పెద్దప్రోలు ఆశోక్‌కుమార్, విజయవాడ అర్బన్ కుండల మార్కెట్‌కు చెందిన నాయిని ప్రభుకుమార్ అలియాస్ లక్కీ, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన వేము ప్రసన్నరాజు రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలు చేశారని తెలిపారు. ఎ.సీతారాంపురం వద్ద జాతీయ రహదారిపై బండారుగూడెం వెళ్లే మార్గం వద్ద వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్ మంగళవారం ఉదయం వాహన తనిఖీలు చేస్తుండగా.. అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. హనుమాన్‌జంక్షన్ సీఐ సత్యనారాయణ వారిని విచారించారు. తిప్పనగుంటలో చోరీ చేసిన రూ.57వేల నగదు, తాకట్టు పెట్టిన 16గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకుని, చోరీ సొత్తును, నిందితులను నూజివీడు కోర్టుకు తరలించినట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

వ్యాధులు కబళిస్తున్నాయ్..

- కుమార్తెకు లుకేమియా.. తండ్రికి కిడ్నీ వ్యాధి
- క్యాన్సర్‌తో పోరాడి కన్నుమూసిన కుమార్తె
- వైద్యం కోసం ఉన్నదంతా ఊడ్చిపెట్టారు..
- కిడ్నీలు ఫెయిలై మంచం పట్టిన తండ్రి
- వైద్యం చేయించలేని నిస్సహాయ స్థితిలో భార్య, కుమారుడు
- దాతల సాయం కోసం ఎదురుచూపు

ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబంపై విధి పగ పట్టింది. అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. కుమార్తెకు క్యాన్సర్ వ్యాధితో ఉన్నదంతా ఊడ్చిపెట్టి వైద్యం చేయించినా ప్రయోజనం లేకపోయింది. ఆ బాధ నుంచి తేరుకోకముందే ఇంటి యజమానికి రెండు కిడ్నీలు ఫెయిలై మంచానికే పరిమితమయ్యాడు. వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక కుటుంబసభ్యులు విలవిల్లాడుతున్నారు. ఉన్నదంతా కుమార్తె వైద్యానికి ఖర్చుచేశామని, ఇప్పుడు ఎక్కడి నుంచి తేవాలంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. దాతల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.



రెండు కిడ్నీలు ఫెయిలై మంచానికే పరిమితమైన కొర్లగంటి లక్ష్మీప్రసాద్

(ఆంధ్రజ్యోతి-పాతరాజరాజేశ్వరి పేట) : విజయవాడ నగరం 34వ డివిజన్ కేదారేశ్వరపేట, మసీదు సెంటర్, నాలుగో లైన్‌లో నివాసం ఉంటున్న కొర్లగంటి లక్ష్మీప్రసాద్ (50) ఓ ప్రైవేటు కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేసేవారు. ఆయన భార్య స్వప్న గృహిణి. వీరికి కొడుకు వరుణ్ కుమార్, కుమార్తె దేవి అమృత. నగరంలోని ఓ కళాశాలలో దేవి అమృత బి.టెక్ చదువుతుండగా.. అకస్మాత్తుగా క్యాన్సర్‌కు గురికావడంతో సుమారు రూ.35 లక్షల వరకు ఖర్చుపెట్టి చికిత్స అందించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో ఈ నెల 10న దేవి అమృత (22) మృతి చెందింది. కుమార్తెకు చికిత్స సమయంలోనే లక్ష్మీప్రసాద్ 2024, డిసెంబర్‌లో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. రెండు కిడ్నీలు ఫెయిల్ అయినట్టు వైద్యులు పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెల నుంచి లక్ష్మీప్రసాద్‌కు వారంలో రెండుసార్లు డయాలసిస్ చేస్తున్నారు. ఆరోగ్యశ్రీలో డయాలసిస్‌ను చేయిస్తున్నా ఆస్పత్రికి వెళ్లడానికి అంబులెన్స్, డయాలసిస్ కిట్‌లకు కలిపి మొత్తంగా ప్రతిసారి రూ.6,400 ఖర్చు అవుతుంది. వారానికి రెండు సార్లు చొప్పున నెలకు రూ.51,200 ఖర్చు చేయాల్సి వస్తున్నది. దీనికి తోడు రూ.5000 మందులకు ఖర్చు అవుతోంది.

కుమార్తె మృతితో చితికిపోయిన కుటుంబం లక్ష్మీప్రసాద్‌కు వైద్యం చేయించలేక ఆయన భార్య స్వప్న, కొడుకు వరుణ్ కుమార్‌లు తీవ్ర వేదన చెందుతున్నారు. ఉన్నదంతా దేవి అమృత వైద్యానికే ఖర్చయిపోవడంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోతోంది. దాతల కోసం ఎదురుచూస్తోంది. దాతలు సహకరించి ఆదుకోవాలని కుటుంబసభ్యులు ప్రాధేయపడుతున్నారు. సాయం చేయాలనుకున్నవారు ఫోన్ పే-9515823254 (కొర్లగంటి వరుణ్ కుమార్)కు గానీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎక్కౌంట్ నెంబర్-159515823254, ఐఎఫ్ఎస్‌సి కోడ్-ఐఎన్‌డిబి 0000823గానీ ఆర్థిక సాయం చేయాలని కోరారు.



ఆరోగ్య రంగంలో కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం

మొగల్రాజపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ రంగంలో విద్యార్థులు కొత్త అవిష్కరణలు చేసేలే ప్రోత్సహించడానికి ఆగస్టు 28న సిద్ధార్థ ఫార్మసీ కళాశాల, ఐటీసీ సంయుక్తంగా పోటీలను నిర్వహిస్తున్నట్లు కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సునీత తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది స్మార్ట్ సొల్యూషన్స్ ఫర్ స్మార్టర్ హెల్త్‌కేర్ అనే శీర్షికతో బీ ఫార్మసీ, ఫార్మడీ, ఎం ఫార్మా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

అవగాహన సదస్సులో ఏసీపీ ప్రసాద్

విజయవాడ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మహిళా పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ) టి.డి.ప్రసాద్ సూచించారు. జక్కంపూడిలోని వైఎస్సార్ కాలనీలో మంగళవారం పర్యటించి మత్తు పదార్థాల వినియోగం-దుష్పరిణామాలు అనే అంశంపై అక్కడి యువతకు అవగాహన కల్పించారు. మత్తులో యువత ఎన్నో నేరాలకు, చోరీలకు పాల్పడుతూ సంఘ వ్యతిరేక శక్తులుగా తయారవుతున్నారన్నారు. కొందరు భవిష్యత్తును నాశనం చేసుకుని జైలు జీవితాన్ని అనుభవిస్తున్నారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందని, తప్పు చేసిన వారు తప్పించుకోలేరన్నారు. గడిచిన రెండు రోజుల్లో యాంటీ నార్కోటిక్, ఈగల్ బృందాలు జిల్లాలో తనిఖీలు నిర్వహించి 135 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. వారిలో 75 మందిని మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ ద్వారా తనిఖీ చేసి ఇద్దరు పాత నేరస్థులను గుర్తించామన్నారు. తదుపరి చర్యల నిమిత్త ఇరువురిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని ఏసీపీ తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 36 మందిని అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో అప్పగిచామని, అనుమానిత 10బడ్డీకొట్లను తనిఖీ చేశామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ వాసవి, కొత్తపేట స్టేషన్ సీఐ చిన్నకొండలరావు పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలో..

ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించగలమని ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. సత్యనారాయణపురం ఏకేటీపీఎం పాఠశాలలో డ్రగ్స్ వద్దు బ్రో నినాదనంతో మంగళవారం ఈగల్‌సెల్ అధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ వల్ల జరిగే దుష్పరిణామాలపైన అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కిరణ్‌కుమార్ మాట్లాడుతూ యువత మత్తుకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి చాక్లెట్లు గురిచం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈగల్ సీఐ నారాయణరావు, ఎస్సై వీరాంజనేయులు హెడ్‌కానిస్టేబుల్ పి.మోహన్ పాల్గొన్నారు.



వైఎస్సార్ కాలనీలో యువతకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ ప్రసాద్

మద్యం తాగి వాహనాలు నడిపిన 24 మందికి రూ.2.95 లక్షల జరిమానా

విజయవాడ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనాలు నడిపిన 24 మందికి రూ.2.95 లక్షలు జరిమానా విధిస్తూ విజయవాడ ఆరో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు మంగళవారం తీర్పు చెప్పారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐదో పట్టణ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకున్న 24 మందిని కోర్టులో హాజరుపరిచారు. వీరిలో 11 మందికి రూ.15 వేలు చొప్పున రూ.1.65 లక్షలు, 13 మందికి రూ.10 వేలు చొప్పున రూ. 1.30 లక్షలు జరిమానా విధించారు.

సైబర్ నేరాలపై అవగాహన

భారతీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రలయోలా కళాశాల, పోలీసుల సైబర్ క్రైమ్ వింగ్ ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ కామర్స్ విద్యార్థులకు సైబర్ నేరాల అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబర్ క్రైమ్ వింగ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ మోసాలు, మొబైల్ నంబర్లు, నకిలీ బెట్టింగ్ యాప్‌లు, డిజిటల్ బ్లాక్‌మెయిల్ వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 ని ఉపయోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ మెల్చియర్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, కరస్పాండెంట్ ఫాదర్ రెక్స్ ఏంజెలో, స్టాఫ్ అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ జి.సహాయ భాస్కరన్, ఫిజిక్స్‌శాఖాధికారి డాక్టర్ టి.శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీపీఎస్, కేసీపీ స్కూల్స్‌లో చిత్రలేఖనం పోటీలు

మొగల్రాజపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 30,31 తేదీల్లో పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు మొగల్రాజపురం వీరమాచనేని పద్దయ్య పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీపీఎస్, కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్సియల్ పబ్లిక్ స్కూల్స్‌లో సామిత్య, కల్చరల్ కార్యక్రమాల్లో భాగంగా చిత్రలేఖనం, డిబెట్, కవిత్వం, క్విజ్, ప్రకటనల తయారీ, నృత్య సంగీతంలో పోటీలు ఉంటాయని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం, నిత్య అన్నదాన పథకానికి పలువురు దాతలు మంగళవారం విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అందజేశారు.

విశ్రాంత కాలంలో ప్రజాసేవ చేయాలి

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్

విజయవాడ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ కాలం విశ్రాంతికే కాకుండా ప్రజలకు మేలు చేసేలా ఉండాలని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్ హితవు పలికారు. జీఎస్టీ కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.గిరిబాబు ఉద్యోగ విరమణ సభ ఎంజీ రోడ్డులోని జీఎస్టీ భవన్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ సుజిత్ మాట్లాడుతూ విధి నిర్వహణలో గిరిబాబు అందించిన సేవలు ఉద్యోగులందరికీ మార్గదర్శనమన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణలో చూపిన ప్రతిభపైనే ప్రజా ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ప్రజా సేవా చేయాలని సూచించారు. అనంతరం గిరిబాబును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్‌లు అతీరా ఎస్.కుమార్. రాయులు, ఎం.నాగరాజు, ఉద్యోగ సంఘాల నాయకులు యుగంధర్, నవీన్‌రాజు, టి.వివేకానంద, గద్దె తిలక్, రాజేశ్వరరావు, సీతారామయ్య చౌదరి, పి.ఎన్.వి.ప్రసాద్, భాగ్యరావు, సామ్రాజ్యం పాల్గొన్నారు.



గిరిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్



అనధికార చిట్టీల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ దామోదర్

అనధికార చిట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఏసీపీ దామోదర్

విజయవాడ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా చిట్టీలు నిర్వహించిన వారిపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సెంట్రల్ ఏసీపీ కె.దామోదర్ హెచ్చరించారు. మాచవరం, పటమట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అనధికారికంగా చిట్టీలు నిర్వహిస్తున్న 100 మందికి నగరంలోని స్కై హోటల్ వద్ద సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అనధికార చిట్టీలతో ఎంతో మంది పేదలు నష్టపోతున్నారన్నారు. అనుమతులు లేకుండా చిట్టీలు నిర్వహించడం నేరమన్నారు. అనధికార చిట్టీలు నిర్వహించే వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పటమట సీఐ పవన్‌కిషోర్, మాచవరం సీఐ ప్రకాష్, గుణదల సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



గోల్డ్‌మెడల్‌తో చిన్నారి వి.దిలీష్ రాజ్

తైక్వాండోలో చిన్నారి దిలీష్ రాజ్ ప్రతిభ

విజయవాడ కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్యామాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోన్న వి.దిలీష్ రాజ్ తన క్రీడా ప్రతిభతో జాతీయ స్థాయిలో ఘన విజయం సాధించారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన పదవ జాతీయ ఓపెన్ కయోరుజీ, పూంసే తైక్వాండో చాంపియన్ షిప్ -2025 పోటీల్లో ఆమె బంగారు పతకం, ఒక వెండి పతకాన్ని కైవసం చేసుకొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో కడెట్ గార్ల విభాగంలో 55 కిలోల వెయిట్ కేటగిరీ (ప్రారంభదశ పోటీ)లో బంగారు పతకం అదే విభాగంలో సాధారణ కయోరూజీ పోటీలో వెండి పతకం కైవసం చేసుకొంది. దిలీష్ గతంలోనూ రాష్ట్రస్థాయిలో తన ప్రావీణ్యాన్ని చూపారు. 2020లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం 2024లో కాకినాడలో మరో బంగారు పతకం సొంతం చేసుకొంది. ఆ చిన్నారి కృషి విజయాన్ని మంగళవారం తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యం సిబ్బంది అభినందించారు.



సిప్ అబాకస్‌లో పటమట విద్యార్థుల ప్రతిభ

పటమట,జూలై 29(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి సిప్ అబాకస్ పోటీల్లో పటమట విద్యార్థులు 69 మంది విశేష ప్రతిభ కనబరిచినట్లు పటమట సిప్ అబాకస్ నిర్వాహకులు మానస తెలిపారు. మొదటి స్థానంలో బహుమతి పూజేష్, ధృతి, హర్షవర్ధన్, అర్జున్ నిలిచారని, ద్వితీయంలో రిషికేష్, సూర్యవర్ధన్, బ్రితి, తృతీయ విజేతలుగా హర్షిత, రేవంత్, తాధ్య, కీర్తిక, వర్షిత్, బాలప్రసన్న నిలిచారన్నారు. ఈ సందర్భంగా విజేతలను పలువురు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి చొరవచూపండి



పటమట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాలివాహనలు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కలెక్టర్ లక్ష్మీశను కోరి నట్లు శాలివాహన వెల్ఫేర్ అండ్ డవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పెరిపె ఈశ్వర్ తెలిపారు. ఈమేరకు వినతి పత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు హయత్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధ్యక్షులు నసీర్ అహ్మద్, కె.సాయిఅరుణ, వంశీధర దాసు తదితరులు

లయోలాలో సర్వమత ప్రార్థన సమావేశం

భారతీనగర్, జూలై29(ఆంధ్రజ్యోతి): సెయింట్ ఇగ్నేషియస్ ఆఫ్ లయోలా పండుగ సందర్భంగా ఆంధ్రలయెలా ఫ్రాన్సిస్ హాల్‌లో సర్వమత ప్రార్థన సమావేశం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో సంస్థల నిర్వహకులు ఫాదర్ ఎస్.జె.పుడోట రాయప్ప జాన్ మాట్లాడుతూ ఆంధ్రలయోలా సంస్థలు జూలై29 న భిన్నత్వంలో ఏకత్వం కోసం సర్వమత ప్రార్థన సమావేశాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో జమియత్ అహ్లేహదీస్ అధ్యక్షుడు నసీర్ అహ్మద్, సత్యసాయి సేవాసంస్థ ప్రతినిధి కె.సాయిఅరుణ, హరేకృష్ణ ఉద్యమం అండ్ అక్షయ ఫౌండేషన్ అధ్యక్షుడు వంశీధర దాసు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ. రెక్స్‌ఏంజెలో, ప్రిన్సిపాల్ ఫాదర్ మెల్చియర్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ ఫాధర్ జోజిరెడ్డి, పాధర్ కె.రవీంద్రనాథ్, అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ జి.సహాయ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

23 కేజీల గంజాయి స్వాధీనం

బెంజ్‌సర్కిల్, జూలై 29(ఆంధ్రజ్యోతి) : పటమట హైస్కూల్ రోడ్డులోని రెల్లిస్‌కాలనీ వద్ద 23 కేజీల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం రెల్లిస్‌కాలనీకి చెందిన యర్రంశెట్టి ఆదిశేషు, బంగారు హేమంత్ నాగదుర్గాబాలు, సనత్ నగర్‌కు చెందిన లక్కిశెట్టి చిరంజీవి రెండు రోజుల క్రితం వైజాగ్ నుంచి 23 కేజీల గంజాయిని ఆటోలో తీసుకొచ్చి రెల్లిస్‌కాలనీలో ఓ ఇంటిలో దాచిపెట్టారు. పోలీసులకు పక్క సమాచారం అందడంతో దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని పటమట పోలీసులకు అప్పగించారు. ఆదిశేషుపై సస్పెక్ట్ షీట్, హేమంత్ నాగదుర్గా బాలుపై రౌడీషీట్ ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వల్లభనేని పవన్ కిషోర్ తెలిపారు.

దుర్గగుడికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం, నిత్య అన్నదాన పథకానికి పలువురు దాతలు మంగళవారం విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటంతో పాటు విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అందజేశారు. విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన గూడపాటి పాపారావు నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,116 అందించారు. విజయవాడ పటమటకు చెందిన తలశిల వెంకట రమణయ్య చౌదరి కుటుంబసభ్యులు ఆలయ స్వర్ణతాపడం పనులకు విరాళంగా రూ.1,00,116లు అధికారులకు అందజేశారు.



పటమటకు చెందిన తలశిల వెంకట రమణయ్య చౌదరి కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

భారతీనగర్, జూలై29(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడగలమని ప్రిన్సిపాల్ ఫాదర్ ఎస్. మిల్కియోర్ అన్నారు. పునీత ఇన్యాసీ పండుగ సందర్భంగా జాతీయ సేవా పథకం, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో లయోలా కళాశాలలో రక్తదాన శిబిరం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ డాక్టర్ వెలగా జోషి, లయోలా ప్రిన్సిపాల్ ఫాదర్ ఎస్.మిల్కియోర్, ఫాదర్ ఆర్.జాన్ పాల్గొని రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫాదర్ ఎస్. మిల్కియోర్ మాట్లాడుతూ రక్తదానం ఎవరైనా చేయవచ్చునని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ప్రమాదంలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడగలమన్నారు. శిబిరంలో 72మంది విద్యార్థులు రక్తదానం చేశారని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ డాక్టర్ వెలగా జోషి మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి ఈ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు కళాశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డాక్టర్ ఎస్.దయాకర్, డాక్టర్ కె. ప్రకాష్, డాక్టర్, కె.శేఖర్, డాక్టర్ జాన్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ ఎన్.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ వలంటరీలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వారధి వద్ద మారని సీన్..!

స్పీడ్ బ్రేకర్లతో ఎన్‌హెచ్‌పై నిలిచిపోతున్న వాహనాలు

బెడిసికొట్టిన అధికారుల వ్యూహం ● మరింత ప్రమాదకరంగా రెండు కిలోమీటర్ల డేంజర్ జోన్



విజయవాడ వైపు మార్గంలో ఆరు స్పీడు బ్రేకర్లలో రెండింటిని తొలగించిన అధికారులు

ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీ: ఒక సమస్య పరిష్కారానికి రోడ్డెక్కిన ప్రణాళిక మరో కొత్త సమస్యను తెచ్చిపెడుతోంది. సమస్య పరిష్కారం కాకపోగా సాఫీగా సాగాల్సిన ట్రాఫిక్ స్తంభించిపోతోంది. విజయవాడ-గుంటూరు-విజయవాడ మార్గంలో కనకదుర్గమ్మ వారధి వద్ద ఉన్న పరిస్థితి ఇది. ఇక్కడ ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్లతో నేతాజీ బ్రిడ్జికి సమీపాన ఉన్న జాతీయ రహదారిపై కొత్త సమస్యను తెచ్చిన విషయం తెలిసిందే. వారధి ఎక్కే వాహనాలు స్వల్పంగా, దిగే వాహనాలు భారీగా నిలిచి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీంతో వాహనదారులు, పౌరులు గగ్గోలు పెట్టడంతో ట్రాఫిక్ అధికారులు బ్రేకర్ల తొలగింపును చేపట్టారు. గుంటూరు వైపు మార్గంలో సాయిబాబా ఆలయానికి ఎదురుగా మూడు స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేస్తే వాటిలో ఒకదాన్ని తొలగించారు. విజయవాడ వైపు వచ్చే మార్గంలో ఆరు స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేస్తే వాటిలో మూడింటిని తొలగించారు. అయినా ఎలాంటి మార్పు రాలేదు. వారధి ఎక్కి గుంటూరు వెళ్లాల్సిన వాహనాలు, వారధి దిగి విజయవాడలోకి రావాల్సిన వాహనాలు వేగాన్ని సున్నాకు తగ్గించుకుంటున్నాయి. దీంతో వెనుక వైపున్న వాహనాలూ అదే స్థాయికి చేరుకుంటున్నారు. ఇలా వాహనాలు ఆగిపోవడంతో విజయవాడ వైపు వచ్చే వాహనాలు వారధి పై ఓవర్ ఎక్కుతున్నాయి. కోల్‌కతా - చెన్నై జాతీయ రహదారి, మచిలీపట్నం - హైదరాబాద్ జాతీయ రహదారులు కలిసే కనకదుర్గ వారధి వద్ద ప్రమాదాల నివారణకు పోలీసులు తాజాగా తీసుకున్న చర్యలు బెడిసికొట్టాయి. జాతీయ రహదారుల నిబంధనలకు విరుద్ధంగా వారధికి ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం సరికొత్త సమస్యకు దారి తీసింది.

డేంజర్ జోన్

ఎంజీ రోడ్డు నుంచి కృష్ణలంకకు చేరుకునే వాహనదారులు పశువుల ఆసుపత్రి జంక్షన్ నుంచి నేతాజీ బ్రిడ్జి మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటారు. నేతాజీ బ్రిడ్జి నుంచి యూ టర్న్ తీసుకునే ప్రాంతం కాస్త దూరంగా, కనకదుర్గ వారధి కూడలి కాస్త దగ్గరగా ఉంటుంది. దీంతో వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా కుడి చేతి వైపు తిరిగి వారధి కూడలి చేరుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారధి సర్కిల్ దిగువ భాగంలో ఎదురుగా ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో ఈ రెండు ప్రాంతాల నుంచి వేగంగా వెళ్లే వాహనాలు ఢీ కొట్టి ప్రమాదాలు జరుగుతున్నాయి. కూడలి వద్ద ఉన్న మసీదు కారణంగా జాతీయ రహదారికి బాటిల్ నెక్ (కుచించుపోయి)లా ఉంటుంది. ఈ ప్రాంతంలోనే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. 2 నెలల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఇద్దరు పాదచారులు. ఈ ప్రమాదాల నివారణకే ట్రాఫిక్ పోలీసులు ఈ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు.



హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న వాహనాలకు అడ్డంగా వెళుతున్న పాదచారులు

పారని అధికారుల తంత్రం

బెంజిసర్కిల్ నుంచి వారధికి వెళ్లే మార్గంలో దిగువన జాతీయ రహదారిపై మూడు స్పీడ్ బ్రేకర్లు, వచ్చేమార్గంలో వారధి దిగువన నేతాజీ బ్రిడ్జి సమీపంలో ఆరు స్పీడ్ బ్రేకర్లను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతాలకు రాగానే వాహనాల వేగం తగ్గిపోతుంది. దీని ప్రభావం జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలపై పడుతోంది. ముందున్న వాహనాల వేగం తగ్గిపోవడంతో ట్రాఫిక్ స్థంబించిపోతుంది. అలాగే వారధి పైకి వాహనాలు చేరుకునే వైపు వేసిన స్పీడ్ బ్రేకర్ల కారణంగా



గుంటూరు వైపు మార్గంలో ఒక స్పీడ్ బ్రేకర్‌ను తొలగించిన అధికారులు

బెంజిసర్కిల్, స్క్యూ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ స్థంభించిపోతోంది. ఈ ట్రాఫిక్ జామ్ ఎంజీ రోడ్డు, బందరు రోడ్డుపైన తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సమస్యను ఆంధ్రజ్యోతి దినపత్రిక ఈ నెల 29న మంగళవారం ప్రముఖంగా ప్రచురించింది. దీనికి స్పందించిన పోలీసులు ఓ వైపున్న ఆరు స్పీడ్ బ్రేకర్లలో మూడింటినీ, మరోవైపున్న మూడు స్పీడ్ బ్రేకర్లలో ఒకటి తొలగించారు. బ్రేకర్లను పూర్తిగా తొలగించకపోవడంతో ట్రాఫిక్ సమస్య యథావిధిగానే ఉంది. మరోవైపు నేతాజీ బ్రిడ్జి నుంచి కృష్ణలంక వెళ్లే వాహన చోదకులు రాంగ్ రూట్‌లోనే ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఇక్కడ బ్రేకర్ల స్థానంలో బ్లింకర్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

అదృశ్యమైన వృద్ధుడు అస్తిపంజరంగా ప్రత్యక్షం

విద్యాధరపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో అదృశ్యమైన వృద్ధుడు మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పోలకంపాడు కట్ట పుష్కరకాల నీలో అస్థిపంజరమై కనిపించాడు. కబేళా ప్రాంతానికి చెందిన ప్రసాద్ (72) ఏప్రిల్‌లో అదృశ్యమైయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం పోలకంపాడు కట్ట పుష్కర కాలనీ సమీపంలోని బీడు భూమిలో అస్థిపంజిరాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆయా అవశేషాలు, అతను ధరించిన చొక్కా తాలుక వస్త్రం, సమీపంలో దొరికిన ఆధార్ కార్డు ద్వారా పోలీసులు బంధువులకు సమాచారం ఇచ్చారు. బంధువులు పరిశీలించి ప్రసాద్‌గా గుర్తించారు. పోలీసులు అవశేషాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

ధర్నాచౌక్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేసి బీసీల రక్షణకు దో హదపడాలని జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ దశాబ్దాలుగా రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి దేవీప్రసాద్ ఈ ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆర్పీఐ నేతలు లోడా అప్పారావు, భాస్కర్, మ హేంద్ర, సత్యనారాయణ, బీసీ చైతన్య సమితి నేతలు పాల్గొన్నారు.

మహిళల కోసం మహాయజ్ఞం

ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల సన్నద్ధం!

ఆంధ్రజ్యోతి, విజయవాడ: మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు 'ఆర్టీసీ' ఒక మహాయజ్ఞంలా బస్సులను సిద్ధం చేస్తోంది. బస్సుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని పక్కన పెట్టినప్పటికీ ఉపయోగించగల సూపర్ లగ్జరీ బస్సులకు సిటీ బస్సుల రూపం ఇస్తూ వాటిని దుర్బేధ్య పరుస్తోంది. విద్యాధరపురంలోని విజయవాడ జోనల్ వర్క్‌షాప్‌లో ఇప్పటి వరకు నాలుగు బస్సులను ఇలా కొత్తగా రూపకల్పన చేసి డిపోలకు పంపించారు. మరో 16 బస్సులను ఇలాగే మార్చేందుకు జోనల్ వర్క్‌షాప్‌లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సూపర్ లగ్జరీ బస్సుల ఛాసిస్‌లు బాగుంటే వాటికి సిటీ బస్సుల బాడీలను అమర్చుతున్నారు. సూపర్ లగ్జరీ బస్సుల ఛాసిస్‌లు బాగా లేక, బాడీలు బాగుంటే వాటిని బాగున్న సిటీ బస్సుల ఛాసిస్‌లపై అమర్చుతున్నారు. రెండూ బాగున్న సూపర్ లగ్జరీ బస్సుల లుక్‌ను మార్చి సిటీ బస్సుల్లా మార్చుతున్నారు. విజయవాడ జోన్ ఈడీ రాజా రత్నం ఆదేశాల మేరకు జోనల్ వర్క్స్ మేనేజర్ షబ్నం పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొత్త బస్సులు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవటం, ఒకవేళ కొనుగోలు చేయాలన్నా ఛాసిస్‌లపై పూర్తిస్థాయిలో బాడీ బిల్డింగ్ చేయటానికి నెలల సమయం పడుతుంది. దీంతో నిరుపయోగంగా ఉన్న బస్సులను దుర్బేధ్యంగా తీర్చిదిద్దే పనులకు శ్రీకారం చుట్టారు. విజయవాడ రీజియన్ పరిధిలో ఈ పథకం అమలుకు 75 బస్సులు అవసరమని ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రతిపాదించారు. వీటిలో సూపర్ లగ్జరీ బస్సులను సిటీ బస్సులుగా మార్చటం వల్ల ప్రస్తుతం 20 వరకు ఆర్టీసీ సమకూర్చుకోగలుగుతోంది.



జోనల్ వర్క్‌షాపులో బస్సులకు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

సిటీ బస్సుల కండీషన్ మెరుగుకు చర్యలు

నగర పరిధిలో తిరిగే సిటీ బస్సులను సైతం దుర్బేధ్యంగా తీర్చిదిద్దేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. మహిళల ఉచిత బస్సు పథకంతో బస్సులపై లోడ్ ఎక్కువగా పడే అవకాశం ఉంది. దీంతో బస్సులు మొరాయించకుండా ఉండటానికి వీలుగా ఉన్న అన్ని బస్సులను ఎక్కడికక్కడ డిపోల్లో దుర్బేధ్య పరుస్తున్నారు. బస్సుల లుక్‌ను కూడా మార్చేస్తున్నారు. కొత్త కిటికీలు, బస్సులకు రంగులు, లోపల లైట్లు, మంచి సీటింగ్ బస్సుల్లోని లోపాలను సరిచేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎక్కడికక్కడ బస్ డిపోల్లో పనులు జరుగుతున్నాయి. పెద్ద పెద్ద మరమ్మతులు, పూర్తిగా బాడీ డ్యామేజ్‌లను సరిచేయాలన్నా, మెకానికల్ అంశాలన్నీ జోనల్ వర్క్‌షాప్‌లోనే జరుగుతున్నాయి. డ్యామేజీ అయినచోట రేకులను తొలగించి కొత్తగా రేకులు వేసి వెల్డింగ్ చేపడుతున్నారు. సిటీ బస్సుల్లో చాలా వరకు రన్నింగ్‌లో ఉండగా ఊగిపోతుంటాయి. వీటిని సరి చేస్తున్నారు. కొన్ని బస్సులకు పెయింటింగ్ చేయాల్సి ఉండటంతో బాడీలను బయటకు తీసి పూర్తిగా టింకరింగ్ చేసి పెయింటింగ్ చేస్తున్నారు. కమాన్ కట్టలు విరిగిపోయి ఉంటే వాటిని వెల్డింగ్ ద్వారా అతికిస్తున్నారు. ఇలా సిటీ బస్సులను అన్ని విభాగాలలోనూ దుర్బేధ్యపరుస్తున్నారు.

పల్లె వెలుగులకు సైతం..

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఉన్న పల్లె వెలుగు బస్సులకు కూడా పెద్ద ఎత్తున మరమ్మతులు చేపడుతున్నారు. రెండు జిల్లాల్లో డిపోల స్థాయిలోనే నూటికి 95 శాతం బస్సులకు మరమ్మతులు జరుగుతున్నాయి. పల్లె వెలుగు బస్సులకు కూడా ఎక్కడికక్కడ పెయింటింగ్స్ వేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకంలో భాగంగా సిటీ, పల్లెవెలుగు బస్సులే కీలకం కాబట్టి పూర్తి సన్నద్ధంగా ఉంచేందుకు ఆర్టీసీ అధికారులు ఒక మహాయజ్ఞంలా పనులు చేయిస్తున్నారు.



స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

● ఏర్పాట్లను పూర్తిచేయండి: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 79వ స్వాతంత్ర్య వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. స్వాతంత్ర్య వేడుకలు - 2025కు చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియాతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో పాటు దాదాపు 5వేల మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొంటారన్నారు. చిన్నారులకు అవసరమైన అల్పాహారం, తాగునీరు అందించేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతర విద్యుత్ జరిగేలా విద్యుత్ శాఖాధికారులు జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వైద్యారోగ్య శాఖ అత్యవసర మందులతో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల ప్రత్యక్ష ప్రసారంతో పాటు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో, అగ్నిమాపక, ఏపీఎస్ ఆర్టీసీ, వైద్యారోగ్యం, పౌరసరఫరాలు, ఉద్యాన తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సాధారణ పరిపాలన శాఖ ప్రొటోకాల్ ప్రకారం కేటాయించిన గ్యాలరీల వారీగా పాస్‌లను జారీ చేయాలన్నారు. రిహార్సల్స్ నాటికి పూర్తిస్థాయి ఏర్పాట్లతో ప్రాంగణాన్ని సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. డీసీపీ కేజీవీ సరిత, డీఆర్వో ఎం లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, పౌరసరఫరాల శాఖ అధికారి ఏ పాపారావు, ఉద్యాన అధికారి పీ బాలాజీ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలూ మార్గదర్శకులుగా రండి..!

● కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అడుగులు వేస్తూ స్వర్ణాంధ్ర సాకారం దిశగా ప్రవేశపెట్టిన పీ4లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు మార్గదర్శులుగా భాగస్వాములై బంగారు కుటుంబాలకు చేయూతనందించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. పారిశ్రామిక విధానాల కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక అనుమతులపై చర్చించారు. గత మే 26 నుంచి జూలై 28 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 1148 దరఖాస్తులు స్వీకరించగా, ఇప్పటికే 1113 దరఖాస్తులు ఆమోదం పొందాయని అధికారులు కలెక్టర్‌కు వివరించగా మిగిలిన దరఖాస్తులను కూడా గడువుకు ముందే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పారిశ్రామిక అభివృద్ధి విధానం (2015-20), పారిశ్రామిక అభివృద్ధి విధానం (2020-23), పారిశ్రామిక అభివృద్ధి విధానం (2023-27) కింద ఎంఎస్ఎంఈ రంగానికి అందించే ప్రోత్సాహకాల్లో భాగంగా 39 క్లెయిమ్‌లకు రూ.3 కోట్ల మేర ప్రతిపాదనలను తాజాగా చర్చించి డీఐఈపీసీ ఆమోదం తెలిపింది. క్లెయిమ్‌లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీపీ) జిల్లాలో వేగవంతం చేయాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మలో భాగంగా శిక్షణ పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన రైసింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్మార్మన్స్ (ర్యాంప్)పై అవగాహన కల్పించేలా జిల్లాస్థాయిలో వర్క్‌షాప్ నిర్వహిస్తామరు.జిల్లా పరిశ్రమల అధికారి జీ సాంబయ్య, ఎల్‌డీఎం కే ప్రియాంక, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పీ శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు, జిల్లా భూగర్భజల అధికారి ఎన్ నాగమల్లేశ్వరరావు, కమిటీ సభ్యులు డీ నిర్మల, ఎం కిశోర్, డాక్టర్ ఎం సుదర్శన్ ఉన్నారు.

అర్థగణాంక శాఖలో సమస్యలు పరిష్కరించండి

● రాష్ట్ర అపెస్సా అధ్యక్షుడు రజనీష్ బాబు

గొల్లపూడి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అర్థగణాంక శాఖలో సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర అపెస్సా అధ్యక్షుడు ఎల్ రజనీష్ బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టాటిస్టికల్ సబార్డినేట్స్ అసోసియేషన్ (అపెస్సా) రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం గొల్లపూడి అర్థగణాంక శాఖ కార్యాలయంలో మంగళవారం జరిగింది. అపెస్సా అధ్యక్షుడు ఎల్ రజనీష్ బాబు అధ్యక్షత వహించగా జనరల్ సెక్రటరీ బీవీ దుర్గాప్రసాద్ సంఘపరంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ ముఖ్య అతిథిగా హాజరైన అర్థ గణాంక శాఖ డైరెక్టర్ బీ గోపాల్‌కు రాష్ట్రంలోని మండలాలు, డివిజన్‌లు, జిల్లాల్లో పని చేస్తున్న సహాయ గణాంకాధికారులు, ఉప గణాంకాధికారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించి ప్రధాన సమస్యలను పరిష్కరించాలన్నారు. శాఖ డైరెక్టర్ బీ గోపాల్ సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామన్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్ కే చెంచురెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఏపీఎస్‌నాయుడు, జాయింట్ సెక్రటరీ బీవీ మాధవి, ట్రెజరర్ సీహెచ్ నాగరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ పార్కింగ్ ఆక్రమణ

లెనిన్ సెంటర్‌లో మళ్లీ ఆక్రమణలు ● చోద్యం చూస్తున్న వీఎంసీ సిబ్బంది ● వేలం వేసి మరీ స్థలాల కేటాయిపు

గవర్నర్‌పేట, ఆంధ్రజ్యోతి: సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చే వివిధ శాఖల అధికారులు, విజిటర్స్ కోసం లెనిన్ సెంటర్‌లోని పార్కు ఉత్తరం వైపు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాన్ని కబ్జాదారులు గుట్టు చప్పుడు కాకుండా మింగేశారు. నూడిల్స్ బళ్ల నిర్వాహకుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేసి ఆ స్థలాన్ని వారికి కేటాయించి చేతులు దులుపుకున్నారు. పార్కుకు ఉత్తరం వైపునున్న స్థలంలో ఎన్నో ఏళ్లుగా నూడిల్స్ బళ్లుండేవి. దీంతో అక్కడి కార్పొరేట్ వస్త్ర దుకాణం యాజమాన్యం అధికారులకు ఫిర్యాదు చేసి అక్కడి నుంచి వాటిని తీయించి వేశారు. కార్పొరేషన్‌కు తాము పార్కింగ్ ఫీజు కడుతున్నామని, ఇక్కడ బళ్లు పెట్టడానికి వీలులేదని వస్త్ర దుకాణం నిర్వాహకులు బారికెట్లు ఏర్పాటు చేశారు. దీంతో నూడిల్స్ బళ్ళు పెట్టుకునే వారికి జీవనోపాధి కరువైంది. ఎన్నో సంవత్సరాలుగా వ్యాపారాల చేసుకుంటున్న తమకు నీడ లేకుండా చేశారని వారు వాపోతున్నారు. 4 అంతస్తుల భవనాల్లో వ్యాపారం చేసే వస్త్ర దుకాణం యాజమాన్యం



సీఆర్‌డీఏకు వచ్చేవారి కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో రాత్రికి రాత్రి వెలసిన నూడిల్స్ బళ్లు

పార్కింగ్ కోసం సొంత స్థలం ఏర్పాటు చేసుకోకుండా పేదలు వ్యాపారాలు చేసుకునే రోడ్డు మార్జిన్‌ను లీజుకు తీసుకున్నామని చెప్పడం పట్ల నూడిల్స్ బళ్ళ హాకర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారాలు చేసుకోవడానికి దారిలేక ఇబ్బందులు పడుతున్న నూడిల్స్ హాకర్ల వీక్‌నెస్‌ను క్యాష్ చేసుకోవడానికి లెనిన్ సెంటర్‌లో పాతుకుపోయి కబ్జాపర్వాలు సాగిస్తున్న కబ్జాదారులు రంగప్రవేశం చేసి చక్రం తిప్పారు. అదే తడవుగా సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చే వాహనదారులకు ఏర్పాటు చేసిన స్థలాన్ని కబ్జాచేశారు. నూడిల్స్ వ్యాపారం చేసుకునే వారితో రాయభారాలు నడిపి వారి నుంచి వేలాది రూపాయాలు వసూలు చేసి కబ్జా చేసిన స్థలంలో రాత్రికి రాత్రి నూడిల్స్ బళ్ళు ఏర్పాటు చేయించారు. దీంతో సీఆర్‌డీఏ కార్యాలయానికి వచ్చే వాహనదారులు తమ వాహనాలు ఎక్కడ పార్కు చేసుకోవాలో తెలియక రోడ్డు మీదనే పార్కు చేసి వెళుతూ ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏపీలో 227 ఎఫ్‌పీవోలకు ఈక్విటీ గ్రాంట్

● కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

వన్‌టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, మార్కెట్ అవకాశాలను విస్తరించేందుకు, మహిళా రైతుల పాత్రను బలోపేతం చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం '10,000 రైతుల ఉత్పత్తిదారుల సంస్థల స్థాపన, ప్రోత్సాహం' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 10,000 రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో)లు నమోదు కాగా, రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ఈక్విటీ గ్రాంట్ మంజూరైంది. ఇందులో ఏపీకి చెందిన 227 ఎఫ్‌పీవోలు లబ్ధి పొందాయని లోక్‌సభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

దేశంలో నమోదైన ఎఫ్‌పీవోల సంఖ్య, ఏపీలో జిల్లాల వారీగా వివరాలు, సంవత్సరాల వారీగా లబ్ధి పొందిన రైతుల సంఖ్య రాష్ట్రాల వారీగా, మహిళల ఆధ్వర్యంలోని ఎఫ్‌పీవోల వివరాలు, ప్రభుత్వం చేసిన మ్యాపింగ్ ప్రకారం ఏపీలో ప్రధాన పంటలు, వస్తువులు వివరాలు, ఈక్విటీ గ్రాంట్స్ మంజూరు వివరాలు, క్లస్టర్ బేస్డ్ బిజినెస్ ఆర్గనైజేషన్ ద్వారా ఎఫ్‌పీవోలకు అందిస్తున్న శిక్షణ వివరాలపై ఎంపీ కేశినేని చిన్ని, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కేంద్ర వ్యవసాయం, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖను ప్రశ్నించారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వివరణ ఇస్తూ ఏపీకి 714 ఎఫ్‌పీవోలు ఏర్పాటయ్యాయని, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 36.71 లక్షల మంది రైతులు లబ్ధి పొందారన్నారు. దేశవ్యాప్తంగా 1,663 ఎఫ్‌పీవోలు పూర్తిగా మహిళల ఆధ్వర్యంలో ఉన్నాయని, వీటితో పాటుగా 949 ఎఫ్‌పీవోల్లో 50శాతం కంటే ఎక్కువ మహిళా సభ్యులున్నారన్నారు.

ఏపీలో మాత్రమే 228 ఎఫ్‌పీవోలు పూర్తిగా మహిళల ఆధ్వర్యంలో ఉండగా, 45 ఎఫ్‌పీవోల్లో సగానికి పైగా మహిళా రైతులు సభ్యులుగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో బియ్యం, పప్పులు, పసుపు, టమాటా, మామిడి, మిరపకాయ, కొబ్బరి, జీడిపప్పు వంటి పంటలతో పాటు పశుసంవర్ధక, మత్స్యరంగాల అభివృద్ధికి కూడా ఈ పథకం వర్తించిందని మంత్రి తెలిపారు.

కౌలు రైతుల ఖాతాల్లో డబ్బులు

- రాజధాని రైతులకు శఠగోపం కథనాన్ని తప్పుబట్టిన సీఆర్డీఏ కమిషనర్
- ఇప్పటివరకు రూ. 164.21 కోట్ల నగదు జమ
- ఇంకా రూ.61.34 కోట్లు మాత్రమే చెల్లించాలి
- సాంకేతిక కారణాలతోనే జాప్యం
- సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

విజయవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతులకు 2024-25 ఏడాదికి సంబంధించి చెల్లించాల్సిన వార్షిక కౌలు డబ్బులను వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసినట్టు సీఆర్డీఏ కమిషనర్ కే కన్నబాబు తెలిపారు. మంగళవారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలుపుతూ, 'రాజధాని రైతులకు శఠగోపం' అనే శీర్షికతో ఓ పత్రికలో వచ్చిన కథనం అవాస్తమన్నారు. వాస్తవానికి రైతులకు మొత్తం రూ.225.55 కోట్లను కౌలు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.164.21 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమచేసినట్టు తెలిపారు. ఇంకా రూ.61.34 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. అయితే రైతుల బ్యాంక్ ఖాతాల లింకేజీ ప్రక్రియలో వచ్చిన సాంకేతిక కారణాలు, కొంతమంది రైతులు తమ ప్లాట్లను అమ్మడం, అలాగే మరణించిన రైతుల కుటుంబసభ్యుల వివరాలు అందకపోవడంతో నిధులు జమకాలేదని సంబంధిత కమిషనర్ తెలిపారు. గత శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో అందజేసిన ఫిర్యాదులను పరిష్కరించి కౌలు రైతులకు నగదును త్వరలో జమచేయడం జరుగుతుందన్నారు. అయితే అర్హత ఉన్న రైతులకు సైతం కౌలు జమకాలేదని మాజీ సీఎం జగన్‌కు సంబంధించిన ఓ వార్తాపత్రిక తప్పుడు కథనాన్ని ప్రచురించిందని, ఆ వార్త పూర్తిగా అవాస్తవమని అధికారులు లెక్కలతో సహా వివరించారు.

కొడాలి నానిపై తదుపరి చర్యలు నిలుపుదల

పోలీసులపై అనుచిత వ్యాఖ్యల కేసులో హైకోర్టు ఉత్తర్వులు

విచారణ నెల రోజులకు వాయిదా

అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో మచిలీపట్నం స్టేషన్‌లో నమోదైన కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నానిపై తదుపరి చర్యలన్నింటినీ హైకోర్టు నిలుపుదల చేసింది. విచారణను నెల రోజులకు వాయిదా వేసింది. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ కొడాలి నాని వేసిన పిటిషన్ హైకోర్టులో మంగళవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది పి.శశిధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీలోత్పల్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ వ్యాఖ్యలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, వాటిని ఆంగ్లంలోకి తర్జుమా చేసి కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తిస్తాయన్నారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయమూర్తి, తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
9
కుటుంబ కదంబం
బుధవారం 30 జూలై 2025

సేవా స్ఫూర్తి... స్పృహార్తి

వైద్యురాలిగా స్థిరపడాలని కన్న కలలు ఆమెను కాస్మోటాలజీ వైపు నడిపించాయి. ఎందరికో ఉచితంగా శిక్షణ ఇచ్చినా ఏదో వెలితి... అదే తనను సామాజిక సేవ వైపు నడిపించిందంటారు **వీరంకి భారతీదేవి**. 'స్పృహార్తి చారిటబుల్ ట్రస్ట్' ద్వారా చేపడుతున్న కార్యక్రమాల గురించి 'నవ్య'తో ప్రత్యేకంగా మాట్లాడారు.



"నా పుట్టినిల్లు హైదరాబాద్. మెట్టినిల్లు విజయవాడ. నాన్న ఈడే విష్ణువర్ధనరావు సొంత ఊరు గుడివాడ. ఆయన ఎల్ఐసీలో బ్రాంచ్ మేనేజర్‌గా ఉద్యోగం చేసేవారు. ఉద్యోగ రీత్యా మా కుటుంబం సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లిలో స్థిరపడింది. అమ్మ కోకిలాదేవి పరోపకారిణి బాలిక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. వారి నలుగురు పిల్లల్లో నేను మూడో సంతానం. నా పాఠశాల విద్యంతా సికింద్రాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్‌లో పూర్తయింది. కస్తూర్బా గాంధీ కాలేజీలో ఇంటర్ చదివాను. కీస్ డిగ్రీ కాలేజీలో బీఏ సైకాలజీ పూర్తి చేశాను. డిగ్రీ మూడో సంవత్సరం చదువుతుండగా వివాహమైంది. నా భర్త వీరంకి రాజశేఖరరావు... పటమటలో ఒక ప్రైవేటు విద్యా సంస్థను నడుపుతున్నారు.

శ్రీమంతంతో శ్రీకారం

వైద్యురాలిగా స్థిరపడాలనేది నా కల. అయితే ఇంటర్మీడియట్‌లో అనారోగ్యం కారణంగా అది సాధ్యం కాలేదు. నాకు పాఠశాల నుంచే బ్యూటీషియన్ కోర్సు నేర్చుకోవాలని ఉండేది. నా ఆసక్తిని గమనించిన అమ్మ సంబంధిత కోర్సులకు పంపేది. పెళ్లయిన తర్వాత బెంగళూరులో కాస్మోటాలజీలో డిప్లమో చేశాను. ఆ తరువాత ఎందరికో శిక్షణ అందించాను. కానీ ఏదో వెలితిగా అనిపించేది. సమాజానికి ఏదైనా చేయాలనే తపన పెరిగింది. కాగా... విజయవాడలో టెర్రస్ గార్డెన్ ప్రియుల గ్రూప్ ఒకటుంది. అందులో నేనొక సభ్యురాల్ని. ఈ గ్రూపులోనే తిరుమలశెట్టి మాధురి అనే ఐటీ ప్రొఫెషనల్ పరిచయమ్యారు. మేమిద్దరం స్నేహంగా ఉండేవాళ్లం. ఒక రోజు మాకు పరిచయం ఉన్న వారు వచ్చి "విజయవాడలోని ఒక పేద గర్భిణికి సీమంతం చేయించుకోవాలని కోరిక. కానీ ఆ ఆమె తల్లిదండ్రులకు ఆ స్తోమత లేదు. మీరు సాయపడతారా?" అని అడిగారు. నేను, మాధురి.. మాకు పరిచయం ఉన్న మరికొందరి సాయంతో ఆ గర్భిణికి శ్రీమంతం చేశాం. ఆ క్షణం ఆమె కళ్లలో ఆనందబాష్పాలు మా అందరినీ కదిలించాయి. ఆమె తల్లిదండ్రులు తర్వాత మాకు ఫోన్ చేసి చాలా భావోద్వేగానికి లోనయ్యారు. ఇది జరిగిన కొన్ని రోజులకు సామాజిక సేవలోకి దిగితే బాగుంటుందని మా అందరికీ అనిపించింది. ముందుగా



ఐదుగురితో ఒక గ్రూప్ ఏర్పాటు చేశాం.

గుప్పెడు బియ్యం...

మా సేవా కార్యక్రమాలను మా ఇళ్ల నుంచే మొదలుపెట్టాలని భావించాం. దీనికి 'గుప్పెడు బియ్యం' అని నామకరణం చేశాం. మాకు పరిచయం ఉన్న స్కూళ్లకు మా పిల్లలు చదువుతున్న స్కూళ్లకు వెళ్లి యాజమాన్యాలను సంప్రతించాం. ఆ స్కూళ్లలో ఒక ప్లాస్టిక్ డబ్బాను ఏర్పాటు చేశాం. విద్యార్థులు ప్రతినెలా ఇంటి నుంచి గుప్పెడు బియ్యం తీసుకొచ్చి ఆ డబ్బాలో వేయాలని చెప్పాం. డబ్బా నిండగానే మేము ఆ బియ్యాన్ని తీసుకునేవాళ్లం. వాటితో టమాటా రైస్, పులిహోర, బిసిబెలా బాత్, కిచిడీ, సాంబార్ అన్నం తయారు చేయించేవాళ్లం. దాన్ని విద్యార్థులతోనే పేదలకు పంపిణీ చేయించేవాళ్లం. ఇది కొనసాగుతూ ఉండగా... మా సేవా కార్యక్రమాలకు ఒక వేదిక ఉండాలని సంకల్పించాం. ఆ సంకల్పం నుంచే 'స్పృహార్తి చారిటబుల్ ట్రస్ట్' ఆవిర్భవించింది. స్పృహతో చేసే సేవ పరిపూర్ణంగా ఉండాలని ఆలోచించి ఈ పేరు పెట్టాం. ఇప్పుడు మా ట్రస్ట్‌లో మొత్తం 50 మంది వరకు సభ్యులు ఉన్నారు. ఇప్పటికీ 'గుప్పెడు బియ్యం' ప్రాజెక్టును కొనసాగిస్తున్నాం. మేము ఎవరి నుంచీ విరాళాలు సేకరించడం లేదు. ఏదైనా కార్యక్రమం చేయాలనుకున్నప్పుడు మా సభ్యులంతా కలిసి చర్చించుకుంటాం. దానికి అయ్యే ఖర్చును మేమే భరిస్తాం. ప్రతి ఏడాది ఆగస్టు 15వ తేదీన ప్రభుత్వాసుపత్రిలో జన్మించిన... పేద కుటుంబాల శిశువులకు బేబీ కిట్లు అందజేస్తున్నాం. ఆ కిట్‌లో ఒక నెలకు సరిపడా సరుకులు ఉంటాయి.

'ఆత్మీయం'గా...

మేము 'ఆత్మీయులు' పేరుతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నాం. ట్రస్ట్‌లోని సభ్యులు ఎప్పుడు ఏ కార్యక్రమం చేయాలో పోస్టు చేస్తారు. దానిపై చర్చించుకుని ముందుకు సాగుతాం. బడికి, ఇంటికి, ట్యూషన్‌కు మధ్య దూరం కారణంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాల్లోని ఆడపిల్లలకు ఉచితంగా సైకిళ్లు అందజేశాం. దీని కోసం 'సంప్రదాయ వస్త్రధారణ' పేరుతో కళాశాల విద్యార్థులకు ఫ్యాషన్ షో నిర్వహించి, దానికి టికెట్ నిర్ణయించాం. వచ్చిన డబ్బుతో సైకిళ్లు కొనుగోలు చేసి పంపిణీ చేశాం. మూగ, చెవుడు, అంధత్వం ఉన్న వారిని ఆదుకోవడానికి దివ్యాంగులతో సంగీత విభావరి ఏర్పాటు చేశాం. తద్వారా పోగయిన మొత్తంతో వారికి అవసరమైన పరికరాలు తయారు చేయించి ఇచ్చాం. గత ఏడాది సెప్టెంబరులో విజయవాడను వరదలు ముంచేసినప్పుడు... జక్కంపూడిలోని వైఎస్సార్ కాలనీని మా ట్రస్ట్ దత్తత తీసుకుంది. అక్కడ ఉన్న నిర్వాసితులకు అల్పాహారాన్ని, భోజన వసతిని 'స్పృహార్తి' కల్పించింది.

● గుడాల శ్రీనివాస
ఫొటోలు: పి.రాజేష్

అభిరుచితో అధిగమించా..

మతిస్థిమితం లేని పిల్లగా ముద్ర పడిన ఒక అమ్మాయి, చిత్రకళతో మానసిక ఆరోగ్యం మీద పైచేయి సాధించింది. అంతటితో ఆగిపోకుండా, 'ది రెడ్ డోర్' అనే ఆన్‌లైన్ వేదిక ద్వారా తన లాంటి మానసిక రోగులకు బాసటగా నిలుస్తోంది. ఆమే పూణేకు చెందిన 22 ఏళ్ల **రేష్మా వల్లియప్పన్**. స్కిజోఫ్రేనియా(ఎవరో ఉన్నట్టు, మాట్లాడుతున్నట్టు ఊహించుకునే మానసిక రుగ్మత)ను అధిగమించి కళారంగం వైపు సాగిన రేష్మా ప్రయాణం ఆమె మాటల్లోనే...



"మా నాన్నది తమిళనాడు. అమ్మది మహారాష్ట్ర. ఇంట్లో నిరంతరం గొడవలు జరుగుతుండేవి. అమ్మతో నాకు ఏదో ఒక విషయంలో వాదులాట జరిగేది. దాంతో ప్రశాంతత లేకుండా పోయేది. మరోపక్క ఏదో భయం నన్ను వెంటాడుతుండేది. ఎవరో పక్కన ఉన్నట్లు, మాట్లాడుతున్నట్లు అనిపించేది. దాంతో నరకం అనుభవించా. వీటికితోడు పాఠశాలలో సీనియర్ అబ్బాయిల నుంచి లైంగిక వేధింపులు. వీటన్నిటినీ తప్పించుకోవాలని 14 ఏళ్ల వయసులోనే ఇంట్లో నుంచి పారిపోయా. అమ్మాయి అని తెలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని అబ్బాయిలా జుట్టు కత్తిరించుకుని, టీ షర్ట్, ప్యాంట్ వేసుకున్నా. అన్ని జాగ్రత్తలు తీసుకున్నా అత్యాచారానికి బలయ్యాను. ఎవరికి చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థంకాక చాలా రోజులు నాలో నేనే కుమిలిపోయా. తిరిగి ఇంటికి వచ్చాక కూడా మానసికంగా కుంగిపోయా.

జబ్బు బయటపడిందిలా...

వయసు పెరుగుతోంది. కానీ గత అనుభవాల నేపథ్యంలో భయం నన్ను వెంటాడుతూనే ఉంది. నాలో నేనే మాట్లాడుతుండడం చూసి స్నేహితులు నవ్వుకునేవారు. వెక్కిరించేవారు. ఈ అవమానాలు, అవహేళనలు తట్టుకోలేక ఆత్మహత్యకు ప్రయత్నించా. కానీ బతికి బయటపడ్డా. ఆత్మహత్యా ప్రయత్నం చేసి ఆస్పత్రిలో ఉన్నప్పుడే నాకు స్కిజోఫ్రేనియా అనే మానసిక వ్యాధి ఉందని వైద్యులు గుర్తించారు. దీని నుంచి బయటపడేందుకు చాలా మందులు వాడాను. ఆ మందుల వలన రోజుకు దాదాపు 20 గంటలు నిద్రపోయేదాన్ని. ఎన్నో ప్రతికూల ప్రభావాలు కూడా ఎదుర్కొన్నా. చివరికి మందులన్నీ మానేయాలని నిర్ణయించుకున్నా. అప్పుడు మా నాన్న తోడుగా నిలిచారు. నాలో నాకు వినిపించే మాటలే నన్ను బొమ్మలు వేయమని ప్రోత్సహించాయి. దాంతో మందులను పక్కన పెట్టి నాకిష్టమైన చిత్రకళ మీద దృష్టి సారించి, నా ఆలోచనలకు బొమ్మల రూపం ఇవ్వడం ప్రారంభించా. ఆ బొమ్మలను గమనించిన మా నాన్న బొమ్మలు వేయడానికి అవసరమైన వస్తువులను కొనుక్కొచ్చి ఇచ్చారు. కాలం గడిచే కొద్దీ చిత్రకళతో నాలో మార్పు వచ్చింది. స్కిజోఫ్రేనియా నుంచి బయటపడ్డా. నేను గీసిన చిత్రాలను పూణే, ఢిల్లీ, నేపాల్‌లలో జరిగిన పలు ఎగ్జిబిషన్లలో ప్రదర్శించా.

అవగాహన కల్పించేందుకు..

అసలు చాలామందికి స్కిజోఫ్రేనియా గురించి తెలియదు. ఈ సమస్య ఉన్నవారిని పిచ్చివాళ్లని చూసినట్లు చూస్తారు. అందుకే నాలా మానసిక సమస్యలతో బాధపడేవారికి అండగా నిలవాలని మానసిక రుగ్మతలపై అవగాహన కల్పించేందుకు 'ది రెడ్ డోర్' అనే వేదికను నెలకొల్పా. ఇందులో వర్క్‌షాప్‌లు, నిపుణుల ద్వారా మానసిక సమస్యలపై అవగాహన కల్పిస్తా. అంతే కాకుండా నా చిత్రకళలను బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించి, అక్కడి వారితో నా అనుభవాలు పంచుకుంటా. ఇలా ప్రజల్లో మానసిక రుగ్మతలపై అవగాహన కల్పిస్తున్నా. ప్రజలు మా వద్దకు వచ్చి రుగ్మతల గురించి తెలుసుకోవాలని వేచి ఉండకుండా, మేం వారి వద్దకు వెళ్లి వివరిస్తాం. అలాగే మానసిక సమస్యలున్న వారు, వాటిని అధిగమించిన వారు తమ అనుభవాలను పంచుకునేందుకు 'మైండ్ ఆర్ట్స్' అనే ఆన్‌లైన్ వేదిక ఏర్పాటు చేశా. 'మైటీస్ ఆఫ్ లైఫ్', 'ట్విన్ బుద్ధా'.. వంటి నా ప్రసిద్ధ చిత్రకళలు నేను ఎదుర్కొన్న గాయాలను, పరిస్థితులను ప్రతిబింబిస్తాయి. ఇక స్కిజోఫ్రేనియా నేపథ్యంలో చిత్రీకరించిన 'ఏ డ్రాప్ ఆఫ్ సన్‌షైన్' అనే డాక్యుమెంటరీలో నటించా. ఈ డాక్యుమెంటరీకి బెస్ట్ ఎడ్యుకేషనల్ ఫిల్మ్ విభాగంలో జాతీయ అవార్డు కూడా దక్కింది."



అభిరుచితో సాధ్యమే!

"అభిరుచులు మానసిక సమస్యలను దూరం చేయడంలో ఎంతో ఉపయోగపడతాయి. ఇష్టమైన పని చేస్తే మనసుకు హాయిగా అనిపిస్తుంది. ఈ ప్రశాంతత మరే చికిత్స తీసుకున్నా లభించదు. నాకు ఇష్టమైన చిత్రకళ నాకు ఓ థెరపీలా పని చేసింది. అయితే అందరికీ బొమ్మలు గీయడం ఇష్టం ఉండకపోవచ్చు. ఎవరికి నచ్చిన పని వారు చేసి ఇలాంటి సమస్యలను దూరం చేసుకోవచ్చు. కానీ అసలు అన్నింటి కన్నా పెద్ద సమస్య ఏంటంటే చాలా మంది తమకు మానసిక సమస్య ఉందని ఒప్పుకోవడానికి గానీ, ఎవరికీ చెప్పడానికి గానీ ఇష్టపడరు. తెలిస్తే అందరూ ఏమనుకుంటారో, ఏమంటారో అనే భయం. కానీ నిజానికి సమస్యలను పంచుకున్నప్పుడే అందరిలో మానసిక సమస్యల గురించి ఉన్న అపోహలు, భయాలు దూరమవుతాయి. సరైన చికిత్స అందుతుంది."

చదరంగంలో
దివ్య శకం

దివ్యా దేశ్‌ముఖ్... ఇప్పుడు దేశమంతా మారుమోగుతున్న పేరు. 'మహిళల చెస్ వరల్డ్ కప్' గెలిచి, 'గ్రాండ్‌మాస్టర్' హోదా సాధించిన 19 ఏళ్ల దివ్యకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి. 'ఆలోచించాల్సింది ప్రత్యర్థి ఎవరనేది కాదు, ఆటలో ఎలా గెలవాలనే దాని గురించే' అంటుంది దివ్య.



- "క్రీడాకారిణిగా ఎప్పటికప్పుడు నా లక్ష్యాలు మారుతూ ఉంటాయి. కానీ ఆటలో నేను పొందే ఆనందం మాత్రం శాశ్వతం. దాన్ని ఎల్లప్పుడూ ఆస్వాదిస్తాను"
- ఇష్టమైన ఆటలు(చెస్ కాకుండా) - ఫుట్‌బాల్, సైక్లింగ్, ట్రెక్కింగ్

దివ్య తండ్రి జితేంద్ర వైద్య కళాశాలలో ప్రొఫెసర్. తల్లి నమ్రత కూడా డాక్టరే! దివ్యను, ఆమె అక్కను బ్యాడ్మింటన్ ఆటగాళ్లను చేయాలని తల్లితండ్రులు ప్రయత్నించారు. కానీ దివ్య చిన్నప్పుడు బలహీనంగా ఉండేది. బ్యాడ్మింటన్ ఆడే శక్తి ఉండేది కాదు. దీనితో దివ్య బ్యాడ్మింటన్‌కు గుడ్‌బై చెప్పేసింది. ఇంట్లో కూర్చుని ఆడే గేమ్ కాబట్టి చదరంగం వైపు ఆమె దృష్టి మళ్లింది. దివ్యకు చదరంగంలో తొలి కోచ్ ఆమె తండ్రే! కాలేజీ నుంచి వచ్చిన తర్వాత దివ్యతో ప్రతి రోజూ గేమ్ ఆడేవారు. దివ్య వేస్తున్న ఎత్తులకు చిత్తయిన జితేంద్ర ఆమెను సుప్రసిద్ధ కోచ్ రాహుల్ జోషి దగ్గర చేర్చారు. ఆ తర్వాత దివ్య ఎప్పుడూ వెనక్కి తిరిగి చూడలేదు.

ఇంతింతై...

'ఇంతింతై... వటుడింతై' అన్నట్లు చిన్నప్పుడే అసాధారణ ప్రజ్ఞ కనబరచిన దివ్య- చెస్ సర్క్యూట్స్‌లో ఎదగటం మొదలుపెట్టింది. 2023 నాటికి 'ఇంటర్నేషన్ మాస్టర్ హోదా' సాధించింది. ఆ ఏడాది జరిగిన ఆసియా ఉమెన్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కోనేరు హంపీని ఓడించి సంచలనం సృష్టించి ఛాంపియన్‌గా నిలిచింది. 2024లో వరల్డ్ జూనియర్ గర్ల్స్ ఛాంపియన్ టైటిల్‌ను కూడా గెలుచుకుంది.

అభిప్రాయాలు స్పష్టంగా...

చెస్ ఆడటానికి వేసే ఎత్తుల పట్ల స్పష్టత ఉండాలి. దివ్య తన మనసులోని అభిప్రాయాలను ఎప్పుడూ దాచుకోలేదు. గత ఏడాది జనవరిలో నెదర్లాండ్స్‌లో జరిగిన టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో తనకు ఎదురయిన అనుభవాలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ఆ సమయంలో ఆ పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనంగా మారింది. "చాలా మందికి నా ఆట కన్నా.. నేను వేసుకున్న దుస్తులు.. మాట్లాడేటప్పుడు నా యాస.. నా జుట్టు వంటి అనవసర విషయాలపైనే ఆసక్తి ఎక్కువ. కొందరు అనుచిత వ్యాఖ్యలు కూడా చేస్తున్నారు. క్రీడాకారిణుల మీద అభిప్రాయాలు ఏర్పరుచుకోవటానికి ఆట ప్రాతిపదిక కావాలి. నా వేషభాషలు కాకూడదు" అని ఆమె పెట్టిన పోస్ట్‌తో... క్రీడా లోకంలో ఒక చర్చ ప్రారంభమయింది. కొందరు ఆమెకు మద్దతుగా నిలిచారు. మరికొందరు విమర్శించారు. కానీ దివ్య వాటిని పట్టించుకోలేదు.

ఇవి పాటించండి..!



రోజూ వంట చేసేటప్పుడు కొన్ని పొరబాట్ల వల్ల సమయం, గ్యాస్ వృథా అవుతూ ఉంటాయి. అలాకాకుండా వంటచేసేటప్పుడు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

- కూరగాయలు, ఆకుకూరలు ఉడికించేటప్పుడు పాత్రల మీద మూతలు పెట్టాలి. చిన్న లేదా మధ్య స్థాయి మంట ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల వాటిలోని పోషకాలు నశించిపోకుండా ఉంటాయి. చాలా వరకు గ్యాస్ ఆదా అవుతుంది.
- తాలింపు కోసం కరివేపాకు, ఉల్లిపాయలు, వెల్లుల్లి రెబ్బలు తదితరాలతోపాటు అవసరమైన వాటిని సిద్ధం చేసుకున్న తరవాతనే స్టవ్‌ను వెలిగించడం మంచిది. అలాగే కూరగాయలను కూడా ముందుగానే తరిగి పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల గ్యాస్ వృథా కాకుండా ఉంటుంది.
- వండిన ఆహారాన్ని పదేపదే వేడిచేయకూడదు. దీనివల్ల గ్యాస్ వృథాకావడంతోపాటు అనారోగ్య సమస్యలు రావచ్చు.

హుందాతనాన్ని పెంచే ఎ-లైన్ డ్రెస్‌లు











ఫ్యాషన్‌తోపాటు సౌకర్యవంతంగా ఉండే దుస్తులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు నేటి మహిళలు. ఈ కోవలోనే 'ఎ- లైన్' డ్రెస్‌లు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. పేరుకు తగ్గట్టు ఇవి A ఆకారంలో కనిపిస్తుంటాయి. మినీలు, మిడ్డీలు, స్కర్టులు, మ్యాక్సీలు, లాంగ్ గౌన్లు అందుబాటులో ఉన్నాయి. కాలేజీలకు వెళ్లే యువతులతోపాటు కార్యాలయాలకు వెళ్లే మధ్య వయసు మహిళలు కూడా వీటిని ధరించడానికి ఇష్టపడుతున్నారు.

డ్రెస్ ఎలా ఉంటుందంటే...

ఎ- లైన్ డ్రెస్‌ను పై భాగంలో సన్నగా కింది భాగంలో వెడల్పుగా త్రిభుజాకారంలో ఉండేలా డిజైన్ చేస్తారు. మెడ, భుజాలు, నడుము భాగాలకు చక్కగా అమరేలా డ్రెస్ ఉంటుంది. నడుము నుంచి కాస్త వెడల్పుగా చూడడానికి చక్కని గౌన్‌లా కనిపిస్తుంది. శరీరాన్ని పట్టి ఉంచకుండా కాస్త వదులుగా హాయిగా అనిపించేలా ఉంటుంది. ఇష్టానుసారం డ్రెస్ పొడవును పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. ఈ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యేలా లెగ్గింగ్స్ లేదా ఏ రకమైన ప్యాంట్ అయినా వేసుకోవచ్చు.

అందంగా ఇలా...

ఎ- లైన్ డ్రెస్‌లు ఎలాంటి శరీరాకృతి ఉన్నవారికైనా చక్కగా నప్పుతాయి. బొద్దుగా, సన్నగా, పొడవుగా, పొట్టిగా ఎలా ఉన్నవారైనా ఈ డ్రెస్‌ను ఎంపిక చేసుకోవచ్చు. మేని ఛాయను బట్టి రంగులు, డిజైన్లు ఎంచుకుంటే సొగసుగా కనిపిస్తారు. డెనిమ్, కాటన్, పాలిస్టర్, షిఫాన్, సిల్క్, నైలాన్, లెనిన్.. ఇలా అన్ని రకాల ఫ్యాబ్రిక్‌లతో ఎ- లైన్ డ్రెస్‌లను రూపొందిస్తున్నారు. స్లీవ్‌లెస్, పొడవు చేతులు, పొట్టి చేతులు, నడుముభాగంలో బెల్ట్ ఉండే రకాలు అందుబాటులో ఉన్నాయి. వి, యు, కాలర్ నెక్‌లు డ్రెస్ అందాన్ని పెంచుతాయి. ఫ్లోరల్ ప్రింట్‌లు, సాదా రంగులో ఉండే గౌన్, స్కర్ట్ టైప్ డ్రెస్‌లను యువతులు రోజువారీ వేసుకోవడానికి మొగ్గుచూపుతున్నారు. పెద్ద బోర్డర్ డిజైన్లు, అదనపు హంగులతో కూడిన లాంగ్ గౌన్లను ఫంక్షన్లలో ధరిస్తున్నారు. ఎ-లైన్ డ్రెస్‌ల మీద పెద్దగా ఆభరణాలు పెట్టుకోనవసరం లేదు. చేతులకు చక్కని వాచ్, అందమైన బ్యాంగిల్ లేదా బ్రాస్‌లెట్, చెవులకు జుమ్కీలు పెట్టుకుని పాదాలకు ఆకర్షణీయమైన శాండల్స్ వేసుకుంటే హుందాగా కనిపిస్తారు. మంచి హెయిర్ స్టయిల్, లైట్ మేకప్‌తో అందంగా మెరిసిపోవచ్చు.



నాలుగేళ్లలో రుణవితరణ రెట్టింపు: కోలియర్స్

రియల్టీతో బ్యాంకుల 'రుణా'నుబంధం

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగానికి బ్యాంకుల రుణ వితరణ గత నాలుగేళ్లలో రెట్టింపై 2025 మార్చి నాటికి రూ.35.4 లక్షల కోట్లకు చేరింది. రియల్టీ కన్సల్టెంట్ కోలియెర్స్ తాజా నివేదికలో ఈ విషయం తెలిపింది. రియల్టీ రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న టాప్ 50 లిస్టెడ్ కంపెనీల లాభదాయకత, అవి ప్రదర్శిస్తున్న వేగం, మార్కెట్లో వాటి స్థాయి వంటివి మదింపు చేసి ఈ నివేదిక రూపొందించినట్లు కోలియెర్స్ తెలిపింది. 2021 ఆర్థిక సంవత్సరంలో రియల్టీ రంగానికి స్థూల బ్యాంకు రుణాలు రూ.17.8 లక్షల కోట్లుండగా ఈ ఏడాది మార్చి నాటికి రూ.35.4 లక్షల కోట్లకు చేరినట్టు తెలియచేసింది. తీవ్ర ఆటుపోట్ల మధ్యన కూడా ఈ రంగం ఆర్థిక స్వస్థత ఎంతగానో మెరుగుపడిందని, ఆర్థిక రంగంలోని ఇతర విభాగాల కన్నా మెరుగైన పనితీరు ప్రదర్శిస్తోందని పేర్కొంది. బ్యాంకులు అందిస్తున్న మొత్తం రుణాల్లో సుమారు ఐదింట ఒక శాతం రియల్టీ రంగానికే అందుతున్నట్టు తెలిపింది. ఇతర రంగాల్లోని కంపెనీలతో పోల్చితే పరపతి రేటింగ్ పెంచుకున్న కంపెనీల్లో రియల్టీ రంగానికి చెందినవే అధికంగా ఉన్నట్టు కోలియెర్స్ సీఈఓ బాదల్ యాజ్ఞిక్ అన్నారు. 2025 ఆర్థిక సంవత్సరంలో టాప్ 50 కంపెనీల్లో 62% కంపెనీల లాభదాయకత పెరిగిందని, 60 శాతం పైగా కంపెనీల రుణభార స్థాయిలు కూడా సౌకర్యవంతంగా ఉన్నాయని ఆయన చెప్పారు.

ఇండస్ట్రియల్, వేర్‌హౌసింగ్ జోరు

ఈ ఏడాది జూన్‌తో ముగిసిన ఆరు నెలల కాలంలో దేశంలో ఇండస్ట్రియల్, వేర్‌హౌసింగ్ విభాగాల లీజింగ్ 63% వృద్ధితో 2.71 కోట్ల చదరపు అడుగులకు పెరిగినట్టు సీబీఆర్ఈ తెలిపింది. ప్రధానంగా 25 శాతం వాటాతో ఇ-కామర్స్ కంపెనీలు డిమాండులో వృద్ధికి దోహదపడినట్టు తెలియచేసింది. ద్వితీయ శ్రేణి నగరాల్లో డిమాండ్ మరింతగా పెరిగినట్టు కంపెనీ సీఈఓ, చైర్మన్ అన్షుమన్ మాగజైన్ అన్నారు. నగరాలవారీగా చూసినట్టయితే 73 లక్షల చదరపు అడుగులతో ఢిల్లీ-ఎన్‌సీఆర్ అగ్రస్థానంలో నిలిచింది. 36 లక్షల చదరపు అడుగులతో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది.

వృద్ధిపై ఆశావహ దృక్పథం

రాబోయే ఆరు నెలల కాలానికి దేశీయ ప్రాపర్టీ మార్కెట్ వృద్ధిపై రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఆర్థిక సంస్థలు ఆశావహ దృక్పథంతో ఉన్నట్టు నరెడ్కో, నైట్‌ఫ్రాంక్ అధ్యయనంలో తేలింది. మంగళవారం ఈ సంస్థలు 45వ ఎడిషన్ రియల్ ఎస్టేట్ సెంటిమెంట్ ఇండెక్స్‌ను విడుదల చేశాయి. నాలుగు త్రైమాసికాల పతన క్రమానికి స్వస్తి చెప్పిన ఈ సూచీ జనవరి-మార్చి త్రైమాసికంతో పోల్చితే ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 54 పాయింట్ల నుంచి 56 పాయింట్లకు పెరిగింది. రియల్టీ రంగంలో పెరిగిన ఆశావహ వైఖరికి ఇది దర్పణమని నరెడ్కో ప్రెసిడెంట్ హరిబాబు అన్నారు.

పీ & జీ పగ్గాలు భారతీయుడి చేతికి..



కొత్త సీఈఓగా శైలేష్ జెజురికర్
2026 జనవరి 1 నుంచి బాధ్యతలు

న్యూఢిల్లీ: మరో ప్రముఖ బహుళజాతి కంపెనీకి భారతీయుడు సారథ్యం వహించనున్నారు. అమెరికన్ ఎఫ్ఎంసీజీ దిగ్గజం ప్రాక్టర్ అండ్ గాంబుల్ (పీ అండ్ జీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శైలేష్ జెజురికర్ నియమితులయ్యారు. 58 ఏళ్ల జెజురికర్ వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. 1989లో ఈ కంపెనీలో అసిస్టెంట్ బ్రాండ్ మేనేజర్‌గా చేరిన శైలేష్.. అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. గత ఆరేళ్లుగా కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ప్రముఖ లిఫ్టుల తయారీ సంస్థ ఓటిస్ ఎలివేటర్స్ కంపెనీ బోర్డు సభ్యుడిగా కూడా కొనసాగుతున్నారు. నాయకత్వ మార్పులో భాగంగా పీ అండ్ జీ ప్రస్తుత సీఈఓ జాన్ మోల్లెర్ స్థానంలో శైలేష్ నియమితులయ్యారు. ఈ అక్టోబరులో జరగనున్న వాటాదారుల సమావేశంలో డైరెక్టర్ పదవికి పోటీ చేసేందుకు సైతం కంపెనీ బోర్డు జెజురికర్‌ను నామినేట్ చేసినట్లు పీ అండ్ జీ తెలిపింది.

శైలేష్ సోదరుడూ సీఈఓనే.. : మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ ఆటో, వ్యవసాయ యంత్రాల విభాగ సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ జెజురికర్ చిన్న తమ్ముడే శైలేష్. కాగా, భారతీయ సంతతి నాయకులు కేవలం సాంకేతికతనే కాదు, అమెరికన్ వినియోగదారుల హృదయాలను, మనస్సులను కూడా దోచుకోగలరని పీ అండ్ జీ సీఈఓగా శైలేష్ నియామకం మరోసారి నిరూపించిందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు.

హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థి.. నాదెళ్ల క్లాస్‌మేట్

శైలేష్ జెజురికర్‌కు హైదరాబాద్‌తోనూ ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. అంతే కాదు, హెచ్‌పీఎస్‌లోనే చదువుకున్న మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల క్లాస్‌మేట్ కూడా. వీరిద్దరూ స్నేహితులని కూడా తెలిసింది. జెజురికర్, నాదెళ్లతోపాటు వరల్డ్ బ్యాంక్ ప్రస్తుత ప్రెసిడెంట్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ మాజీ సీఈఓ అజయ్ బంగా, అడోబ్ సీఈఓ శాంతను నారాయణ్ కూడా హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థులే. జెజురికర్ విషయానికొస్తే, హెచ్‌పీఎస్‌లో విద్యాభ్యాసం అనంతరం ముంబై యూనివర్సిటీ నుంచి బీఏ ఎకనామిక్స్, ఆ తర్వాత ఐఐఎం లక్నో నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

3 రోజుల తర్వాత లాభాల్లోకి

447 పాయింట్లు బలపడిన సెన్సెక్స్

ముంబై: మూడు రోజుల వరుస నష్టాల నుంచి స్టాక్ మార్కెట్‌కు కాస్త ఊరట లభించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లతో మార్కెట్ మంగళవారం మళ్లీ లాభాలబాట పట్టింది. ఒకదశలో 539 పాయింట్ల వరకు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 446.93 పాయింట్ల లాభంతో 81,337.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140.20 పాయింట్ల వృద్ధితో 24,821.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడగా.. రిలయన్స్ షేరు 2.21 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

4 నెలల కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ విలువ నాలుగు నెలలకు పైగా కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 21 పైసల నష్టంతో రూ.86.91 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతోపాటు ముడిచమురు ధరల పెరుగుదల మన కరెన్సీపై ఒత్తిడి పెంచింది.

టీసీఎస్ షేరు మరింత పతనం: 12,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు గత వారాంతంలో ప్రకటించిన టీసీఎస్ షేరు విలువ మరో 0.73 శాతం తగ్గింది. క్రితం సెషన్‌లో దాదాపు 2 శాతం జారుకుంది. దాంతో గడిచిన రెండు రోజుల్లో కంపెనీ షేరు ధర 2.48 శాతం క్షీణించగా.. మార్కెట్ విలువ రూ.28,148 కోట్లకు పైగా తగ్గి రూ.11.05 లక్షల కోట్లకు పరిమితమైంది.

ఐపీఓకు లెన్స్‌కార్ట్

కళ్ల జోళ్ల విక్రయ కేంద్రాల నిర్వహణ స్టార్టప్ లెన్స్‌కార్ట్ కూడా ఐపీఓ జారీకి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేసింది. ఇష్యూ ద్వారా 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,650 కోట్లు) వరకు సమీకరించే అవకాశం ఉందని బ్లూంబర్గ్ కథనం వెల్లడించింది. ఐపీఓలో భాగంగా రూ.2,150 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయనుంది.

- స్వర్ణాభరణాల తయారీ సంస్థ శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ ఐపీఓకు అపూర్వ స్పందన లభించింది. మంగళవారం ఇష్యూ చివరి రోజు నాటికి ఏకంగా 80.80 రెట్లు బిడ్లు దాఖలయ్యాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	475
వరంగల్	407	గోదావరి	450
చిత్తూరు	463	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	109
వరంగల్	110	గుంటూరు	114
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	107
కర్నూలు	110	నెల్లూరు	112
విశాఖపట్నం	97	అనంతపురం	112
గోదావరి	109		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,820 ▼	91,500 ▼	1,26,000 ▲
విజయవాడ	1,01,200 ▼	96,000 ▼	1,16,600 ▲
విశాఖపట్నం	1,01,250 ▼	91,500 ▲	1,26,000 ▼
రాజమండ్రి	99,820 ▼	91,500 ▼	1,16,000 ▼
ప్రొద్దుటూరు	99,200 ▲	91,260 ▲	1,16,500 ▲
ముంబై	98,300 ▼	90,040 ▼	1,13,310 ▲

రెండేళ్లలో రూ.3 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- చేతిలో రూ.19 వేల కోట్ల ప్రాజెక్టులు
- 150 ఎకరాల్లో శాటిలైట్ షిప్‌యార్డు
- హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ కమొడోర్ హేమంత్ ఖత్రి



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) రాబోయే రెండేళ్లలో రూ.3 వేల కోట్ల టర్నోవర్ సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. సంస్థ ఆర్థిక స్థితి క్రమంగా మెరుగవుతోందని, నష్టాల నుంచి లాభాల్లోకి ప్రవేశించిందని సీఎండీ కమొడోర్ హేమంత్ ఖత్రి తెలిపారు. సంస్థ ఆదాయం 2020-21 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.403 కోట్లుండగా 2024-25 నాటికి రూ.1,783 కోట్లకు చేరిందని ఆయన చెప్పా రు. 2020-21లో రూ.85 కోట్ల నష్టంతో ఉన్న కంపెనీ 2024-25 నాటికి రూ.284 కోట్ల లాభాలను ఆర్జించిందన్నారు. హెచ్ఎస్ఎల్‌ను రక్షణ శాఖకు అప్పగించిన తరువాత వర్క్ ఆర్డర్లు ఎక్కువ వస్తున్నాయని, ప్రస్తుతం రూ.19 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు చేతిలో ఉన్నాయన్నారు. నాలుగేళ్ల వరుసగా లాభాలు రావడంతో 'మినీరత్న' గుర్తింపు లభించిందన్నారు. ప్రస్తుతం హెచ్ఎస్ఎల్‌కు ఉన్న భూమి సరిపోకపోవడంతో సిబ్బంది క్వార్టర్లకు వినియోగిస్తున్న 25 ఎకరాల స్థలాన్ని యార్డ్‌గా మార్చి వాడుతున్నామన్నారు. కార్యకలాపాలను ఇంకా విస్తరించాలనే ఆలోచనతో శ్రీకాకుళం జిల్లా మూలపేటలో గాని, కాకినాడ పోర్టులో గాని 110-150 ఎకరాల భూమి కేటాయిస్తే శాటిలైట్ షిప్‌యార్డ్ ఏర్పాటుచేస్తామని ఏపీ మారిటైమ్ బోర్డుకు ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో కూడా సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. భూమి కేటాయిస్తే అక్కడ కొత్త తరహా నౌకల నిర్మాణం చేపడతామని, లాజిస్టిక్స్ అన్నీ విశాఖ నుంచి అందిస్తామని వివరించారు. ఇప్పటివరకూ తాము నేవీ, కోస్ట్‌గార్డ్‌లకు అవసరమైన నౌకల నిర్మాణం, మరమ్మతులు, సబ్‌మెరైన్ల రీఫిట్ వంటి పనులు చేస్తున్నామని, త్వరలో వాణిజ్య నౌకలు, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలకు అవసరమైన ట్యాంకర్ నౌకలు, గ్రీన్ వెసల్స్ ల్యాండింగ్ ప్లాట్‌ఫారం డాక్స్, మెరైన్ కౌంటర్ మేజర్ వెసల్స్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేవీ నౌకలకు యాంటీ డ్రోన్ టెక్నాలజీని కూడా జత చేస్తున్నామన్నారు. దీని కోసం పెంటగాన్ రగ్ సిస్టమ్స్‌తో ఎంఓయూ చేసుకున్నామన్నారు. జపాన్‌కు చెందిన తోషిబా కంపెనీతో ఒప్పందం చేసుకొని ఫైర్ ప్రూఫ్ బ్యాటరీలతో నడిచే నౌకలను నిర్మించబోతున్నామన్నారు. కొరియన్ కంపెనీతో ఎంఓయూ చేసుకొని హైడ్రోజన్ ఫ్యూయిల్ సెల్ టగ్‌లను నిర్మిస్తామన్నారు. దేశంలో మొదటి గ్రీన్ టగ్‌ను తామే డెలివరీ చేస్తామని పేర్కొన్నారు. వీటికి ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ పూర్తి సహకారం అందిస్తోందన్నారు.

స్పోర్ట్స్

భారత్‌కు కఠిన డ్రా

మహిళల ఆసియాకప్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే మహిళల ఫుట్‌బాల్ ఆసియాకప్‌లో భారత జట్టుకు కఠిన డ్రా ఎదురైంది. 12 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో భారత్ గ్రూప్ 'సి'లో తలపడనుంది. అయితే ఇందులో తమకంటే మెరుగైన ర్యాంకింగ్స్‌లో ఉన్న జపాన్, చైనీస్ తైపీ, వియత్నాం జట్లు కూడా చోటు దక్కించుకున్నాయి. మార్చి ఒకటి నుంచి 21 వరకు ఈ ఆసియాకప్ జరుగుతుంది. ఇందులో సెమీస్‌కు చేరిన నాలుగు జట్లు నేరుగా 2027 ఫిఫా మహిళల వరల్డ్‌కప్‌నకు అర్హత సాధిస్తాయి.

కేకేఆర్ కోచ్‌కు ఉద్వాసన

న్యూఢిల్లీ: చీఫ్ కోచ్ చంద్రకాంత్ పండిట్‌కు ఐపీఎల్ టీమ్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఉద్వాసన పలికింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో పేలవ ప్రదర్శన నేపథ్యంలో సహాయ సిబ్బందిని ప్రక్షాళన చేయాలని కోల్‌కతా యాజమాన్యం నిర్ణయించింది. 2024లో పండిట్ హయాంలో కేకేఆర్ దశాబ్దం తర్వాత ఐపీఎల్ టైటిల్ గెలిచింది. కానీ, ఆ తర్వాతి సీజన్‌లో ఘోర ప్రదర్శనతో కేవలం ఐదు విజయాలతో ఎనిమిదో స్థానంలో నిలిచింది. మెకల్లమ్ స్థానంలో 2022లో కేకేఆర్ కోచ్‌గా చంద్రకాంత్ బాధ్యతలు చేపట్టాడు. పండిట్ కఠిన వ్యవహారశైలి కారణంగా కొందరు విదేశీ ప్లేయర్లు అసహనం వ్యక్తం చేశారు.

మంధాన వెనక్కి..బ్రంట్ ముందుకు



దుబాయ్: అంతర్జాతీయ మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. మంగళవారం ఐసీసీ ప్రకటించిన తాజా జాబితాలో ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్ టాప్‌లోకి వెళ్లింది. భారత్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో బ్రంట్ 160 పరుగులతో ఫామ్‌ను చాటుకుంది. అటు మంధాన ర్యాంకు రెండో స్థానానికి తగ్గింది. భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ పది స్థానాలను మెరుగుపర్చుకుని 11కి, జెమీమా 13వ స్థానానికి చేరారు. బౌలింగ్ విభాగంలో స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ టాప్‌లో కొనసాగుతోంది.





నువ్వేంటి మాకు చెప్పేది?

క్యూరేటర్‌తో గంభీర్ వాగ్వాదం

లండన్: టీమిండియా ప్రధాన కోచ్ గౌతం గంభీర్, స్థానిక ఓవల్ స్టేడియం చీఫ్ క్యూరేటర్ లీ ఫోర్టిస్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. జరిగిందేమిటంటే.. ఇంగ్లండ్‌తో ఐదో టెస్టు కోసం మంగళవారం తొలిసారిగా భారత జట్టు నెట్ సెషన్‌లో పాల్గొంది. దీనిలో భాగంగా ప్రాక్టీస్ కోసం టీమ్ ఉపయోగిస్తున్న పిచ్‌వద్ద ఆటగాళ్లు, కోచ్‌లు..అందరూ ఉండంపై క్యూరేటర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. బ్యాటర్ తప్ప మిగతా వారంతా పిచ్‌కి దూరంగా నిలబడాలని చెప్పాడు. ఇదే విషయమై అతడు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌తో మాట్లాడుతున్నప్పుడు.. గంభీర్ మధ్యలో కలుగజేసుకుని ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'మేమేం చేయాలో నీవు మాకు చెప్పాల్సిన అవసరం లేదు. నువ్విక్కడ కేవలం గ్రౌండ్స్‌మెన్ మాత్రమే. హద్దు మీరి ప్రవర్తించకు. ఏం చేయాలో మాకు తెలుసు' అని చేతి వేలు చూపించి మరీ ఘాటుగా సమాధానమిచ్చాడు. అయితే ఈ విషయాన్ని తాను రిపోర్ట్ చేస్తానని ఫోర్టిస్ చెప్పడంతో.. 'నువ్వేం చేయాలనుకుంటే అది చెయ్' అంటూ గౌతీ బదులిచ్చాడు. దీంతో సితాన్షు కోటక్.. ఫోర్టిస్‌ను పక్కకు తీసుకెళ్లి మాట్లాడాడు. ఒకవేళ పిచ్ దెబ్బతింటుందని ఫోర్టిస్ భావించినా, తాము స్పైక్ షూస్ కూడా ధరించలేదని కోటక్ తెలిపాడు. తమ కోచ్‌లు పిచ్‌ను పరిశీలించేందుకు వెళ్లినప్పుడు కూడా అక్కడి గ్రౌండ్ స్టాఫ్ ఒకరు వికెట్‌కు 2.5 మీటర్ల దూరంలో నిలబడాలని చెప్పడం ఆశ్చర్యపరిచిందని కోటక్ అన్నాడు. ఇలాంటి ప్రవర్తన గతంలో ఎక్కడా ఎదురుకాలేదని, అయినా ఫోర్టిస్‌పై భారత జట్టు ఫిర్యాదు చేయాలనుకోవడం లేదని తేల్చాడు.



కోటక్

కుల్దీప్, అర్ష్‌దీప్ ఖరారేనా?



కుల్దీప్

- ఆసక్తికరంగా భారత జట్టు కూర్పు
- రేపటినుంచే ఆఖరి టెస్టు

లండన్: వీరోచిత పోరాటంతో నాలుగో టెస్టును డ్రా చేసుకొన్న భారత్.. సిరీస్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. గురువారం నుంచి ఓవల్‌లో జరిగే ఐదో, ఆఖరి టెస్టులో గెలిచి సిరీస్‌ను సమం చేయాలన్న పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో టీమిండియా తుది జట్టు కూర్పు ఆసక్తిగా మారింది. అయితే, పరిస్థితులను బట్టి ఊహించిన దానికంటే ఎక్కువ మార్పులు చోటు చేసుకొనే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా వికెట్లు పడగొట్టగల బౌలర్ కోసం భారత్ వెదుకుతోంది. స్టార్ పేసర్ బుమ్రా విషయం సస్పెన్స్‌గా మారింది. మాంచెస్టర్ టెస్టులో పేస్ తగ్గించి బౌలింగ్ చేయడంతో అతడి ఫిట్‌నెస్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కానీ, బుమ్రా బౌలింగ్ చేసేంత ఫిట్‌గా ఉన్నాడని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ చెప్పాడు. కానీ, టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం మ్యాచ్ ముందు మాత్రమే బుమ్రాపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. నాలుగు టెస్టుల్లో కలిపి బుమ్రా దాదాపు 120 ఓవర్లు బౌల్ చేశాడు. ఒక్క ఓల్డ్ ట్రాఫోర్డ్‌లోనే 33 ఓవర్లు వేశాడు. ఒకవేళ బుమ్రాకు విశ్రాంతినిస్తే.. అతడి స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలనేది పిచ్ పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. కాగా, స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను గత నాలుగు మ్యాచ్‌లుగా బెంచ్‌కే పరిమితం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అతడికి ఆఖరి టెస్టులో ఆడించడం ఖాయంగా భావిస్తున్నారు. గాయపడిన పేసర్లు అర్ష్‌దీప్, ఆకాశ్‌దీప్ కూడా ఫిట్‌నెస్ సాధించారని కోచ్ గంభీర్ తెలిపాడు. అయితే, అన్షుల్ కాంబోజ్, శార్దూల్ ఠాకూర్‌పై వేటు పడుతుందన్న ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. కాంబోజ్ స్థానంలో ఆకాశ్‌దీప్ రీఎంట్రీ ఇవ్వనుండగా.. బుమ్రా దూరమైతే ఆ స్థానం కోసం అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ పోటీలో ఉన్నారు. అయితే అర్ష్‌దీప్ ఎంపిక దాదాపు ఖరారైనట్టే చెబుతున్నారు. ఇక శార్దూల్ బంతితో తీవ్రంగా నిరాశపర్చడం.. కుల్దీప్‌కు మార్గం సుగమం చేసిందని భావిస్తున్నారు. బ్యాటింగ్ విభాగంలో పెద్దగా మార్పులు లేవని తెలుస్తోంది. గాయపడిన రిషభ్ పంత్ సిరీస్ నుంచి అవుట్ కాగా.. అతడి స్థానంలో ధ్రువ్ జురెల్ ఆడడం దాదాపుగా ఖరారైంది.



అర్ష్‌దీప్

ఐపీఎల్ జెర్సీల చోరీ

ముంబై: స్థానిక వాంఖడే స్టేడియంలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన చోరీ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 13న అక్కడి సెక్యూరిటీ గార్డు 261 ఐపీఎల్ జెర్సీలను దొంగతనం చేశాడు. వీటి విలువ రూ.6.5 లక్షలు. హరియాణాకు చెందిన ఆన్‌లైన్ డీలర్‌కు ఈ జెర్సీలను అమ్మినట్టు పోలీసులు తెలిపారు. అయితే అవి చోరీ చేసి అమ్మినట్టుగా తనకు తెలియదని ఆ డీలర్ పోలీసులకు తెలిపాడు. ఇక చోరీకి గురైన వాటిలో 50 జెర్సీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనంపై బోర్డు ఈనెల 17న ఫిర్యాదు చేయగా, సీసీ ఫుటేజిని పరిశీలించి గార్డును అరెస్ట్ చేశారు.

ఆసీస్ క్లీన్‌స్వీప్

ఐదో టీ20లోనూ విండీస్ చిత్తు



సెయింట్ కిట్స్: వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను పర్యాటక ఆస్ట్రేలియా 5-0తో క్లీన్‌స్వీప్ చేసింది. సోమవారం రాత్రి జరిగిన ఐదవ, ఆఖరి టీ20లో ఆసీస్ 3 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. తొలుత విండీస్ 19.4 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. హెట్‌మయెర్(52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (35) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. బెన్ డ్వార్షుయిస్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఆసీస్ 17 ఓవర్లలో 173/7 స్కోరు చేసి గెలిచింది. మిచెల్ ఓవెన్ (37), కామెరూన్ గ్రీన్ (32), టిమ్ డేవిడ్ (30) వేగంగా ఆడారు. అకిల్ హొస్సేన్ 3 వికెట్లు పడగొట్టాడు.

ఏపీ బాక్సింగ్ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ సంఘం అధ్యక్షునిగా ద్రోణాచార్య అవార్డీ ఐ. వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలలో ప్రధాన కార్యదర్శిగా పి.మధుసూదనరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా రెడ్డి శ్రీనివాసరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా కె.వేణుగోపాలరావు, ఉపాధ్యక్షులుగా బి.ఎ.లక్ష్మణదేవ్, డి.నాగేశ్వరరావు, డి.మన్మథ కుమార్ ఎన్నికయ్యారు. అలాగే సంయుక్త కార్యదర్శులుగా రమ్య, సురేంద్ర బాబు, చంద్రశేఖర్, ఉమామహేశ్వరరావు, మహేష్, శివరామకృష్ణ, కోశాధికారిగా శ్రీనివాసరావుతోపాటు మరో నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎన్నికయ్యారు.

భారత్-పాక్ జట్లు ఆడతాయి!



ఆసియాకప్

న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరగాల్సిన ఆసియాకప్ టీ20 టోర్నీపై ఇటీవలి వరకు సందిగ్ధత కొనసాగింది. అయితే ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) షెడ్యూల్‌ను ప్రకటించడంతో అందరి సందేహాలు తీరాయి. సెప్టెంబరు 9 నుంచి 28 వరకు తటస్థ వేదిక దుబాయ్‌లో ఈ టోర్నీ జరగనుంది. ఒకే గ్రూపులో ఉన్న భారత్-పాక్ జట్లు అదే నెల 14న మ్యాచ్‌లో తలపడతాయి. కానీ పహల్గాం ఉగ్రదాడుల తర్వాత కూడా పాక్‌తో మ్యాచ్ ఆడడమేంటన్న విమర్శలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఆసక్తి వ్యక్తమవుతోంది. అటు జాతీయ క్రీడా బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు కాబట్టి బోర్డు క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోకి రాదని, ప్రజల మనోభావాలపై వారు ఎలా స్పందిస్తారో చూడాల్సిందేనని క్రీడా శాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఆసియాకప్‌లో పాక్‌తో మ్యాచ్‌ను ఆడకుంటే భారత్‌కే నష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఇది ద్వైపాక్షిక సిరీస్ కాదు కాబట్టి వాకోవర్ ఇస్తే కీలక పాయింట్లు కోల్పోవాల్సి ఉంటుందని, అది పాక్‌కే లాభిస్తుందని చెబుతున్నారు. అందుకే ఈ మ్యాచ్ రద్దు కాకపోవచ్చని తేల్చారు. అంతేకాకుండా ఈ రెండు జట్లు తలపడితే వ్యాపార పరంగా భారీ ఆదాయం చేకూరుతుందని, కానీ రద్దయితే బ్రాడ్‌కాస్టర్‌కే కాకుండా ఇతర ఏసీసీ సభ్య దేశాలకు కూడా ఆర్థికంగా నష్టం చేకూరినట్టేనని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

ప్రీక్వార్టర్స్‌కు సాత్విక్ ద్వయం

మకావు ఓపెన్

మకావు: సాత్విక్-చిరాగ్ జోడీ మకావు ఓపెన్‌లో ప్రీక్వార్టర్స్‌కు చేరుకోగా.. గాయత్రి జంటకు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. పురుషుల డబుల్స్‌లో మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో రెండో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట 21-13, 21-15తో మలేసియాకు చెందిన లో హాంగ్ యి-ఎన్‌జి ఇంగ్ చియాంగ్‌పై సునాయాసంగా గెలిచింది. కాగా, మహిళల డబుల్స్‌లో టాప్ సీడ్ గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జంట 21-16, 20-22, 15-21తో చైనీస్ తైపీకి చెందిన లింగ్ గ్జియో మిన్-పెంగ్ యు వి చేతిలో ఓడింది..



టాప్-10లోకి సాత్విక్ జోడీ..: బీడబ్ల్యూఎఫ్ పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో సాత్విక్ జోడీ మళ్లీ టాప్-10లోకి దూసుకొచ్చింది. తాజా ర్యాంకుల జాబితాలో సాత్విక్-చిరాగ్ జంట మూడు స్థానాలు మెరుగుపర్చుకొని 9వ ర్యాంక్‌లో నిలిచింది. సింగిల్స్‌లో లక్ష్య సేన్ రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకొని 17వ స్థానంలో, ప్రణయ్ 33వ ర్యాంక్‌లో ఉన్నారు. పీవీ సింధు 15వ ర్యాంక్‌లో నిలకడగా కొనసాగుతుండగా.. 17 ఏళ్ల ఉన్నతి హుడా కెరీర్ బెస్ట్ 31వ ర్యాంక్ సాధించింది.



ఝార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

» కన్వర్ యాత్రికుల బస్సును ఢీకొన్న ట్రక్కు..18 మంది మృతి

రాంచీ, జూలై 29: ఝార్ఖండ్‌లోని దేవగఢ్ జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కన్వర్ యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సును ఓ ట్రక్కు ఢీ కొనడంతో 18 మంది మృతి చెందారు. మరో 10 మంది గాయపడ్డారు. ఝార్ఖండ్‌లో ప్రతి ఏడాది ఈ సమయంలో శ్రావణి మేళా జరుగుతుంది. ఈ సందర్భంగా దేవగఢ్‌లోని బాబా బైద్యనాథ్ ధామ్ ఆలయానికి భక్తులు వెళ్తుంటారు. ఈ క్రమంలో 35 మంది భక్తులు బస్సులో బైద్యనాథ్ ఆలయానికి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న బస్సు జామునియా గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా ఎల్పీజీ సిలిండర్లతో వస్తున్న ట్రక్కు ఢీ కొట్టింది. ట్రక్కు ఢీ కొట్టిన వేగానికి బస్సు బోల్తా పడి నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో 18 మంది భక్తులు మృతి చెందారు, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు.

న్యూయార్క్‌లో దుండగుడి కాల్పులు

» నలుగురి మృతి.. తర్వాత నిందితుడి ఆత్మహత్య

న్యూయార్క్, జూలై 27: ఎప్పుడూ రద్దీగా ఉండే అమెరికా న్యూయార్క్‌లోని మన్‌హట్టన్‌లో కాల్పుల కలకలం రేగింది. ఓ దుండగుడు కాల్పులకు పాల్పడంతో ఓ పోలీసు అధికారి సహా నలుగురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. అనంతరం దుండగుడు తనని తాను కాల్చుకొని మరణించాడు. సోమవారం ఈ ఘటన జరిగింది. బుల్లెట్ ప్రూఫ్ ధరించి ఏఆర్ రైఫిల్‌తో దుండగుడు వచ్చాడని, 345 పార్క్ అవెన్యూ భవనంలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడ్డాడని పోలీసులు చెప్పారు. కాల్పుల శబ్దం విని ప్రజలు భవనం నుంచి పరుగులు తీశారని, ఆ తర్వాత దుండగుడు తనని తాను కాల్చుకొని మరణించాడని అధికారులు వెల్లడించారు. దుండగుడి వద్ద ఉన్న రైఫిల్‌కు లైసెన్స్ ఉందని, అయితే దాని గడువు ముగిసిందని గుర్తించారు. కాగా, కాల్పులకు గల కారణాలు తెలియరాలేదు.

పూరీ ఆలయంలో రహస్య గది లేదు: ఏఎస్ఐ

పూరీ, జూలై 29: ఒడిశాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీలోని జగన్నాథ ఆలయంలో ఉన్న రత్న భాండాగారంలో ఎలాంటి రహస్య గది లేదని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) స్పష్టం చేసింది. గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) సర్వే ఆధారంగా ఈ విషయాన్ని నిర్ధారించినట్లు 'ఎక్స్'లో పోస్టు చేసింది. పూరీ ఆలయంలోని రత్న భాండాగారం పునరుద్ధరణ, మరమ్మతు పనులను ఏఎస్ఐ ఇటీవల పూర్తి చేసింది. భీతర, బాహర అనే రెండు భాగాలుగా రత్న భాండాగారం (ఖజానా) ఉందని, వీటిని ఒక ఇనుప గేటుతో వేరు చేసి, బయట నుంచి తాళం వేశారని తెలిపింది. ఈ గదులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత గోడల్లో, భూమి కింద భాగంలో ఏవైనా రహస్య గదులు, అరలు ఉన్నాయేమో నిర్ధారించడానికి జీపీఆర్ సర్వే చేపట్టాలని నిర్ణయించామని పేర్కొంది.

కేరళలో విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్లు

తిరువనంతపురం, జూలై 29: గర్భాశయ ముఖ ద్వార కేన్సర్ (సర్వైకల్ కేన్సర్) నివారణకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని మంగళవారం కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్లు ఇచ్చేందుకు కార్యక్రమాన్ని రూపొందించనుంది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

పరదా కాపురాల పాట్లు!

» దుబాయిలో ఇరుకు గదుల్లో పలువురు తెలుగు ప్రవాసులు

» మంచం పట్టేంత స్థలంలోనే కాపురం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బతుకుదెరువు కోసం దుబాయికి వచ్చే వారు ఎదుర్కొనే సమస్యల్లో ఇల్లు కీలకం. ఇళ్ల యజమానులు తమ ఇళ్లను అనేక భాగాలుగా విభజించి అద్దెకు ఇస్తుంటారు. అవెంత చిన్నగా ఉంటాయంటే, ఒక గది అంటే ఒక మంచం పట్టేంత స్థలం మాత్రమే. ఆ మంచం చుట్టూ ప్లైవుడ్ లేదా పరదాలు కట్టుకొని కాపురాలు చేసే దుస్థితి. ఇప్పుడు పలువురికి ఈ అవకాశం కూడా లేకుండా పోతోంది. ఈ తరహా నివాసాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. తనిఖీలు చేస్తూ యజమానులకు జరిమానాలు విధిస్తున్నారు. దీంతో ఇంతకాలం చవకగా లభించిన ఆశ్రయం ఇకపై దూరం కానుంది.

సంపన్నుల నిలయమైన దుబాయిలో సగటు కార్మికుడికి పడుకునే చోటు లభించాలన్నా సవాలక్ష సమస్యలు. అనేక తెలుగు ప్రవాస కుటుంబాలు తమవారిని కలుసుకోవాలంటే ఏ రెస్టారెంట్‌లోనో, పార్కులోనో మాత్రమే కలుసుకుంటూ ఉంటాయి. ఇళ్లకు అతిథులను ఆహ్వానించడానికి వెనుకాడతారు. ఎందుకంటే కుర్చీ వేసుకోవడానికి కూడా స్థలం ఉండదు. దుబాయిలో అద్దెకు ఇచ్చే ఇళ్లు సైజులో పెద్దవేగానీ.. వాటిని నియమాలకు విరుద్ధంగా విభజించి మంచాలు లేదా గదుల వారీగా అద్దెకిస్తున్నారు. ఇది యజమానులకు ఆర్థిక లబ్ధి



చేకూరుస్తోంది. ప్రవాసులకు చవకగా ఆశ్రయం లభిస్తోంది. దుబాయి నిబంధనల ప్రకారం ఒక గదిలో ఒక మనిషికి కనీసం 3.7 చదరపు మీటర్ల వైశాల్యం ఉన్న స్థలం ఉండాలి. కానీ ఆ సైజు లేదా దానికన్నా తక్కువ స్థలంలో ఒక జంట ఉంటోంది. ఒక గదిలో ఒక జంటకు బదులుగా నాలుగు జంటలు పరదాలు కట్టుకొని బంకు బెడ్లలో కాపురం చేస్తుండగా, బ్యాచిలర్లయితే 10 మంది వరకు నివసిస్తున్నారు. తెలుగు ప్రవాసులు ఎక్కువగా ఉన్న దేరా, రిగ్గా, కరమా, సత్వా, ముర్రఖబాద్, బర్ దుబాయిలలో 'షేర్ అకాడమేషన్' పేరిట ఈ సంస్కృతి ఎక్కువగా ఉంది. ఒక గది అద్దె 4 వేల దిర్హాంలు ఉంటే, నాలుగు జంటలు వెయ్యి దిర్హాంల చొప్పున చెల్లిస్తూ ఆ ఒక్క గదిలో ఉంటున్నాయి. మంచం చుట్టు పరదా లేదా ప్లైవుడ్‌తో తెరలాగా వేసుకుంటున్నారు.

ఆరోగ్య సమస్యలు.. అగ్ని ప్రమాదాలు

యజమానులు తమ ఇళ్లలోని మొత్తం స్థలాన్ని అద్దెకు ఇస్తుండటంతో.. గాలి, వెలుతురు లేని ఇరుకు కారణంగా పలువురు ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. అంతేకాదు, అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దుబాయిలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలలో 74 శాతానికి పైగా ఈ తరహా ఇరుకు గదులే కారణమని ఇటీవల ఓ అధికారిక నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో, షేర్ అకాడమేషన్‌పై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. పోలీసులు, మునిసిపాల్టీ, విద్యుత్ అధికారులు సంయుక్తంగా తనఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నారు. దీని వెనుక దుబాయి స్థిరాస్తి వ్యాపారుల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. షేర్ అకామడేషన్ విధానం తమ వ్యాపారాభివృద్ధికి అడ్డంకిగా తయారైందని భావించి దానిని తొలగించటానికి ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో ఇంతకాలం నగరం నడిబొడ్డున నివసించిన తెలుగు ప్రవాసులు ఆశ్రయం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ముఖ్యంగా, అద్దె తక్కువ ఉండే షార్జాకు తరలివెళ్తున్నారు. అయితే, ఇది చాలామందికి ఆర్థికంగా భారంగా పరిణమిస్తోంది. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వందలాది మంది మహిళలు దుబాయిలో ఇళ్లలో పాచి పనులు చేస్తుంటారు. వీరందరూ షార్జాలో ఉండి దుబాయికి వెళ్లి రావటానికి డబ్బుపరంగా ఇబ్బందులు ఎదుర్కోవటమేగాక ప్రయాణ బడలికతో అలిసిపోతున్నారు. కాగా, దుబాయి శివారులో ఉన్న లేబర్ క్యాంపులలో వసతుల అభివృద్ధిపై సర్కారు దృష్టి సారిస్తోంది. 50 మందికిపైగా కార్మికులు ఉన్న ప్రతి సంస్థ విధిగా తమ లేబర్ క్యాంపు వసతి వివరాలను ప్రభుత్వం వద్ద నమోదు చేయాలని నిర్దేశిస్తున్నారు.

ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్త మేఘ్‌నాథ్ దేశాయ్ కన్నుమూత



న్యూఢిల్లీ, జూలై 31: బ్రిటన్‌లో స్థిరపడ్డ ప్రముఖ భారతీయ ఆర్థిక శాస్త్రవేత్త మేఘ్‌నాథ్ దేశాయ్ (85) మంగళవారం కన్నుమూశారు. 2009లో పద్మ భూషణ్ అవార్డు అందుకున్న ఆయన ఆర్థికశాస్త్రంపై పలు పుస్తకాలు రాశారు. 1940లో గుజరాత్‌లోని వడోదరలో జన్మించిన ఆయన 1963లో పెన్సిల్వేనియా యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. రెండేళ్ల అనంతరం లండన్ వెళ్లారు. అక్కడి లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో లెక్చరర్‌గా చేరారు. 1991లో లేబర్ పార్టీ తరఫున హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో సభ్యునిగా నియమితులయ్యారు. 2022లో 'రాజకీయ ఆర్థిక వ్యవస్థ దారిద్ర్యం' పేరుతో చివరి పుస్తకం రాశారు.

ప్రళయ్ క్షిపణి పరీక్షలు విజయవంతం



బాలాసోర్/న్యూఢిల్లీ, జూలై 29: డీఆర్‌డీవో కొత్తగా అభివృద్ధి చేసిన వ్యూహాత్మక క్షిపణి 'ప్రళయ్'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. సంప్రదాయ వార్‌హెడ్‌లను మోసుకెళ్లే సామర్థ్యం కలిగిన ఈ స్వల్పశ్రేణి మిస్సైల్‌కు సోమ, మంగళవారాల్లో ఒడిసా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపంలో వరుస పరీక్షలు నిర్వహించినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉపరితలం నుంచి ఉపరితలంపై ఉన్న లక్ష్యాలను ఛేదించగల ఈ క్షిపణి 500 నుంచి 1000 కిలోల వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. ఇది 150- 500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు.

భారీగా ఓట్లు తొలగిస్తే.. జోక్యం చేసుకుంటాం!

» బిహార్ 'ఎస్ఐఆర్' సవాల్ పిటిషన్లపై ఆగస్టు 12, 13 తేదీల్లో విచారణ: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 29: బిహార్ ఎన్నికల నేపథ్యంలో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్‌లో భారీగా ఓట్లు తొలగింపునకు గురైతే.. తాము వెంటనే జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘంరాజ్యాంగ సంస్థ అని, అది చట్టప్రకారం పనిచేస్తుందని భావిస్తున్నామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చి ధర్మాసనం పేర్కొంది. ఎస్ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఆగస్టు 12, 13 తేదీల్లో విచారణ చేపడుతామని పేర్కొంది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ఆగస్టు 1న ఈసీ ప్రచురించే ఓటర్ల ముసాయిదా జాబితాలో అనేక మంది ఓటర్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. 'రాజ్యాంగ బద్ధ సంస్థగా ఈసీ చట్టప్రకారం నడుచుకుంటుందని భావిస్తున్నాం. ఏమైనా తప్పు జరిగితే, ఆధారాలతో మీరు కోర్టు దృష్టికి తీసుకురండి. మీ వాదనలు వింటాం' అని స్పష్టం చేశారు. ఈసీ చనిపోయారని చెబుతున్న వారిలో 15 మంది బతికున్నట్లుగా మీరు చూపించండని జస్టిస్ బాగ్చి సూచించారు. ముసాయిదా ప్రచురణ తర్వాత కూడా ఎన్యూమరేషన్ పత్రాలను సమర్పించవచ్చని ఈసీ తరఫు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది తెలిపారు.

న్యాయ సలహా ఇచ్చిన లాయర్లకు సమన్లు పంపొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 29: క్రిమినల్ కేసుల్లో నిందితులకు న్యాయ సలహా ఇచ్చినంత మాత్రాన న్యాయవాదులను దర్యాప్తు సంస్థలు విచారణకు రావాలంటూ సమన్లు పంపకూడదని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ నేరానికి సహకారం అందించి ఉంటే లాయర్లకు సమన్లు పంపించవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం తెలిపింది. తదుపరి విచారణను ఆగస్టు 12కు వాయిదా వేసింది.

నేడే నింగిలోకి నిసార్ నిఘా నేత్రం

సూళ్లూరుపేట, తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. భూమి అణువణువునూ స్కాన్ చేసి.. అడవులు, మైదానాలు, కొండలు, పర్వతాలు, పంటలు, జలవనరులు.. ఇలా అన్నింటినీ జల్లెడ పట్టే భూపరిశీలన ఉపగ్రహం నిసార్ (నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్) ప్రయోగానికి అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి బుధవారం సాయంత్రం 5:40 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా 2,392 కిలోల బరువున్న నిసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. ఈ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్‌ను మంగళవారం మధ్యాహ్నం 2:10 గంటలకు ప్రారంభించారు. కౌంట్‌డౌన్ 27:30 గంటలు కొనసాగిన తర్వాత షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ఈ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఇస్రో-నాసా సంయుక్తంగా తొలిసారిగా రూపొందించి ప్రయోగిస్తున్న ఉపగ్రహం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు అమెరికా నుంచి నాసా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు చేరుకున్నారు. గతంలో చేపట్టిన రెండు ప్రయోగాలూ విఫలం కావడంతో శాస్త్రవేత్తలు జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగ విషయంలో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు.



షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

యుద్ధంలో ప్రణయం



జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధానపాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న చిత్రం 'వార్ 2'. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. తాజాగా, ఫస్ట్ సింగిల్ గురించి అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. 'ఆవన్ జావన్' అంటూ సాగే ఈ పాటను ఈ వారంలోనే విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇది 'బ్రహ్మాస్త్ర'లోని 'కేసరియా' (కుంకుమలా నువ్వే) పాట కంటే మరింత ఆకట్టుకుంటుందని చెప్పారు. హృతిక్ రోషన్, కియార అద్వానీపై చిత్రీకరించిన ఈ రొమాంటిక్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని అన్నారు. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

ఉస్తాద్ క్లైమాక్స్ పూర్తి



తన సినిమాలను వరుస పెట్టి అభిమానుల ముందుకు తెచ్చేందుకు కొన్నాళ్లుగా సెట్స్‌లోనే ఎక్కువగా గడుపుతున్నారు పవన్ కల్యాణ్. చాలాకాలంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న 'హరిహర వీరమల్లు' ఇటీవలే విడుదలైంది. మరోవైపు 'ఓజీ' చిత్రం షూటింగ్‌ను సైతం ఆయన పూర్తి చేశారు. ఇక ఆయన నటిస్తున్న మరో చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ కూడా పూర్తయింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తెలిపింది. 'ఉస్తాద్ భగత్‌సింగ్ క్లైమాక్స్ షూట్‌ను పవన్ కల్యాణ్ పూర్తి చేశారు. నబకాంత మాస్టర్ పర్యవేక్షణలో ఎమోషనల్ యాక్షన్‌తో కూడిన ఎలక్ట్రిఫైయింగ్ క్లైమాక్స్ పూర్తయింది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బిజీగా ఉన్నా, ఈ చిత్రం షూటింగ్‌ను ఆయన వేగంగా పూర్తి చేశారు. ఆయన అంకితభావం, శ్రమించే తత్వానికి ఇది నిదర్శనం' అని పేర్కొంది. ఈ సందర్భంగా సెట్‌లో దర్శకుడు హరీశ్ శంకర్ సూచనలను ఆసక్తిగా వింటున్న పవన్ కల్యాణ్ ఫొటోను విడుదల చేసింది. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ శక్తిమంతమైన పోలీసాఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు.

సంజూ బాబా లుక్కొచ్చింది



ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కిస్తున్న హారర్ థ్రిల్లర్ 'రాజాసాబ్'. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రంలో ఆయన పోషిస్తున్న లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. 'విలక్షణతకు, ఎనర్జీకి పర్యాయపదమైన సంజూ బాబాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు' అని పేర్కొంది. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. డిసెంబర్ 5న చిత్రం విడుదలవుతోంది.

అందరినీ ఆకట్టుకుంటుంది



జగదీశ్ ఆమంచి కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'యముడు'. 'ధర్మో రక్షతి రక్షితః' దీని ట్యాగ్‌లైన్. శ్రావణి శెట్టి కథానాయిక. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమంలో నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ 'ఈ మధ్య విడుదలవుతున్న చిన్న చిత్రాలు అద్భుతాలు సృష్టిస్తున్నాయి. ఈ 'యముడు' చిత్రం కూడా విజయవంతం అవుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. జగదీశ్ ఆమంచి మాట్లాడుతూ 'ప్రస్తుతం ఎక్కడ చూసినా కుట్రలు, హత్యలు, అక్రమ సంబంధాలకు సంబంధించిన వార్తలే కనిపిస్తున్నాయి. ఆ అంశాలతోనే ఈ చిత్రాన్ని తీశాం. అందరినీ ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది' అని అన్నారు. కార్యక్రమంలో శ్రీమల్లిక, ఆకాశ్, భవానీ రాకేశ్ తదితరులు మాట్లాడారు.

నటి రమ్యకు శివరాజ్‌కుమార్ మద్దతు



నటుడు దర్శన్ అభిమానులు తనకు వ్యతిరేకంగా పెట్టిన అసభ్య పోస్టులపై నటి రమ్య నగర పోలీస్ కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. 43 సోషల్ మీడియా ఖాతాలను ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీపీ సీమంత్ కుమార్ సింగ్ విచారించాలని సీఈఎన్ పోలీసులను ఆదేశించారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా, నటి రమ్యకు శివరాజ్‌కుమార్, ఆయన భార్య గీతా శివరాజ్ మద్దతు ప్రకటించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

కబడ్డీ ఆటగాడి కథ



విజయరామరాజు టైటిల్ రోల్ పోషిస్తున్న సినిమా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మిస్తున్నారు. సిజ్జా రోజ్ కథానాయిక. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ని దర్శకుడు హను రాఘవపూడి లాంచ్ చేశారు. ఓ కబడ్డీ ఆటగాడి జీవితం ఆధారంగా రూపొందించిన ట్రైలర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ 'ఈ సినిమాని అంతర్జాతీయ ప్రమాణాల స్థాయిలో 120 లొకేషన్లలో చిత్రీకరించాం' అని చెప్పారు. విజయరామరాజు మాట్లాడుతూ 'నా జీవితంలో గుర్తుండిపోయే సినిమా ఇది. మంచి క్యారెక్టర్ ఉన్న చిత్రం రావడం చాలా అరుదు. మీరందరూ సపోర్ట్ చేసి ముందుకు తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.



తమిళనాడు-ఆంధ్ర సరిహద్దులోని గుమ్మడిపూడి చెక్ పోస్టు వద్ద ధర్నా చేస్తున్న ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సరిహద్దు చెక్ పోస్టులను తొలగించాలి

» ఏపీ లారీ ఓనర్స్ సంఘం డిమాండ్.. తమిళనాడులో ధర్నా

విజయవాడ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో అనధికారికంగా కొనసాగుతున్న చెక్ పోస్టులను ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వర రావు డిమాండ్ చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఈ చెక్ పోస్టులను తొలగించాలంటూ.. ఆంధ్రా-తమిళనాడు సరిహద్దులోని గుమ్మడిపూడి చెక్ పోస్ట్ వద్ద ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ మంగళవారం ధర్నా చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 70 మంది లారీ యజమానులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఏపీ సహా కొన్ని రాష్ట్రాలు సరిహద్దు చెక్‌పోస్టులను తొలగించాయన్నారు. తమిళనాడు సహా మరికొన్ని రాష్ట్రాలు వీటిని అనధికారికంగా కొనసాగిస్తున్నాయని చెప్పారు. అనధికారికంగా ఉన్న చెక్ పోస్టులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రాభివృద్ధిని రాక్షసుల్లా అడ్డుకుంటున్నారు

» వైసీపీ నాయకులపై దీపక్‌రెడ్డి ఆగ్రహం

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రుషులు యజ్ఞం చేస్తుంటే రాక్షసులు భగ్నం చేసేందుకు ప్రయత్నించినట్లుగా సీఎం చంద్రబాబు రాష్ట్రానికి మంచి చేస్తుంటే జగన్ అడ్డుకుంటున్నారని సీడ్ ఏపీ చైర్మన్ దీపక్ రెడ్డి విమర్శించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "జగన్ రాష్ట్రాన్ని 20 సంవత్సరాల వెనక్కి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక కంపెనీలను తెచ్చి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తోంది. 'గత వైసీపీ ప్రభుత్వం చేసిన ఆరోపణలతో ఏపీకి రాకూడదని అనుకున్నాం. ఇప్పుడు చంద్రబాబుపై గౌరవంతో మళ్లీ రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు ముందుకొస్తున్నామని సింగపూర్ ప్రభుత్వం చెప్పింది' అంటే సీబీఎన్‌కు ఉన్న ఇమేజ్ ఏమిటో అర్థం చేసుకోవచ్చు" అని దీపక్ రెడ్డి అన్నారు.

వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం విధ్వంసం

» జగన్ హయాంలో వేల కోట్ల బియ్యం స్కాం: ఎంపీలు శబరి, కలిశెట్టి

న్యూఢిల్లీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యవసాయ రంగం విధ్వంసానికి గురైందని టీడీపీ ఎంపీలు బైరెడ్డి శబరి, కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. మంగళవారం ఏపీ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. 'టీడీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఫసల్ బీమా యోజన నిధులు రూ.2,500 కోట్లు పెండింగ్‌లో పెట్టిందని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ లోక్‌సభలో చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు రేషన్ బియ్యాన్ని ఆఫ్రికా, ఇతరత్రా దేశాలకు అక్రమంగా ఎగుమతి చేసి రూ.వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారు. దీనిపై విచారణ జరపాలి' అని డిమాండ్ చేశారు.

నకిలీ మద్యంతో ప్రాణాలు తీశారు: రాంప్రసాద్

తిరుపతి ఆర్టీసీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): నకిలీ డిస్టిలరీలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన వారికి శిక్ష తప్పదని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాము కక్షపూరితంగా వైసీపీ నాయకులను అరెస్టు చేయడం లేదన్నారు. స్కాంలు, తప్పులు చేసిన నాటి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు జైల్లో ఊచలు లెక్కపెడుతున్నారని చెప్పారు. ఆడుదాం ఆంధ్రలో అవకతవకలు ఉంటే సంబంధితులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బీజేపీ ఎంపీలతో ఒడిసా గవర్నర్ భేటీ

న్యూఢిల్లీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఏపీకి చెందిన బీజేపీ ఎంపీలతో ఒడిసా గవర్నర్ కంభంపాటి హరిబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎంపీ సీఎం రమేశ్ ఆహ్వానం మేరకు మంగళవారం ఉదయం ఢిల్లీలోని ఆయన ఇంటికి హరిబాబు వచ్చారు. ఈ సందర్భంగా హరిబాబును కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, పాకా సత్యనారాయణ, సీఎం రమేశ్ ఘనంగా సత్కరించారు. ఆతర్వాత ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఇంటికి హరిబాబు వెళ్లారు.

స్వచ్ఛభారత్‌లో స్వయం సహాయక సంఘాలు

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఘనవ్యర్థాల నిర్వహణకు డ్వాక్రా సంఘాల సేవలు వినియోగించుకోవాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. పైలెట్ ప్రాజెక్టు కింద 10 జిల్లాలను ఇప్పటికే ఎంపిక చేసింది. పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని ఒక్కో పంచాయతీని ఎంపిక చేసి ఈ పైలెట్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. చెత్త సేకరణ, తడి, పొడి చెత్తగా విడగొట్టడం, కంపోస్టింగ్ తదితర ప్రక్రియపై స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించనున్నారు. ఘనవ్యర్థాల నిర్వహణలో భాగంగా వర్మి కంపోస్టును ఉత్పత్తి చేసి మార్కెట్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మార్గదర్శకాల్లో సూచించారు.

అర్హులైన రైతులందరికీ 'అన్నదాత-సుఖీభవ'

» తిరస్కరించినవి మళ్లీ పరిశీలించండి: సీఎస్

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టు రెండో తేదీన అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన అన్నదాత పథకంపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఈ పథకానికి ఇంకా ఈ-కేవైసీ, ఎన్పీసీఐ మ్యాపింగ్ కాని రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఈకేవైసీ, ఎన్పీసీఐ మ్యాపింగ్ కాని రైతులకు సంక్షిప్త సందేశాలు పంపాలని ఆర్టీజీఎస్ సీఈవోను ఆదేశించారు. పథకానికి అనర్హులుగా గుర్తించిన వారికి ఎందుకు తిరస్కరించామో స్పష్టంగా తెలియ జేయాలన్నారు. తిరస్కరణకు గురైన వారి జాబితాను మరోసారి పరిశీలించి, అర్హత ఉంటే జాబితాలో చేర్చాలన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే ఈ-కేవైసీ, ఈ-పంట నమోదు తప్పనిసరి అని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. 155251కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

రాష్ట్రంలో 87 పులులు: పీసీసీఎఫ్

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): దేశంలో 3,682 పులులు ఉండగా, రాష్ట్రంలో 87 ఉన్నాయని రాష్ట్ర అటవీ శాఖ ముఖ్యదళాధికారి, పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్ చెప్పారు. మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో పులుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలతో వాల్ పోస్టర్లను అటవీ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ పులుల వధ, అక్రమ రవాణాను నిలువరించడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఈ ప్రయత్నంలో ప్రజల సహకారం కీలకమని చెప్పారు.

అంబేడ్కర్ స్టడీ సర్కిల్ నిర్వహణకు ఐఏఎస్, ఐపీఎస్‌లతో కమిటీ

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ మేనేజ్‌మెంట్ కమిటీని పునర్నిర్మిస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో నియమించిన ఈ కమిటీ రెండేళ్లపాటు సేవలందించనుంది. ఐఏఎస్ అధికారులు కాంతిలాల్ దండే, కోన శశిధర్, డి.రోనాల్డ్ రోజ్, జి.వీరపాండ్యన్, గంధం చంద్రుడు, నాగలక్ష్మి, సంపత్‌కుమార్, ఐపీఎస్ అధికారులు సీహెచ్.శ్రీకాంత్, మేరీ ప్రశాంతిలను సభ్యులుగాను, వారితోపాటు ఎక్స్ అఫిషియో సభ్యులుగా సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి అధ్యక్షుడిగాను, డైరెక్టర్ కార్యదర్శిగాను, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి స్టడీ సర్కిల్‌కు డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

రవాణా అధికారి అవతారం ఎత్తిన స్పీకర్!



రోడ్డుపై నిలిచిపోయిన లారీలు



అధిక లోడుతో ఉన్న లారీలను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

» ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలను ఆపి.. బిల్లులను పరిశీలించిన అయ్యన్నపాత్రుడు

» ఆయన ఆదేశాలతో ఏడు లారీలు సీజ్

మాకవరపాలెం(అనకాపల్లి జిల్లా), జూలై 29 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం రవాణా శాఖ అధికారి అవతారం ఎత్తారు. విశాఖపట్నంలోని గంగవరం పోర్టు నుంచి తన నియోజకవర్గం నర్సీపట్నంలోని మాకవరపాలెం మండలంలో గల పయనీర్ కంపెనీకి ఓవర్ లోడుతో వెళ్తున్న టిప్పర్లను ఆపి, బిల్లులు పరిశీలించారు. టిప్పర్ల వల్ల రోడ్లు, తాళ్లపాలెం వంతెన దెబ్బతింటున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ గతంలో సంబంధిత శాఖ అధికారులను పలుమార్లు ఆదేశించారు. ఆర్అండ్‌బీ, రవాణా శాఖ, ఆర్డీవో అధికారులు దీనిపై చర్యలు తీసుకోకపోవడంతో స్వయంగా ఆయనే రంగంలోకి దిగారు. మాకవరపాలెం మండలం రాజుపేట సమీపంలో రోడ్డుపై నిల్చొని.. అధిక లోడుతో వస్తున్న టిప్పర్లను ఆపి బిల్లులు పరిశీలించారు. ఈ క్రమంలో పయనీర్ కంపెనీకి ముడిసరుకుతో వెళ్తున్న సుమారు 50 లారీలు నిలిచిపోయాయి. విషయం తెలిసి పోలీసులు, పలు శాఖల అధికారులు అక్కడకు చేరుకున్నారు. అధిక లోడుతో వస్తున్న టిప్పర్ల కారణంగా తాళ్లపాలెం వంతెన కూలిపోయే ప్రమాదం ఉందని స్పీకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలను స్వాధీనం చేసుకోవాలని పోలీసులను ఆదేశించారు. మాకవరపాలెం పోలీసులు 7 లారీలను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. అధికారుల అలసత్వం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి కనిపించడంతో సమస్యను పరిష్కరించేందుకు తానే స్వయంగా రావాల్సి వచ్చిందని అయ్యన్న అన్నారు. ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని, స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలో వైసీపీ రాజ్యం

» టీడీపీ కార్యకర్తపై దొంగతనం నేరం మోపిన వైసీపీ సర్పంచ్

» నవీన్‌కు పోలీసుల చిత్రహింసలు

» అవమాన భారంతో ఆత్మహత్య

» శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన



నవీన్, సర్పంచ్ సుగుణమ్మ, ఎస్ఐ నరసింహుడు (ఫైల్)

కదిరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్పంచ్ చేసిన ఫిర్యాదు ఆధారంగా, దొంగతనం చేసినట్లు ఒప్పుకోవాలని పోలీసులు హింసించడంతో శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం, రాజనోళ్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త నవీన్(23) ఆత్మహత్య చేసుకున్నాడు. టీటీడీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నవీన్ సోమవారం బైక్‌పై వెళ్తున్న సమయంలో గ్రామ సర్పంచ్, వైసీపీ నాయకురాలు సుగుణమ్మ కనిపించడంతో పలకరించాడు. ఆ తర్వాత ఏం జరిగిందోగాని, నవీన్‌ను అక్కడే నిలబెట్టిన ఆమె.. దొంగతనం నేరం అంటగట్టారు. తనపై దాడి చేసి, మెడలో ఉన్న చైన్‌ను లాక్కున్నాడని సుగుణమ్మ ఆరోపించారు. నవీన్‌పై ఫిర్యాదు రావడంతో ఎస్ఐ నరసింహుడు స్టేషన్‌కు తీసుకెళ్లి చితకబాదారు. చిత్రహింసలు పెట్టారు. తనకు జరిగిన అన్యాయం గురించి నవీన్ కుటుంబ సభ్యులకు చెప్పి కన్నీరు పెట్టుకున్నాడు. మరోసారి పోలీసులు పిలవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన నవీన్.. సెల్ఫీ వీడియోలో జరిగిందంతా చెప్పి.. ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ సమీపంలోని చింతచెట్టుకు మంగళవారం ఉరి వేసుకున్నాడు. నవీన్‌కు భార్య రూప, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు.

వైసీపీ నేతల ప్రోద్బలంతోనే!

వైసీపీ నాయకుల ప్రోద్బలంతోనే నవీన్‌ను ఎస్ఐ నరసింహుడు చితకబాదారని బాధిత కుటుంబం ఆరోపించింది. మరుసటి రోజు రావాలని చెప్పి పోలీసులు వదిలిపెట్టడంతో సోమవారం రాత్రి 9.30 గంటలకు నవీన్ ఇంటికి చేరుకున్నాడని, మరోసారి స్టేషన్‌కు వెళ్లాలని, ఆధార్ కార్డు తీసి ఉంచమని భార్యకు చెప్పి.. మంగళవారం ఉదయం బయటకు వెళ్లిపోయాడని తెలిపారు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఊరంతా గాలించగా, గ్రామ సమీపంలోని ఓ చింతచెట్టుకు నవీన్ ఉరి వేసుకుని కనిపించాడన్నారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మృతదేహంతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. అనంతరం మృతదేహాన్ని తీసుకువెళ్లి సర్పంచ్ సుగుణమ్మ ఇంటిముందు బైఠాయించారు. పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. నవీన్ భార్య ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశామని సీఐ నాగేంద్ర తెలిపారు. సర్పంచ్ సుగుణమ్మ, ఆమె కుటుంబ సభ్యులు రాజనాల సుబ్బారెడ్డి, రఘునాథ రెడ్డి, వాసుదేవరెడ్డి, గంగులమ్మ, చందు, విశ్వనాథరెడ్డిపై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేశామన్నారు. మరోవైపు నవీన్ ఆత్మహత్యకు రాజకీయాలే కారణమని బంధువులు చెబుతున్నారు. గత ఎన్నికలలో టీడీపీ మద్దతుతో నవీన్ తల్లి ప్రమీల సర్పంచ్‌గా పోటీ చేశారు. నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని ప్రమీలపై సుగుణమ్మ ఒత్తిడి తెచ్చారు. అప్పటి నుంచి సుగుణమ్మ కుటుంబం కక్ష పెంచుకుందని అంటున్నారు.

జైల్లో మిథున్‌రెడ్డికి వైద్యపరీక్షలు

» 2డీ ఎకో మెషీన్‌ను వెంట తీసుకెళ్లిన వైద్యులు!

» వివరాలు చెప్పలేమని వెల్లడి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాం కేసులో రిమాండ్‌పై రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి మంగళవారం రాజమహేంద్రవరం జీజీహెచ్ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్న సమయంలో సెంట్రల్ జైలు అధికారుల పిలుపుతో ఆర్ఎంవో డాక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో ముగ్గురు వైద్యులతో కూడిన జనరల్ ఫిజీషియన్ల బృందం మిథున్‌రెడ్డి వద్దకు వెళ్లింది. వీరి వెంట జీజీహెచ్ అంబులెన్సులో గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించే 2డీ ఎకో మెషీన్, సంబంధిత టెక్నీషియన్, ఇతర సహాయకులు వెళ్లారు. అయితే జైలు అధికారులు ప్రభుత్వ వైద్యులతో పాటు 2డీ ఎకో టెక్నీషియన్ ఒక్కరిని మాత్రమే మిథున్‌రెడ్డి ఉన్న బ్యారక్‌లోకి అనుమతించినట్లు సమాచారం. మధ్యాహ్నం 12 గంటల సమయంలో జైలు అధికారి ఒకరు జీజీహెచ్‌కు వచ్చి సూపరింటెండెంట్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. జైలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిథున్‌రెడ్డికి వైద్యపరీక్షల కోసం వైద్యుల బృందాన్ని పంపాలని ఆయన కోరినట్లు తెలిసింది. 2డీ ఎకో మెషీన్‌ను ఎందుకు తీసుకెళ్లారని జీజీహెచ్ వైద్యాధికారులను అడుగగా.. ఎలాంటి వైద్యపరీక్షలు నిర్వహించామో చెప్పలేమని, రహస్యంగా ఉంచాల్సిన విషయమని బదులిచ్చారు.

ఎవరీ న్యాయవాది?

» మిథున్‌రెడ్డితో ములాఖత్‌కు కోర్టు అనుమతించిన లాయర్లలో ఆయన లేరు

» అయినా ఎంపీ బంధువులతో లోపలకు వెళ్లివస్తున్న వైనం



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ములాఖత్‌కు వెళ్లి వస్తున్న మిథున్‌రెడ్డి తల్లి, చెల్లితో న్యాయవాది హుస్సేన్

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు అధికారుల వైఖరి వివాదాస్పదమవుతోంది. లిక్కర్ స్కాంలో ఏ-4గా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని జైల్లో కలిసి చర్చించడానికి విజయవాడ ఏసీబీ కోర్టు నలుగురు న్యాయవాదులకు అనుమతిచ్చింది. టి.నాగార్జునరెడ్డి, చంద్రగిరి విష్ణువర్ధన్, పి.నిర్మల్ రాజేశ్‌బాబు, ఎం.మనోహర్‌రెడ్డి అనే న్యాయవాదుల్లో ఎవరో ఇద్దరు వారానికి 5 సార్లు మిథున్‌రెడ్డితో చర్చించవచ్చు. అయితే వారు కాకుండా మిథున్‌రెడ్డితో ములాఖత్‌కు వస్తున్న బంధువులతో హుస్సేన్ అనే న్యాయవాది లోపలకు వెళ్లి వస్తున్నారు. సోమవారం ఎంపీ తల్లి, చెల్లి, బావ ములాఖత్‌కు రాగా వారితో పాటు ఆయనా లోపలకు వెళ్లడం గమనార్హం. అదీగాక ములాఖత్‌కు ముగ్గురికే అనుమతి ఉంది. ముగ్గురు కుటుంబ సభ్యులతోపాటు ఓ సహాయకుడు, ఈ న్యాయవాది కూడా వెళ్తున్నారు. జైలు అధికారులు ఎలా అనుమతిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

నుదుట బొట్టు.. తెల్ల గడ్డం

వైసీపీ పీఏసీ భేటీలో జగన్ ఆహార్యం



» ప్రభుత్వ వేధింపులపై ఫిర్యాదులకు యాప్

» వివరాలు అప్‌లోడ్ చేయాలని పార్టీ శ్రేణులకు మాజీ సీఎం సూచన

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): నుదుట సింధూరం బొట్టు.. తెల్లబడిన గడ్డంతో మాజీ సీఎం జగన్ కనిపించారు. మంగళవారం జరిగిన వైసీపీ పీఏసీ సమావేశం దీనికి వేదికైంది. సహజంగా పురోహితులు తలపై అక్షింతలు వేస్తే వెంటనే దులిపేసుకుంటారు. బొట్టు పెడితే తుడిపేస్తారు. అలాంటిది పీఏసీ భేటీకి ముందు పురోహితుడు తనకు పెట్టిన సిందూరాన్ని అలాగే ఉంచుకుని సమావేశానికి రావడం వైసీపీ నేతలకూ ఆశ్చర్యం కలిగించింది. అలాగే ఎప్పుడూ నల్లని గడ్డం.. నల్లని జుత్తుతో కనిపించే జగన్.. మంగళవారం తెల్ల గడ్డంతో కనిపించడం ఆసక్తి రేపింది. ఇక ఈ సమావేశంలో ఆయన యథావిధిగా రాష్ట్రంలోని శాంతిభద్రతలు లేవని ధ్వజమెత్తారు. వైసీపీ శ్రేణులపై దాడులు పెరిగిపోతున్నాయని.. ప్రభుత్వం, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ కార్యకర్తలపై దాడులు చేసినా.. అకారణంగా పోలీసు కేసులు పెట్టినా.. పార్టీ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని జగన్ సూచించారు.

గ్రామాల్లో బీజేపీ జెండా ఎగరాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

» దేశాన్ని సమున్నతంగా నిలపడానికి ప్రధాని మోదీ అవిశ్రాంత కృషి

» పంచాయతీ నిధులను దారి మళ్లించిన వైసీపీ ప్రభుత్వం

» రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేస్తాం: మాధవ్

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాబోవు ఎన్నికల్లో బీజేపీ జెండాను ప్రతి గ్రామంలో ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కర్నూలు జిల్లాలో పర్యటించారు. ముందుగా నగరంలోని ఓ హోటల్‌లో ముఖ్య కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. 'దేశంలో బీజేపీ శక్తి అపారమైంది. ప్రపంచంలోనే ఎవరూ సాధించలేని ప్రగతి భారతీయ జనతా పార్టీ సాధించింది. మాజీ ప్రధాని వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ అతి నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రధానమంత్రులు అయ్యారు. కుటుంబ నేపథ్యం, డబ్బు, అధికారం... ఏదీ లేకుండానే ఉన్నత స్థాయికి ఎదగడం బీజేపీలోనే సాధ్యమవుతుంది. వివిధ దేశాల్లోని భారతీయ మూలాలు ఉన్న వారు సగర్వంగా తల ఎత్తుకునేలా ప్రధాని నరేంద్ర మోదీ చేశారు. 2014 సంవత్సరం కంటే ముందు ఆర్థికంగా భారత్ 11వ స్థానంలో ఉంది. ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ అయ్యాక నాల్గవ స్థానానికి చేరింది. త్వరలో 3వ స్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని విశేషంగా కృషి చేస్తున్నారు. మేక్ ఇన్ ఇండియాతో వివిధ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి దేశం చేరింది. మన దేశంపై ఉగ్రదాడి చేసిన పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టించడం మోదీకి మాత్రమే సాధ్యమయింది. రాష్ట్రంలో గత ప్రభుత్వం పంచాయతీ నిధులను దారి మళ్లించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక నేరుగా పంచాయతీలకు నిధులు సమకూర్చింది. రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేస్తాం. నీటి ప్రాజెక్టుల పూర్తికి, పరిశ్రమల స్థాపనకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పక్క రాష్ట్రంతో ఉన్న చిక్కు ముడులను పరిష్కరించి, మనకు రావాల్సిన నీటి వాటాను సాధించేందుకు బీజేపీ కృషి చేస్తుంది. కూటమి అధిష్ఠానంతో చర్చించి స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు, నామినేటెడ్ పదవుల్లో బీజేపీకి రావాల్సిన వాటాను సాధిస్తాం' అని మాధవ్ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు అక్కంతోట రామకృష్ణ, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కాలేజీలపై కుళ్లు రాతలు!

(మొదటి పేజీ తరువాయి)

ఫస్టియర్ చదివిన 71 వేల మందికిపైగా విద్యార్థులు ఈ ఏడాది సెకెండియర్‌కు వచ్చారు. దీంతో మొత్తం విద్యార్థుల సంఖ్య 1,46,332కు చేరింది. వైసీపీ ప్రభుత్వంలోని చివరి ఏడాదితో పోల్చినా, గతేడాదితో పోల్చినా విద్యార్థుల సంఖ్య పెరిగింది. జిల్లాల వారీగా చూసినా ఫస్టియర్ అడ్మిషన్లు పెరిగాయి. జగన్ సొంత జిల్లా కడపలోనూ విద్యార్థుల సంఖ్య పెరిగింది. 2023-24లో కడపలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 2,201 మంది విద్యార్థులు చేరితే, ఈ ఏడాది 2,783 మంది చేరారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గతేడాది 3,317 మంది చేరితే, ఈ సంవత్సరం 3,517 మంది చేరారు. అనకాపల్లిలో 2,962 నుంచి 3,292కు, కోనసీమలో 1,372 నుంచి 1,629కి, ఏలూరులో 1,993 నుంచి 2,197కి, కాకినాడలో 3,344 నుంచి 3,727కి, కృష్ణాలో 1,089 నుంచి 1,108కి, కర్నూలులో 4,066 నుంచి 6,014కు, నంద్యాలలో 3,206 నుంచి 3,423కు, ఎన్టీఆర్‌లో 1,380 నుంచి 1,839కి, ప్రకాశంలో 2,288 నుంచి 2,583కు, శ్రీకాకుళంలో 5,985 నుంచి 6,157కు, విశాఖలో 2,694 నుంచి 2,869కి, పశ్చిమగోదావరిలో 1,463 నుంచి 1,589కి అడ్మిషన్ల సంఖ్య పెరిగింది.

ప్రైవేటుపైనే పెద్ద దెబ్బ

ఈ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణత శాతం ఇంటర్ ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపింది. 2024లో 86.69శాతం ఉత్తీర్ణత నమోదుకాగా, 2025లో 81.14శాతంకు తగ్గింది. దీంతో సుమారు 35 వేల మంది విద్యార్థులు తగ్గారు. ఆ ఫలితం ఇంటర్మీడియట్ విద్యపై పడింది. ప్రైవేటు కాలేజీల్లో గతేడాది 4,15,795 మంది చేరితే ఈ సంవత్సరం 3,92,009 మంది చేరారు. ప్రైవేటు కాలేజీల్లో 23,786 అడ్మిషన్లు తగ్గిపోయాయి. కాగా, అడ్మిషన్ల గడువును ఆగస్టు 11 వరకు ఇంటర్ బోర్డు పొడిగించింది. ఇటీవల పాలిటెక్నిక్ తుది విడత కౌన్సెలింగ్ పూర్తయింది. డిప్లొమాలో సీటు పొందిన ఎవరైనా చేరేందుకు ఆసక్తి చూపకపోతే అలాంటి వారికి ఇంటర్‌లో అవకాశం కల్పించేందుకు ఈ మేరకు గడువు పొడిగించింది.

రోత పత్రిక వర్సెస్ బోర్డు

విద్యార్థుల సంఖ్య పెరిగిన కాలేజీల్లో కూడా తగ్గినట్టుగా జగన్ రోత పత్రిక అసత్యాలు రాసిందని ఇంటర్ బోర్డు తెలిపింది. ఈ మేరకు వివరాలు వెల్లడించింది.

- విద్యార్థుల సంఖ్య డబుల్ డిజిట్ దాటని కాలేజీలు 200కుపైనే ఉన్నాయని రాయగా, అలాంటి కాలేజీలు 47 మాత్రమే ఉన్నాయని బోర్డు తెలిపింది. కర్నూలు జిల్లా, దేవరకొండ ప్రభుత్వ కాలేజీలో 82 మంది విద్యార్థులలే ఉన్నారని పత్రిక రాయగా.. 155 మంది ఉన్నారని బోర్డు పేర్కొంది. ఎమ్మిగనూరులో 450 మంది విద్యార్థులుంటే 182 మంది మాత్రమే ఉన్నట్లు అసత్య ప్రచారం చేసింది.
- తిరుపతి జిల్లా చంద్రగిరి బాలికల కాలేజీలో 380 మంది చేరితే 285 మంది మాత్రమే చేరినట్లుగా విషం చిమ్మింది.
- నెల్లూరు జిల్లాలో కేపీసీలో కాలేజీలో 300 మంది చేరితే 250 మంది చేరినట్టు, ఆత్మకూరులో 216 మందికి 134 అని, కందుకూరులో 239 మందికి 131 అని, కోవూరులో 152 మందికి 109 మంది అని, ఉదయగిరిలో 166 మందికి 100 మంది మాత్రమే ఉన్నారని రోత పత్రిక రాయడాన్ని బోర్డు తీవ్రంగా తప్పుబట్టింది.

రాష్ట్రమంతా ఉచిత ప్రయాణం

» మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, సిటీ సర్వీసుల్లో అవకాశం

» మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడి

తిరుపతి(ఆర్టీసీ), జూలై 29(ఆంధ్రజ్యోతి): 'ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కింద మహిళలు రాష్ట్రమంతటా.. ఎక్కడి నుంచి ఎక్కడికైనా తిరగొచ్చు. దీనిపై ఎలాంటి పరిమితి లేదు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, సిటీ సర్వీసుల్లో మాత్రమే ఉచిత ప్రయాణం చేయొచ్చు' అని రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మంగళవారం తిరుపతిలోని సంస్కృత విద్యాపీఠం కాన్ఫరెన్స్ హాల్లో రాయలసీమ జోన్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పథకం అమలుపై డీపీటీవోలు, సీటీఎంలు, సీఎంఈలు, డిపో మేనేజర్లకు దిశానిర్దేశం చేశారు. దీనికి సంబంధించి త్వరలోనే తుది మార్గదర్శకాలు వెలువరిస్తామని చెప్పారు. అనంతరం మంత్రి, ఆర్టీసీ ఎండీ మీడియాతో మాట్లాడారు. ఈ పథకం అమలుతో ప్రస్తుతం బస్సుల్లో తిరుగుతున్న మహిళల సంఖ్య 35శాతం నుంచి సుమారు 60శాతానికి పెరగవచ్చని అంచనా వేశామని వివరించారు. రద్దీకి తగ్గట్లు బస్సుల నిర్వహణ, కండిషన్‌ను మరింత మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని, ట్రిప్పుల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించామని అన్నారు. త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని, ఇవి కాకుండా దాదాపు 1,500 బస్సులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. సిబ్బంది కొరతను అధిగమించే మార్గాలు చూడాలని, బస్సు కండిషన్‌లో ఉంటేనే రోడ్డెక్కించాలని స్పష్టంగా చెప్పామన్నారు. అందరూ సమన్వయం చేసుకొని పథకం అమలుకు సహకరించాలని కోరారు. తిరుమల ఘాట్ విషయంలో ప్రభుత్వం త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటుందని, ఇందులో తాము కల్పించుకోలేమని మంత్రి, ఈడీ చెప్పారు. సమావేశంలో ఆర్టీసీ ఈడీలు ఎ.అప్పలరాజు, చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, జగదీష్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాకు జగన్ ఎగనామం

(మొదటి పేజీ తరువాయి)

పంటల బీమా అమలుపై వివరణ ఇచ్చారు. కొన్నిసార్లు రాష్ట్రాలు తమ వాటా ఇవ్వడం లేదని, ఇంకొన్నిసార్లు ఆలస్యం చేస్తున్నాయని తెలిపారు. ఏపీలో జగన్ అధికారంలో ఉన్నప్పుడు మూడేళ్లపాటు రైతులకు ఫసల్ బీమా యోజన సొమ్ము ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారని చెప్పారు. ఇకపై రాష్ట్ర వాటా ఇచ్చినా ఇవ్వకపోయినా కేంద్ర ప్రభుత్వం తన వాటాను జమ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వడంలో ఆలస్యం చేస్తే, దానిపై 12 శాతం వడ్డీ వసూలు చేసి రైతుల ఖాతాలో జమ చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి చెప్పారు. 2019 ఖరీఫ్‌లో జగన్ సర్కార్.. పంటల బీమా కింద రైతులతో ఒక్క రూపాయి ప్రీమియం కట్టించింది. అయితే ఆ ఏడాది రబీ సీజన్‌లో ఈ పథకాన్ని జగన్ సర్కార్ వినియోగించుకోలేదు. అలాగే 2020, 2021లో రెండు సీజన్లలోనూ అసలు బీమా యోజన పథకాన్నే వినియోగించుకోలేదు. ఉచిత పంటల బీమా అంటూ కేవలం ఖరీఫ్ సీజన్లలో మాత్రమే పరిహారాన్ని అందించింది. 2022లోనూ ఖరీఫ్‌లో మాత్రమే పంటల బీమా అమలు చేశారు. మళ్లీ 2022-2023 రబీ, 2023 ఖరీఫ్, 2023-24 రబీలో ఉచిత పంటల బీమా ఊసే ఎత్తలేదు. దీంతో మూడు పంటల బీమా సొమ్ము రైతులకు సెటిల్ కాలేదు. ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం 2024 ఖరీఫ్‌లో.. అప్పటికి అమలులో ఉన్న ఉచిత బీమానే వర్తింపజేస్తామని ప్రకటించింది. తర్వాత పంటల బీమాపై కమిటీ వేసి 2024-25 రబీ సీజన్‌కు రైతులు తమ వాటా ప్రీమియం చెల్లిస్తే.. బీమా అమలు చేస్తామని ప్రకటించింది.

2030 నాటికి వంద శాతం జీఈఆర్

» ఎన్ఈపీ సదస్సులో సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు



అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2030 నాటికి వంద శాతం స్థూల నమోదు నిష్పత్తి(జీఈఆర్) సాధిస్తామని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. ప్రస్తుతం జీఈఆర్ 97 శాతంగా ఉందని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ఐదో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) ద్వారా పాఠశాలల్లో విద్యా స్వరూపాన్ని మారుస్తున్నామన్నారు. వంద శాతం జీఈఆర్ సాధించేందుకు సెకండరీ గ్రేడ్ విద్యను పునర్వ్యవస్థీకరిస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకంతో పాటు పీఎంశ్రీ, పీఎం పోషణ్, క్వాలిటీ ఇనిషియేటివ్, సెల్ఫ్ డిఫెన్స్, వృత్తి విద్య, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర, మెగా పీటీఎం, బాలికా రక్ష, పాల్ కార్యక్రమాలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇటీవల మెగా పీటీఎం గిన్నిస్ రికార్డు సాధించిందని పేర్కొన్నారు.



సింగపూర్ మాజీ ప్రధాని, ప్రస్తుత మంత్రి లీ సైన్ లూంగ్‌ను కలిసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగ రత్నంతో సీఎం చంద్రబాబు



గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ సీఈవో బ్రాన్ యేతో సీఎం చంద్రబాబు, మంత్రులు నారాయణ, టీజీ భరత్



విల్మర్ ఇంటర్నేషనల్ సంస్థ అధిపతి రాహుల్ కలేతో భేటీ అయిన సీఎం చంద్రబాబు



సింగపూర్‌లో ప్రభుత్వ సంస్థల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన లోకేశ్

ఏపీ, అమరావతి అభివృద్ధిలో భాగస్వామిగా ఉంటాం

2019లో ప్రభుత్వం మారాక సహకారం ఆగిపోయింది

- చంద్రబాబుతో చర్చించాక కొనసాగించాలని నిర్ణయించాం
- సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్ ప్రకటన

అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉంటుందని సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి టాన్ సీ లెంగ్ ప్రకటించారు. 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారాక సహకారం ఆగిపోయిందని మంగళవారం 'ఎక్స్'లో తెలిపారు. ఇప్పుడు రాష్ట్రంతో వివిధ రంగా ల్లో కలసి పనిచేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. తాను పర్యటిస్తున్న సమయంలో.. గత జగన్ ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ ఆయన చేసిన ప్రకటనపై చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. చంద్రబాబుతో సంభాషణను లెంగ్ తన ట్వీట్‌లో ప్రస్తావించారు. 2019లో ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత సింగపూర్-అమరావతి మధ్య సహకారం ఆగింది. చంద్రబాబుతో చర్చించాక సహకారం కొనసాగించాలని నిర్ణయించాం' అని తెలిపారు.



అవకాశాల గని ఏపీ.. మీకిదే ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసే ప్రణాళికల్లో భాగంగా పోర్టుల నిర్మాణం, పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం వెంబడి ఆరు ఆపరేషనల్ పోర్టులు ఉన్నాయని చెప్పారు. మరో నాలుగు కొత్త పోర్టులు రానున్నాయని తెలిపారు. శ్రీసిటీకి దగ్గరలోనే ఐదు పోర్టులు ఉన్నాయని అన్నారు. లాజిస్టిక్ ఖర్చులు తగ్గించాలని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డ్రైపోర్టు నిర్మాణంపైనా దృష్టి సారించామని చెప్పారు. ఇన్‌లాండ్ వాటర్‌వేస్ ద్వారా కూడా సరుకు రవాణా చేపట్టే ఆలోచనలు చేస్తున్నామని తెలిపారు. టూరిజానికి కూడా పెద్ద పీట వేస్తున్నామన్నారు. కొత్త పోర్టులతో అనేక అవకాశాలు వస్తాయని సీఈవోలు అభిప్రాయపడ్డారు.

డేటా, ఐటీ కంపెనీలకు ఏపీ అనువు

డేటా సెంటర్లు, ఐటీ కంపెనీల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ అనువుగా ఉంటుందని సీఎం సింగపూర్ పారిశ్రామికవేత్తలతో జరిగిన రౌంట్‌టేబుల్ భేటీలో అన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ అత్యుత్తమ ప్రదేశమని చెప్పారు. ఇప్పటికే గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ సహా పలు ఐటీ కంపెనీలు విశాఖకు వస్తున్నాయని తెలిపారు. అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్‌వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్వాంటమ్ వ్యాలీ ఎకో సిస్టమ్‌లో సింగపూర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఆప్రాజెక్టు నుంచి ప్రయోజనాలు పొందడంతోపాటు పరిశోధనలు కూడా చేయొచ్చన్నారు.

జురాంగ్ ఐలండ్‌లో మౌలిక వసతులపై ఆరా

కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నాలను కలుపుతూ లాజిస్టిక్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. కృష్ణపట్నం సమీపాన ప్రపంచ శ్రేణి చమురు రిఫైనరీ ఏర్పాటు కానుందని తెలిపారు. జురాంగ్ ఐలండ్‌లో సింగపూర్ సృష్టించిన సమీకృత పారిశ్రామిక ప్రాజెక్టు సహా ఇతర మౌలిక సదుపాయాలను ముఖ్యమంత్రి బృందం పరిశీలించింది. సముద్రాన్ని పూడ్చి నిర్మించిన దీవి సందర్శనకు వచ్చిన ఈ బృందానికి సుర్బానా జురాంగ్ డిప్యూటీ డైరెక్టర్ టియో ఎంగ్ కియాటీ స్వాగతం పలికారు. మొబిలిటీ మోడల్స్, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలు, ముడిచమురు ప్రాసెసింగ్ ప్రక్రియ, ఇతర అత్యుత్తమ పాలిమర్లు, ఇంధనాలు, స్పెషాలిటీ కెమికల్స్ గురించి సీఎం బృందానికి ఆయన వివరించారు. మొత్తం 32 చదరపు కిలోమీటర్ల మేర సముద్రాన్ని పూడ్చి, భూభాగంగా మార్చి అంతర్జాతీయ ప్రమాణాలతో పెట్రో కెమికల్ హబ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టామని వివరించారు. ఈ భారీ ప్రాజెక్టులో వ్యర్థాల నిర్వహణతో పాటు భద్రతా వ్యవస్థనూ ఏర్పాటు చేశామన్నారు.

ఏపీ అభివృద్ధిలో భాగస్వాములవ్వండి

- రస్సెల్ కార్పొరేషన్‌కు సీఎం చంద్రబాబు ఆహ్వానం
- జీఐసీ, విల్మర్, ఏఐ సింగపూర్, ఎస్‌ఐఏ ప్రతినిధులతో సింగపూర్‌లో ముఖ్యమంత్రి భేటీ

అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని నగరాభివృద్ధి, వాణిజ్య సదుపాయాలకల్పన రంగంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన రస్సెల్ కార్పొరేషన్ సంస్థకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానం పలికారు. సింగపూర్ పర్యటనలో భాగంగా మూడోరోజైన మంగళవారం పలు ప్రఖ్యాత దిగ్గజ కంపెనీల ప్రతినిధులను కలసి పెట్టుబడులపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రస్సెల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిమ్ యాంగ్ వియ్‌తో సీఎం సమావేశమయ్యారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వాణిజ్యం, గృహ నిర్మాణ రంగాల్లో ప్రాజెక్టుల అభివృద్ధికి రాష్ట్రానికి రావాలని ఆహ్వానించారు. వైజాగ్‌ను రాష్ట్రంలో ప్రధాన వాణిజ్య నగరంగా అభివృద్ధి చేస్తున్నామని, రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజన్‌గా ఆ నగరం ఉంటుందని చెప్పారు. అమరావతి నగర అభివృద్ధిలో రస్సెల్ సంస్థ భాగస్వామ్యంపైనా చర్చించారు.

జీఐసీతో దీర్ఘకాలిక భాగస్వామ్యమే లక్ష్యం

అమరావతి అభివృద్ధి, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, పరిశ్రమల రంగం అభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ (జీఐసీ) సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ టాన్‌యోతో భేటీ సందర్భంగా సీఎం చర్చించారు. ఆయా రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జీఐసీతో దీర్ఘకాలిక భాగస్వామ్యం కోరుకుంటున్నామని చెప్పారు. స్థిరమైన పెట్టుబడులపై ప్రణాళికలు రూపకల్పన చేయాలని కోరారు. వైద్య, విద్య, పట్టణ ప్రణాళిక, సౌర విద్యుత్ వంటి పెట్టుబడులకు తగిన మౌలికవసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఏఐ రీసెర్చ్, ఇన్నోవేషన్ సెంటర్ల స్థాపనకు సహకరించండి


ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి సహకరించాలని ఏఐ సింగపూర్‌ను సీఎం కోరారు. ఆ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మోహన్ కంకణహళ్లితో చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏఐ పరిశోధన, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు సహకారం అందించాలన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో ఏఐ సింగపూర్ భాగస్వామ్యం కావడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్ర విద్యార్థులకు ఏఐ శిక్షణ కార్యక్రమాలు, ఎక్స్ఛేంజీ ప్రోగ్రామ్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్ మాడ్యూల్స్ అమలు చేయాలని ప్రతిపాదించారు. ఎస్‌ఐఏ ఇంజనీరింగ్ కంపెనీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఎన్‌జీ జాన్ లిన్ విలిన్‌తోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల నిర్మాణం, అభివృద్ధి ప్రణాళికలను సీఎం వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన పారిశ్రామిక అనుకూల పాలసీ గురించి తెలిపారు. విమానాశ్రయాల్లో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. ఏపీలో ఉన్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎస్‌ఐఏను సీఎం కోరారు. దీనికి ఎస్‌ఐఏ సానుకూలంగా స్పందించింది. త్వరలోనే ఏపీకి వస్తామని లిన్ విలిన్ తెలిపారు.

రైతులకు సహకరించండి

విల్మార్ ఇంటర్నేషనల్ సంస్థ గ్రూప్ హెడ్ రాహుల్‌కలేతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫుడ్ ప్రాసెసింగ్, ఎడిబుల్ ఆయిల్స్, అగ్రి ఇన్‌ఫ్రా వంటి రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. రైతులకు విలువ ఆధారిత మార్కెట్‌ను కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో సహకరించాలన్న చంద్రబాబు ప్రతిపాదనపై విల్మార్ సంస్థ ఆసక్తి ప్రదర్శించింది.



ఏఐ సింగపూర్ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మోహన్ కంకణవల్లితో భేటీ అయిన సీఎం చంద్రబాబు





సింగపూర్‌లోని జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

విశాఖలో 'భాగస్వామ్య సదస్సు'కు కమిటీలు

- మంత్రి లోకేశ్ ఛైర్మన్‌గా స్టీరింగ్ కమిటీ ఏర్పాటు
- సీనియర్ అధికారులతో మరో 9 కమిటీలు

అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్యాలను చేరుకునే క్రమంలో.. రాష్ట్ర పారిశ్రామిక ముఖ చిత్రాన్ని మార్చడమే లక్ష్యంగా కూటమి సర్కారు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే విశాఖపట్నం వేదికగా నవంబరు 14, 15వ తేదీల్లో భాగస్వామ్య సదస్సు-2025ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ సదస్సుకోసం వివిధ కమిటీలను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆరుగురు మంత్రులతో ఏర్పాటుచేసిన స్టీరింగ్ కమిటీకి మంత్రి లోకేశ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈ స్టీరింగ్ కమిటీలో మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేశ్, నారాయణ, కొండపల్లి శ్రీనివాస్ సభ్యులుగా ఉంటారు. సదస్సు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించడానికి సీనియర్ అధికారులతో మరో 9 కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన వర్కింగ్ కమిటీ, జీఏడీలో ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) అధ్యక్షతన ప్రొటోకాల్, రిసెప్షన్, వసతి, ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ కమిటీ, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన సెక్యూరిటీ అండ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కమిటీ, పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన సిటీ బ్యూటిఫికేషన్ కమిటీ, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన కల్చరల్ కమిటీ, సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ అధ్యక్షతన మీడియా అండ్ పబ్లిసిటీ కమిటీ, గనులు, భూగర్భ శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఎగ్జిబిషన్ కమిటీ, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ, మరో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన బిజినెస్ అలయెన్స్/డెవలప్‌మెంట్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీల్లో సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, పలువురు సీనియర్ అధికారులను సభ్యులుగా నియమించారు.

25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు: మనోహర్

అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఆగస్టు 25 నుంచి 31 వరకు చేపడతామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన ఈ స్మార్ట్ కార్డులను రాష్ట్రవ్యాప్తంగా 1,45,97,486 మంది లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయిలో మంత్రులు, రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి నేతృత్వంలో సభలు ఏర్పాటు చేసి స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గతంలో మాదిరిగా వీటిపై రాజకీయ నాయకుల ఫొటోలు ఉండవని, బ్యాంకు డెబిట్ కార్డు (ఏటీఎం)ల తరహాలో ఉండే ఈ కార్డులపై కుటుంబ పెద్ద ఫొటోతోపాటు సభ్యుల పేర్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. భద్రత, జవాబుదారీతనం, పారదర్శకతతో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టరుతో దీన్ని అనుసంధానం చేశామని వివరించారు. ప్రస్తుతమున్న రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు 16,08,612 దరఖాస్తులు రాగా.. వాటిలో 15,32,758 దరఖాస్తులను పరిష్కరించామని, 4.72 శాతం దరఖాస్తులను మాత్రమే వివిధ కారణాలతో తిరస్కరించామని వెల్లడించారు. కొత్త సభ్యులతో కలిపి రాష్ట్రంలో లబ్ధిదారుల సంఖ్య 4,29,79,897కు చేరిందన్నారు. గతేడాది నవంబరులో దీపావళి రోజు ప్రారంభించిన దీపం-2 పథకం కింద లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతుందని మంత్రి మనోహర్ చెప్పారు.

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు

ఉచిత గ్యాస్ సిలిండర్ల రాయితీ సొమ్మును ఇక నుంచి ముందుగానే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమచేసే ప్రక్రియను ప్రారంభించేందుకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు అమలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ జిల్లాల్లో 4,281 మంది లబ్ధిదారులను గుర్తించి, వారి స్మార్ట్ ఫోన్ నుంచే గ్యాస్ ఏజెన్సీలకు చెల్లింపు జరిగే విధంగా పంజాబ్ నేషనల్ బ్యాంకు డిజిటల్ వాలెట్ విధానాన్ని అమలు చేసినట్లు వివరించారు.

ఆసియా మార్కెట్‌కు.. ఏపీ వ్యూహాత్మక గమ్యస్థానం



ఏపీలో క్రియేటర్ అకాడమీ ఏర్పాటుపై టెజరాక్ట్, యూట్యూబ్ అకాడమీలతో అవగాహన ఒప్పందంపై లోకేశ్ సమక్షంలో సంతకాలు చేస్తున్న దృశ్యం

పారిశ్రామిక ప్రోత్సాహకాలతో పాలసీలు: లోకేశ్

తూర్పున 974 కి.మీ. సుదీర్ఘ తీరం

అంతర్జాతీయ మార్కెట్‌కు కనెక్టివిటీ

బిజినెస్ రౌండ్ టేబుల్ భేటీలో లోకేశ్ వెల్లడి

అమరావతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో తమ కార్యకలాపాలను విస్తరించి.. తద్వారా అఖండ ఆసియా మార్కెట్‌లో వేళ్లూనుకోవాలని చూస్తున్న సంస్థలకు ఆంధ్రప్రదేశ్ మార్కెట్ వ్యూహాత్మక గమ్యస్థానమని మంత్రి లోకేశ్ అన్నారు. 'ఐటీ, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్, కృత్రిమ మేధ (ఏఐ), ఫిన్‌టెక్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను శక్తిమంతం చేయడం' అనే అంశంపై మంగళవారం సింగపూర్‌లోని హంగ్రీలా హోటల్‌లో ఏర్పాటు చేసిన బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. టెక్నాలజీ కేవలం పరికరం కాదని.. విజయానికి ప్రాథమిక అవసరమని అభిప్రాయపడ్డారు. 'తూర్పున 974 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరంతో ఏపీ వ్యూహాత్మక వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌కు కనెక్టివిటీ ఉంది. ఓడరేవులు, విమానాశ్రయాలు, హైవేలు, రైల్వేల నెట్‌వర్క్‌తో అనుసంధానమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఐటీ, ఇంజనీరింగ్ తయారీ రంగంలో ప్రతిభావంతమైన సాంకేతిక నైపుణ్యాలను ఏపీ కలిగి ఉంది.

సృజనాత్మక కంటెంట్ తయారీకి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించేందుకు సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు వరుసగా దిగ్గజ పారిశ్రామిక సంస్థలతో సమావేశాలు జరుపుతుంటే.. మరోవైపు ఐటీ మంత్రి లోకేశ్ ఐటీ, డేటా కంపెనీల ఏర్పాటుకు ప్రముఖ సంస్థల యాజమాన్యాలతో అక్కడే సంప్రదింపులు జరుపుతూ అవగాహనా ఒప్పందాలను చేసుకుంటున్నారు. రాష్ట్రంలో క్రియేటర్ అకాడమీ ఏర్పాటు చేసేందుకు మూడో రోజు మంగళవారం రెండు ప్రధాన సంస్థలు టెజరాక్ట్, యూట్యూబ్ అకాడమీతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఆయన సమక్షంలో టెజరాక్ట్ ప్రెసిడెంట్ తేజధర్మ, యూట్యూబ్ అకాడమీ ఇండియా హెడ్ అర్జున్ దొరైస్వామి, ఐటీశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సంతకాలు చేశారు.

కోల్డ్ చెయిన్ లాజిస్టిక్ హబ్ ఏర్పాటు..

కోల్డ్ చెయిన్ లాజిస్టిక్ హబ్ ఏర్పాటుకు తమతో కలసి పనిచేయాలని క్యారియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ్ భాటియాను లోకేశ్ కోరారు. హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండిషనర్ల తయారీ రంగంలో ప్రఖ్యాతిగాంచిన ఈ కంపెనీ ఏపీలో కార్యకలాపాలు చేపట్టాలని ఆహ్వానించారు. క్యారియర్ ఉత్పత్తుల వినియోగం వల్ల వినియోగదారులకు 25 శాతం మేర విద్యుత్ ఖర్చులు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. 'రాష్ట్రంలో గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్‌తో రాబోయే వాణిజ్య, నివాస ప్రాజెక్టుల్లో గ్లోబల్ వార్మింగ్ పొటెన్షియల్ (జీడబ్ల్యూపీ) రిఫ్రిజిరేటర్స్, ఎనర్జీ ఎఫిషియెంట్ సిస్టమ్స్ ఏర్పాటులో క్యారియర్ సహకారం అందించాలి. టైర్-2, టైర్-3 నగరాల్లో వ్యవసాయోత్పత్తులు, ఔషధాలు, ఆహార నిర్వహణ కోసం స్థిరమైన కోల్డ్ చెయిన్ లాజిస్టిక్ హబ్ నిర్మాణానికి మా ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి.' అని సూచించారు. భాటియా మాట్లాడుతూ.. ఉన్నత స్థాయిలో చర్చించి త్వరలోనే సానుకూల నిర్ణయం ప్రకటిస్తామన్నారు.

ఎస్‌టీ టెలిని రప్పించేందుకు..

విశాఖలో గ్రీన్ ఎనర్జీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని 'ఎస్‌టీ టెలిమీడియా ఇన్వెస్ట్‌మెంట్స్' హెడ్ రీతూ మెహ్లావత్‌ను లోకేశ్ కోరారు. కమ్యూనికేషన్స్, మీడియా, డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాల సాంకేతికతలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎస్‌టీ టెలిమీడియాను రాష్ట్రానికి రప్పించాలని ఆయన యోచిస్తున్నారు. భారత్‌లో తన కార్యకలాపాలను రెట్టింపు చేయాలని ఎస్‌టీ కూడా భావిస్తోంది. ఈ నేపథ్యంలో విశాఖలో గ్రీన్ ఎనర్జీ డేటా సెంటర్ ప్రారంభించడం ద్వారా ఉత్తర ప్రదేశ్ తరహా అత్యాధునిక డేటా సెంటర్లు, కంప్యూటింగ్, మౌలిక సదుపాయాల కల్పన, ఆప్టిమైజేషన్ ద్వారా బలమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వంతో కలసి పనిచేయాలని రీతూను ఆయన ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను ఉన్నత స్థాయిలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని రీతూ తెలిపారు.

ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ యూనిట్ పెట్టండి

జపాన్ మూలాలు కలిగి.. సింగపూర్‌లో స్థావరం ఏర్పరచుకున్న మురాటా ఎలక్ట్రానిక్స్ ఎండీ హిరోయికినివాతోనూ లోకేశ్ చర్చలు జరిపారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ యూనిట్‌ను స్థాపించాలని కోరారు. 'ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0లో పరిశ్రమలకు పలు రాయితీలు ప్రకటించాం. దీంతో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు ముందుకొస్తున్నాయి. డైకిన్, లాయిడ్స్, ఎల్జీ వంటి సంస్థలు రాష్ట్రంలో ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేశాయి. మురాటా కూడా అధునాతన ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్ రాష్ట్రంలో నెలకొల్పాలి' అని అభ్యర్థించారు. ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని హిరోయికీనివా హామీ ఇచ్చారు.



గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ డ్రూ బ్రైస్‌తో సమావేశమైన మంత్రి లోకేశ్

చిప్ డిజైనింగ్ సెంటర్ స్థాపించండి

గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ డ్రూ బ్రైస్‌తో లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. విశాఖ డేటా సిటీలో గూగుల్ సెంటర్ ఏర్పాటుకు గతేడాది డిసెంబరు 11న రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుందని గుర్తుచేశారు. ఆ క్యాంపస్‌లో చిప్ డిజైనింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంపై ఆలోచించాలని కోరారు. 'గూగుల్ క్లౌడ్ ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సర్వర్ వినియోగదారుల్లో ప్రధానమైనది. చైనా/తైవాన్‌కు దూరంగా రాష్ట్రంలో చిప్ తయారీ ప్రారంభించడానికి ఏపీ ద్వారా సర్వర్ సప్లయ్ చెయిన్‌కు కనెక్ట్ చేసే అంశాన్ని పరిశీలించండి. గూగుల్ క్లౌడ్ లేదా సర్వర్ సరఫరాదారు దాని మరమ్మతు, నిర్వహణ సేవలను గ్లోబల్ హబ్‌గా మా రాష్ట్రాన్ని ఉపయోగించుకోవచ్చు. బలమైన ఎయిర్ కనెక్టివిటీ, పోర్ట్ కనెక్టివిటీ ఉన్నందున ఇలాంటి సాంకేతిక కార్యకలాపాలకు రాష్ట్రం అనువుగా ఉంటుంది' అని తెలిపారు. లోకేశ్ అభ్యర్థనలపై గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు.



ఎస్టీ టెలీమీడియా (ఇండియా) హెడ్ రీతూ మెహ్లావత్‌తో భేటీ అయిన మంత్రి లోకేశ్



పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి వరద ఉధృతి



మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో శ్రీశైలం డ్యాం నుంచి 8 గేట్ల ద్వారా సాగర్‌కు విడుదలవుతున్న వరద

సంతకాల సాక్షిగా.. దొరికిపోయిన జగన్!?

(మొదటి పేజీ తరువాయి)

నాటి సీఎస్ ఆ మేరకు ఆదేశాలు జారీ చేశారు. 2019 సెప్టెంబరు 16న ఈ జీవో జారీ అయ్యింది. ఇది అంతటితో ఆగలేదు! డిస్టిలరీస్ కమిషనర్ పోస్టు కూడా వాసుదేవ రెడ్డికి కట్టబెడితేనే 'స్కామ్' సాఫీగా సాగుతుందనే ఆలోచనతో... 2019 అక్టోబరు 31న డిస్టిలరీస్ కమషనర్ పోస్టులోనూ ఆయననే కూర్చోబెట్టాలని నాటి సీఎస్‌ను జగన్ ఆదేశించారు. రాష్ట్రానికి వచ్చేముందే వాసుదేవరెడ్డితో చేసుకున్న ఒప్పందం మేరకు.. వైసీపీ ప్రభుత్వం ఉన్నన్ని రోజులూ ఆ రెండు పదవుల్లో ఆయననే కొనసాగించారు. అంతకు ముందు దాకా... ఎక్సైజ్ కమిషనర్‌కే ఏపీఎస్‌బీసీఎల్, డిస్టిలరీస్ కమిషనర్ పోస్టుల్లో ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించేవారు. ఎక్సైజ్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఉంటారు. కానీ... జగన్ ఆ పోస్టుకు ప్రాధాన్యం తగ్గించేసి ఏపీఎస్‌బీసీఎల్, డిస్టిలరీస్ కమిషనర్ పోస్టుల్లో డిప్యూటేషన్‌పై తెచ్చుకున్న అధికారిని కూర్చోబెట్టారు. తద్వారా మొత్తం స్కామ్ సజావుగా సాగేలా చూసుకున్నారు. ఇక... ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న సత్య ప్రసాద్‌ను తమ వ్యూహం ప్రకారం వాసుదేవరెడ్డికి ఓఎస్డీగా నియమించారు. 2019 నవంబరు 27న వైసీపీ పెద్దల సిఫారసుతోనే ఈ నియామకం జరిగింది. తమ దోపిడీకి సహకరిస్తే ఐఏఎస్ హోదా ఇప్పిస్తామని సత్యప్రసాద్‌కు ఎంపీ మిథున్ రెడ్డి హామీ ఇచ్చినట్లు సిట్ విచారణలో తేలింది.

సూటిగా తేలిన లింకు...

'నేను సీఎం ఆఫీసు నుంచి మాట్లాడుతున్నా! కమీషన్లు ఇవ్వకుంటే మీకు ఆర్డర్లు రావు' అని ఎస్ఎన్‌జే కంపెనీ యజమానికి లిక్కర్ స్కామ్ నిందితుడు బూనేటి చాణక్య (ఏ-8) ఫోన్ చేసి సూటిగా చెప్పారని తేలింది. 'ముడుపులు ఇవ్వలేను' అని ఆయన బదులిచ్చారు. దీంతో ఆర్డర్లు ఆగిపోయాయి. ఇది... నాటి ప్రభుత్వ పెద్దలకు చాణక్యతో ఉన్న సంబంధానికి ప్రత్యక్ష నిదర్శనం. ఈ విషయంపై ఎస్ఎన్‌జే కంపెనీ యజమాని వాసుదేవరెడ్డిని కూడా సంప్రదించారు. "అవును! ఆ వ్యక్తి ప్రభుత్వ పెద్దల తాలుకానే. కమీషన్ ఇస్తేనే ఆర్డర్లు ఇస్తారు" అని చెప్పడంతో ఎస్ఎన్‌జే యాజమాన్యం కమీషన్లు చెల్లించేందుకు సంసిద్ధత వ్యక్తంచేసింది. ఆ వెంటనే వారి బ్రాండ్ లిక్కర్‌కు ఆర్డర్లు మొదలయ్యాయి. జగన్ 'సిఫారసు సంతకం'తో నియమితుడైన అధికారే.. వసూళ్ల బ్యాచ్ గురించి డిస్టిలరీ యజమానికి చెప్పడం గమనార్హం. వెరసి... ఇదంతా అప్పటి ముఖ్యమంత్రికి తెలిసే జరిగిందని సిట్ నిర్ధారణకు వచ్చింది. దీనికి తోడు జగన్ కుటుంబానికి చెందిన భారతీ సిమెంటు కంపెనీలో శాశ్వత డైరెక్టర్ అయిన బాలాజీ గోవిందప్ప హైదరాబాద్‌లోని భారతీ సిమెంట్స్ ఆఫీసులో లిక్కర్ వ్యాపారులతో సమావేశమైన వివరాలు గూగుల్ టేకౌట్ ద్వారా సేకరించిన సిట్... తాడేపల్లి ప్యాలెస్ పెద్దకు ఉచ్చు బిగిస్తోంది.

'ముందస్తు' జాగ్రత్తలు

లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే 12మంది జైల్లో ఉండగా మరో 12మంది కోసం కోర్టు నుంచి సిట్ అధికారులు నాన్ బెయిలబుల్ వారెంట్లు పొందారు. కీలక సూత్రధారి మిథున్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, జగన్ మాజీ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి తదితరులకు స్థానిక కోర్టు నుంచి సుప్రీం దాకా ఎక్కడా ఊరట లభించలేదు. ఈ స్కామ్‌లో బలమైన ఆధారాలు ఉండటమే దీనికి కారణం. ప్రాథమిక చార్జిషీటులో జగన్ పాత్రపై 'సిట్' నిర్దిష్టంగా ప్రస్తావించింది. ఇప్పుడు...వాసుదేవరెడ్డి నియామకంలో ప్రత్యక్ష ప్రమేయంపై ఆధారాలు సేకరించింది. ఇటీవల నేరుగా జగన్ కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్ కార్యాలయంలోనూ అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో... తాడేపల్లి ప్యాలెస్‌లో కలవరం మొదలైంది. తననూ అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తుండటంతో... జగన్ బెంగళూరు ప్యాలెస్‌లో తన పార్టీ రాజ్యసభ సభ్యుడైన న్యాయవాది బృందాన్ని అన్ని విధాలా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఏ క్షణం సిట్ నోటీసు వచ్చినా కోర్టుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్లు వేసేందుకు వైసీపీ లీగల్ టీమ్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. 200 కోట్లు కూడా లేని ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నాటి ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆ తర్వాత సీఎంగా ఉన్న కేజ్రీవాల్ అరెస్టయ్యారు. తెలంగాణ మాజీ సీఎం కుమార్తె కవితకూ కటకటాలు తప్పలేదు. ఇంకా... ఛత్తీస్‌గఢ్‌లో మాజీ సీఎం భూపేష్ భఘేల్ కుమారుడు చైతన్యను ఈడీ అరెస్టు చేసింది. అక్కడ ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించి రూ.2500కోట్ల అనధికారిక లావాదేవీలు జరిపిందని 70 మందిపై అభియోగాలు మోపింది. ఏపీ లిక్కర్ స్కామ్‌పైనా ఈడీ దృష్టి సారించింది. దీంతో పోల్చితే మిగిలిన రాష్ట్రాల్లో జరిగిన కుంభకోణాలు చాలా తక్కువ. కీలక పోస్టుల్లో వాసుదేవరెడ్డి నియామకం... ఆటోమెటిక్ మద్యం ఆర్డర్లు పెట్టే సీ-టెల్‌ను నిర్వీర్యం చేయడం నుంచి డిజిటల్ పేమెంట్లకు ఆస్కారం లేకుండా నగదు లావాదేవీలు జరపడం వరకు... పకడ్బందీగా జరిగింది. వీటికి సంబంధించిన సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాలను సిట్ సేకరించింది.

'లిక్కర్ గ్యాంగ్' పిటిషన్లు వాయిదా

విజయవాడ, జూలై 29(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులు విడివిడిగా దాఖలు చేసిన పలు పిటిషన్లు కోర్టులో వాయిదా పడ్డాయి. ఏ2 డి.వాసుదేవరెడ్డి, ఏ3 డి.సత్యప్రసాద్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మంగళవారం జరగాల్సిన విచారణను ఏసీబీ కోర్టు 31కి వాయిదా వేసింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పీఏలు బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై జరగాల్సిన వాదనలు 1వ తేదీకి వాయిదా పడ్డాయి. కె.ధనంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనలను కోర్టు 1వ తేదీకి వాయిదా వేసింది. స్విమ్స్‌లో ఫిజియోథెరపి చేయించుకోవడానికి అనుమతి ఇవ్వాలని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ అదే తేదీకి వాయిదా పడింది. ఎంపీ మిథున్‌రెడ్డి ములాఖత్‌లపై జైలు అధికారులు దాఖలు చేసిన పిటిషన్, ఎంపీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణనూ 1వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయాధికారి పి. భాస్కరరావు ఆదేశాలు జారీ చేశారు.

పోలీసులు ఎలా బెదిరిస్తారో బాగా తెలుసు

- కేసుల రాజీకి ఎంత ఒత్తిడి తెస్తారో కూడా తెలుసు
- మాకేమీ తెలియదని అనుకోవద్దు: హైకోర్టు
- ఎస్‌హెచ్‌వోకు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచన

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): కేసు రాజీ చేసుకోవాలని స్టేషన్‌కు పిలిచి పోలీసులు ఎంత ఒత్తిడి చేస్తారో, ఎలా బెదిరిస్తారో తమకు బాగా తెలుసని హైకోర్టు పేర్కొంది. పోలీసుల ఒత్తిడి చేస్తున్నారంటూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆరోపణల్లో వాస్తవం లేదన్న ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) వాదనను తోసిపుచ్చింది. తమకు ఏమీ తెలియదని అనుకోవద్దని వ్యాఖ్యానించింది. ఇలాంటి చర్యలకు పాల్పడకుండా సంబంధిత ఎస్‌హెచ్‌వోకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎస్‌జీపీకి సూచించింది. కౌన్సిలింగ్ అంటే పోలీసులు ఇచ్చే విధానంలో కాదని తెలిపింది. బెదిరింపులకు, ఒత్తిళ్లకు పాల్పడకుండా ఎస్‌హెచ్‌వోకు తగిన సూచనలు చేయాలని పేర్కొంది. పిటిషనర్ భర్త విషయంలో జోక్యం చేసుకోవద్దని ఎస్‌హెచ్‌వోకు స్పష్టం చేసింది. వ్యాజ్యంపై విచారణను మూసివేసింది. కేసును రాజీ చేసుకోవాలని పోలీసులు ఒత్తిడి చేస్తే కోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్ భర్తకు వెసులుబాటు ఇచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. తన భర్త పఠాన్ కరీంసాను పిడుగురాళ్ల పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరుపర్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆయన సతీమణి పఠాన్ సైదాబీ హెబియస్ కార్పస్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం విచారణ జరిపిన ధర్మాసనం కరీంసాను స్థానిక కోర్టులో హాజరుపర్చి, అతని వాంగ్మూలాన్ని నమోదు చేయించాలని పోలీసులను ఆదేశించింది. మంగళవారం తమ ముందు హాజరుపర్చాలని స్పష్టం చేసింది. మంగళవారం వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా పఠాన్ కరీంసా కోర్టు ముందు హాజరయ్యారు. పోలీసులు ఎప్పుడు అదుపులోకి తీసుకున్నారు? ఎప్పుడు వదిలేశారు? అనే వివరాలు ధర్మాసనం అడిగి తెలుసుకొంది. కరీంసా కోర్టు ముందు హాజరైన నేపథ్యంలో పిటిషన్‌పై విచారణను మూసివేస్తామని ప్రకటించింది. పిటిషనర్ తరపు న్యాయవాది సూరపరెడ్డి గౌతమి, ఎస్‌జీపీ టి.విష్ణుతేజ వాదనలు వినిపించారు.

సాగర్ గేట్లెత్తారు

18 ఏళ్ల తర్వాత జూలైలోనే నీటి విడుదల

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

నాగార్జున సాగర్ డ్యాం నిండుకుండలా మారడంతో మొత్తం 26 గేట్లనూ 5 అడుగుల మేర ఎత్తి దిగువకు 2.10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తెలంగాణ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉదయం 10గంటలకు సాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తారు. డ్యాం నీటినిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలకు గాను, ప్రస్తుతం 305.74 టీఎంసీల నిల్వ ఉంది. సాగర్‌కు 2,28,900 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జూలైలో సాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడం గత 18 ఏళ్లలో ఇదే తొలిసారి. ఇక పులిచింతలలో నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను, ప్రస్తుతం 28.64 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పులిచింతల మూడు గేట్లను 3అడుగుల మేర ఎత్తి 47,256 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 18వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు బుధవారం ఉదయానికి ప్రకాశం బ్యారేజీకి చేరుకుంటుందని నీటి పారుదల శాఖ అధికారి మోహనరావు తెలిపారు.

శ్రీశైలం 8 గేట్లు ఎత్తివేత..

ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో శ్రీశైలం డ్యాం 8 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువకు 2,16,520 క్యూసెక్కులు. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పాదన నిమిత్తం మరో 65,712 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల నుంచి 2,67,850 క్యూసెక్కుల వరద శ్రీశైలం డ్యాంలోకి వచ్చి చేరుతోంది. డ్యాం నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.80 అడుగులకు చేరింది. ప్రస్తుతం 203.4290 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మళ్లీ పెరిగిన గోదారి ఉధృతి

గోదావరి వరద పెరుగుతూ, తగ్గుతూ దోబూచులాడుతోంది. సోమవారం స్వల్పంగా తగ్గిన నీటిమట్టం మంగళవారం నాటికి మళ్లీ పెరిగింది. పోలవరం ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతోంది. అదనంగా వస్తున్న 6,70,355 క్యూసెక్కులను స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 35.30 అడుగులకు చేరుకుంది.

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేవారిపై చర్యలు తప్పనిసరి

- లేదంటే ఐదుకోట్లమంది జీవించే హక్కుకు భంగకరం
- అభివృద్ధికి కోర్టులూ తమ పరిధిలో సాయమందించాలి
- తప్పుచేసినవారు భయపడాలి
- నేరస్థుడికి ఊరట దొరికే పరిస్థితి ఉండరాదు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్
- ఆయనను సత్కరించిన హైకోర్టు లాయర్ల సంఘం

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): బావవ్యక్తీకరణ, వాక్ స్వాతంత్ర్యం పేరుతో నోటికి వచ్చినట్లు మాట్లాడి ఇతరుల ఆత్మాభిమానం, గౌరవానికి భంగం కలిగించే హక్కు ఏ ఒక్కరికీ లేదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టుదేవానంద్ అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే న్యాయస్థానాలు శిక్షిస్తాయనే భయం ఉంటే ఎవరూ తప్పు చేయరన్నారు. తప్పు చేసినాసరే న్యాయస్థానానికి వెళ్తే ఉపశమనం లభిస్తుందనే భావన నేరస్థుడిలో కలిగితే అది న్యాయవ్యవస్థకి, ప్రజాస్వామ్యానికి, పౌరుల హక్కులకు గొడ్డలిపెట్టు అన్నారు. ప్రజలు న్యాయవ్యవస్థ మీద విశ్వాసం కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. మద్రాసు హైకోర్టు నుంచి ఏపీ హైకోర్టుకు తిరిగి వచ్చి బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బట్టుదేవానంద్‌ను ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జస్టిస్ దేవానంద్ మాట్లాడుతూ.... న్యాయం కోరే అభాగ్యులకు న్యాయం చేయాల్సిన బాధ్యత కోర్టులపై ఉందన్నారు. మద్రాసు హైకోర్టు నుండి సొంత రాష్ట్రానికి, సొంత మనుషులు మధ్యకు తిరిగి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. "తప్పుచేసేవాడు చట్టం అన్నా, కోర్టు అన్నా భయపడాలి. చట్టంలో ఉన్న లొసుగులను అడ్డం పెట్టుకొని అరాచకాలు, తప్పులు చేసేవాళ్లు న్యాయస్థానాలను అడ్డంపెట్టుకొని ఉపశమనం పొందేలా కోర్టులు వ్యవహరించరాదు. రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించేవారి పై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోయినా, కోర్టులు కఠినంగా వ్యవహరించకపోయినా ఐదుకోట్ల మంది జీవించే హక్కుకు భంగం కలిగించినట్లే అవుతుంది." అని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మెరుగైన వైద్యం అందించేలా పెద్ద ఆస్పత్రులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగ అవకాశాలు పెరగాలంటే పారిశ్రామికవేత్తలు రావాలని పేర్కొన్నారు. అయితే, తమకు భవిష్యత్తు ఉంటుందని నమ్మకం లేకుండా పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సామాన్యుడికి అభివృద్ధి ఫలాలు అందాలన్నా న్యాయస్థానాలు కూడా రాజ్యాంగపరంగా, చట్టపరంగా వాటికి ఉన్న అధికారాలతో రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. న్యాయవాదులు సమాజంపట్ల తమ గురుతర బాధ్యతను నిర్వర్తిస్తారని ఆశిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) చల్లా ధనంజయ, అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాదులు కేవీస్ మూర్తి, పి.వేణుగోపాలరావు పాల్గొని ప్రసంగించారు.

తోపుదుర్తిపై తొందరపాటు చర్యలు వద్దు: హైకోర్టు

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లాలో పర్యటన సందర్భంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో రామగిరి పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. పోలీసుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీలోత్పల్ వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుత కేసులో పిటిషనర్‌పై నమోదు చేసిన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనన్నారు. తోపుదుర్తి తరపున న్యాయవాది సాయి శరణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌ను అరెస్టు చేస్తారనే ఆందోళన ఉందన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు పిటిషనర్ విషయంలో రెండు వారాలపాటు తొందరపాటు చర్యలు తీసుకోవద్దన్నారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

రేషన్ షాపు విధానమే బాగుంది

పిల్లలందరికీ 'తల్లికి వందనం' సొమ్ము

- 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'లో వైసీపీ నేతలకు ఓ మహిళ ఝలక్

అంబాజీపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల్లో తప్పులను ఎత్తిచూపే ఉద్దేశంతో నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంలో వైసీపీ నేతలకు ప్రజలు ఝలక్ ఇస్తున్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం వక్కలంక గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఓ మహిళ ఇచ్చిన సమాధానంతో వారంతా కంగుతిన్నారు. 'వైసీపీ హయాంలో ఇంటింటికీ రేషన్ పంపిణీగా బాగుందా... కూటమి ప్రభుత్వంలో రేషన్ షాపునకు వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకునే విధానం బాగుందా?' అని వైసీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ ఓ మహిళను ప్రశ్నించారు. రేషన్ దుకాణం నుంచి తెచ్చుకోవడమే బాగుందని ఆమె సమాధానం ఇవ్వడంతో అక్కడున్న నేతలంతా నివ్వెరపోయారు. 'సీఎం చంద్రబాబు మిమ్మల్ని మోసం చేయలేదా?' అని మరో ప్రశ్న వేశారు. 'మా ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం సొమ్ములు బ్యాంకు ఖాతాలో జమ చేశారు' అని ఆమె స్పష్టం చేయడంతో వైసీపీ నేతలు అక్కడి నుంచి మౌనంగా జారుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



అంబాజీపేట మండలం వక్కలంకలో వైసీపీ నేతలకు సమాధానం చెబుతున్న మహిళ

సరస్వతి పవర్ షేర్ల బదిలీ నిలిపివేత

కన్న తల్లి, చెల్లిపై కోర్టుకెక్కిన జగన్.. ట్రైబ్యునల్‌లో అనుకూలంగా తీర్పు

- విజయలక్ష్మి ఢిల్లీ ట్రైబ్యునల్‌కు వెళ్లే చాన్స్

హైదరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సరస్వతి పవర్ కంపెనీ షేర్ల బదిలీ వ్యవహారంలో కన్నతల్లి, తోడబుట్టిన చెల్లిపై జగన్ చేసిన న్యాయపోరాటంలో ఆయనదే పైచేయి అయింది. హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్సీఎల్టీ) వేదికగా తల్లి వైఎస్ విజయలక్ష్మిపై చేసిన న్యాయపోరాటంలో జగన్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. సరస్వతి పవర్ కంపెనీలో జగన్, ఆయన భార్య భారతి, వారి కంపెనీ క్లాసిక్ రియాల్టీకి ఉన్న 51.01శాతం షేర్లను తల్లి విజయలక్ష్మి పేరిట బదిలీ చేయడాన్ని నిలిపేస్తూ ఎన్సీఎల్టీ మంగళవారం తీర్పు ఇచ్చింది. సరస్వతి పవర్‌లో 51.01 శాతం వాటా తమదేనని... ఈ వాటాను తమకు తెలియకుండా తల్లి, చెల్లి(షర్మిల) అక్రమంగా బదిలీ చేసుకున్నారని.. ఈ బదిలీని రద్దు చేసి తమ వాటాను పునరుద్ధరించాలని కోరుతూ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీలు ఎన్సీఎల్టీలో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌లో అటు జగన్, ఇటు విజయలక్ష్మి, షర్మిల తరపున వాదనలు మే 7న ముగిశాయి. ఈ నెల 15న తీర్పు రిజర్వు చేసిన ట్రైబ్యునల్ న్యాయమూర్తులు జస్టిస్ రాజీవ్ భరద్వాజ్, జస్టిస్ సంయజ్‌పురి తాజాగా ఉత్తర్వులు వెలువరించారు. ఇది తమ తండ్రి సంపాయించిన ఆస్తి కాదని.. చెల్లెలు షర్మిలపై ప్రేమ, అనురాగంతో సర్వసతి పవర్ కంపెనీలో తమకు ఉన్న 51.01 శాతం వాటాను ఈడీ కేసులు ముగిసిన తర్వాత ఇద్దామని అనుకున్నామని జగన్ గత వాదనల సందర్భంగా ట్రైబ్యునల్‌కు తెలిపారు. అయితే.. తల్లిపై ఒత్తిడి తెచ్చి చెల్లి తన పేరిట వాటాలు బదిలీ చేయించుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. చెల్లికి సరస్వతి పవర్‌లో వాటా ఇచ్చే ఉద్దేశం లేదని, దీంతో ఎంవోయూ, గిఫ్ట్ డీడ్ రద్దు చేసుకున్నానని జగన్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. జూలై 2న సరస్వతి పవర్ బోర్డు నిర్ణయం తీసుకుందని, తప్పుడు పత్రాలు సృష్టించిందని తెలిపారు. తల్లి, చెల్లి మోసం చేసి తన వాటా బదిలీ చేసుకున్నారని జగన్ పేర్కొన్నారు. ఈ వాదనలతో ఏకీభవించిన ఎన్సీఎల్టీ జగన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కాగా, ప్రస్తుతం ఎన్సీఎల్టీ ఇచ్చిన తీర్పుపై వైఎస్ విజయలక్ష్మి.. ఢిల్లీలోని ఎన్సీఎల్ఏటీలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది.

తల్లికి ఆస్తిలో వాటా ఇవ్వకపోవడం గెలుపా?

- 'సరస్వతి' షేర్లలో జగన్ తీరుపై మంత్రి అనిత ఫైర్



అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): "ఎవరైనా ప్రత్యర్థులపై విజయం సాధిస్తే సంబరాలు చేసుకుంటారు. కానీ, జగన్ 'రివర్స్' అనే పదానికి బ్రాండ్ అంబాసిండర్. అందుకే సొంత తల్లి, చెల్లిపై విజయాన్ని కూడా గొప్పగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఇది కూడా ఓ గెలుపేనా జగన్?" అని హోంమంత్రి అనిత ప్రశ్నించారు. సరస్వతి పవర్ షేర్ల బదిలీ వివాదంలో తల్లి, చెల్లిపై కేసులు వేసిన జగన్, నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో తనకు అనుకూలంగా వచ్చిన తీర్పుపై సోషల్ మీడియాలో గొప్పగా ప్రచారం చేసుకుంటుండటంపై అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తి కోసం తల్లిని, చెల్లిని కోర్టుకు లాగి, నైతిక విలువలు లేకుండా వ్యవహరించిన జగన్ ప్రజా జీవితానికి ఏ విధంగా అర్హుడని ప్రశ్నించారు. ఆర్థిక సంబంధాలు తప్ప మానవసంబంధాలు లేని వ్యక్తి నాయకుడు ఎలా అవుతారని నిలదీశారు. సొంత తల్లి, చెల్లిపై తాత్కాలికంగా పైచేయి సాధించడాన్ని కూడా గొప్ప విజయంగా ప్రచారం చేయించుకోవడం ద్వారా తన సైకో మనస్తత్వాన్ని చాటుకున్నారని విమర్శించారు. 2019 ఎన్నికల్లో గెలుపు కోసం తల్లి, చెల్లిని అడ్డం పెట్టుకుని, ఆ సమయంలో దానకర్ణుడిలా షేర్ల ను పంపకాలు చేసిన జగన్, వారి అవసరం తీరిపోగానే వెనక్కి లాక్కోవడం ఏమిటన్నారు.

కుటుంబసభ్యులపైనే కుట్ర..

"వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే సరస్వతి పవర్‌లో విజయమ్మ షేర్ హోల్డర్‌గా ఉన్నారు. వైఎస్ హయాంలోనే పల్నాడులో సరస్వతి పవర్‌కు భూములు కేటాయించారు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక లీజు పొడిగించుకున్నారు. అలాగే.. కృష్ణా నది నుంచి నిరంతరం నీటి సరఫరా ఉండేలా ఉత్తర్వులు ఇచ్చారు. 2019 ఎన్నికల ముందు ఫ్రాన్స్‌కు చెందిన వీఐసీఏటీ సంస్థ భారతీ సిమెంట్స్‌లో రూ.5 వేల కోట్లతో 51 శాతం షేర్లు కొనుగోలు చేసింది. మిగిలిన 49 శాతం షేర్లలో జగన్‌కు, షర్మిలకు వాటాలున్నాయి. అయితే, షర్మిలకు ఇవ్వాల్సిన వాటా కూడా జగన్ ఇవ్వలేదు. ఆ తర్వాత కుటుంబ ఆస్తులు పంచుకున్న క్రమంలో సరస్వతి పవర్‌లో జగన్ తల్లి విజయలక్ష్మికి 100 శాతం వాటా వచ్చింది. దీనికి బదులుగా జగన్‌కు బెంగళూరులో ఆస్తులు దక్కాయి. అయితే, మొత్తం సరస్వతి షేర్లు తానే దక్కించుకోవాలన్న ఉద్దేశంతో జగన్ సొంత కుటుంబ సభ్యులపైనే కుట్రకు తెరదీశారు" అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

తురకా కిశోర్‌కు సుప్రీంలో చుక్కెదురు

- పిటిషన్ స్వీకరణకు నిరాకరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్‌కు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఏపీ ప్రభుత్వం తనపై వరుసగా కేసులు నమోదు చేస్తోందని, ఇకపై ఎటువంటి ఎఫ్ఐఆర్ తనపై నమోదు చేయకుండా తగు ఆదేశాలివ్వాలని కోరుతూ ఈ నెల 25న సుప్రీం కోర్టులో కిశోర్ పిటిషన్ వేశారు. ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత ఇప్పటి వరకు తనపై తొమ్మిది కేసులు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ పిటిషన్ మంగళవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ముందే కేసులు నమోదు చేస్తారని మీరెలా చెబుతున్నారు? అని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఇప్పటి వరకు వరుసగా, ఒకదాని తర్వాత మరొకటి... కేసులు నమోదు చేస్తూ వచ్చారు. మరికొన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని మాకు తెలిసింది. అందుకే ముందస్తు జాగ్రత్తలో భాగంగా సుప్రీం కోర్టును ఆశ్రయించాం' అని న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వాదనలతో విభేదించిన ధర్మాసనం రిట్ పిటిషన్ విచారణకు స్వీకరించడానికి నిరాకరించింది.

గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు సాంకేతికతను వినియోగించాలి: సీఎస్

అమరావతి, జూలై 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర విభాగాల సమన్వయంతో గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర స్థాయి రెండో త్రైమాసిక నార్కో కోఆర్డినేషన్ టీమ్ (ఎన్కోఆర్డీ) సమావేశం సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... 'గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండేందుకు యువతకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలి. వీటి నియంత్రణకు ఈగల్ టీమ్ పెద్ద ఎత్తున సాంకేతికతను వినియోగించాలి. ఉత్తరాంధ్రలో గంజాయి సాగు నియంత్రణకు సాంకేతికతను వినియోగిస్తున్నారు. గంజాయికి బదులు కాఫీ, సిల్వర్ ఓక్ వంటి మొక్కలను అందించి, గిరిజనుల జీవనోపాధికి తోడ్పడటం అభినందనీయం'అనిఅన్నారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు అంతర రాష్ట్ర చెక్‌పోస్టులను పటిష్ఠం చేయాల్సి ఉందన్నారు. ఈగల్ చీఫ్ రవికృష్ణ మాట్లాడుతూ, ఇప్పటి వర కు 911 కేసులు నమోదు చేసి, గంజాయి, వాహనాలను పట్టుకున్నట్లు వివరించారు.

తీవ్రంగా ఎండ.. బలహీనంగా రుతుపవనాలు

- జంగమహేశ్వరపురంలో 37 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రుతుపవనాలు పూర్తిగా బలహీనపడ్డాయి. బంగాళాఖాతం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి రావట్లేదు. అదే సమయంలో పడమర దిశ నుంచి వేడి గాలులు వీస్తున్నాయి. దీంతో మంగళవారం ఉదయం నుంచే ఎండ తీవ్రంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3నుంచి 5డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. జంగమ హేశ్వరపురంలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24గంటల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షా లు కురుస్తాయని, మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. మరో మూడు, నాలుగు రోజులు ఎక్కువ ప్రాంతాల్లో పొడి వాతావరణం ఉంటుందని పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.